# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 19, సంచిక: 9, సెప్టెంబర్ 2026

వెల: రూ. 25/-





# శ్రీవేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 19 సంచిక: 9

సలహాదారులు, స్ఫూర్తిదాత,
కర్త, కర్మ, క్రియ మా ప్రభు
**తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు**

ప్రధాన సంపాదకులు:
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
**డా॥ టి. గౌరీశంకర్**

ఫొటోగ్రాఫర్: పత్తి సుబ్రమణ్యం,
శ్రీనివాస మంగాపురం

డి.టి.పి & డిజైన్:
సాయినాథ్, రమేష్



**Email:**
srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.srivenkatesham.org
Phone: **040–27175050**
Cell: **9348212354**


**లోపలి పేజీల్లో**


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| ఆహ్వానము | 6 |
| పురాణాలు తెలిసిన వినాయకుడు | 8 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం | 9 |
| శ్రీకృష్ణావతారం | 22 |
| భక్తులపాలిటి కల్పతరువు–శ్రీ గణేశుడు | 24 |
| గణేశ చతుర్థి | 27 |
| మార్గదర్శకులు – మహర్షులు | 29 |
| రామాయణ రత్నాకరం (సీరియల్) | 36 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం (సీరియల్) | 40 |
| జయదేవుని 'గీత గోవిందము' (సీరియల్) | 47 |
| తిరుమల సర్వస్వం (సీరియల్) | 51 |
| భవ్యమైన మాసం – భాద్రపదమాసం | 57 |
| గజాసురుడు | 60 |
| శ్రవణ ద్వాదశి వ్రతము | 61 |
| రూపాయి హారతి | 63 |
| మీ ప్రశ్న మా సమాధానం | 64 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |


## భక్త ప్రియుడు

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు భక్తుల ఉద్ధరణే లక్ష్యంగా ఎన్నో పనులు చేస్తున్నాడు. గతంలో 21 అవతారములను ఎత్తి దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేశాడు. ముఖ్యంగా శ్రీకృష్ణ అవతారములో వారు చూపిన లీలలు, చేసిన పనులు మన జీవితానికి ఎంతో ఉపయుక్తముగా ఉన్నాయి. భగవద్గీత, ఉద్ధవగీతలను బోధించాడు. విష్ణు సహస్రనామమును లోకానికి అందేవిధంగా చేశాడు. మానవ జీవితం ఏ విధంగా నడవాలో సూచించాడు. ఆ తరువాత శ్రీకృష్ణుడే శ్రీవేంకటేశ్వరుడిగా తిరుమల కొండపై భక్తుల ఉద్ధరణకై అర్చామూర్తిగా వెలశాడు. ఈయన కదలడు, పలకడు, ఉలకడు కాని సమస్త పనులను సంకల్ప మాత్రమున చేయుచున్నాడు. ఈయన ఎంతటి భక్తప్రియుడంటే "శ్రీవేంకటేశ సమో దేవో నభూతో నభవిష్యతి" అనే విధంగా పేరు తెచ్చుకున్నాడు. స్వామివారిని స్మరిస్తే... దర్శిస్తే సమస్త పాపాలు తొలగిపోతాయట. ఇక వీరి సమ్మోహన శక్తి అంతా ఇంతా కాదు. మూడు రోజులు క్యూలో నిలబడి క్షణమాత్రపు దర్శనముతో సంతోషిస్తున్నారు. దర్శనము తరువాత భక్తులు పొందే తృప్తి వర్ణించనలవి కాదు. సుదూర ప్రాంతాల నుండి శ్రమకోర్చి ప్రయాణించి స్వామివారి క్షణకాలపు దర్శనానికి ఉరుకులు పరుగులు పెడుతున్నారు. మొత్తం ఈ విశ్వంలో రోజుకు ఇంతమంది దర్శించు ఆలయం మరొకటి లేదు. ఇంతటి ఆదాయము సమకూర్చు ఆలయము కూడా మరొకటి లేదంటే... వీరి పట్ల భక్తుల విశ్వాసం ఎంతటిదో తెలుస్తుంది. అలాంటి శ్రీవేంకటేశ్వరుడు భక్తుల ఉద్ధరణే లక్ష్యంగా ఎన్నో ఎన్నెన్నో లీలలను సాగిస్తున్నారు. తిరుమల శ్రీవేంకటేశ్వరుని లీలల్లో భాగంగా 2002 సంవత్సరంలో స్వామివారికి ప్రతి సంవత్సరం 7 కోట్ల జప సమర్పణ అనే కార్యక్రమమును చేపట్టడం జరిగింది. ప్రస్తుతం 24వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణను వచ్చే గోకులాష్టమి తేది 04-09-2026 నాడు తిరుపతిలో సమర్పిస్తున్నాము. జపము వ్రాసిన వారి కోరికలు తీర్చండని జప హోమాదులు నిర్వహించి స్వామివారికి తిరుపతిలో సమర్పిస్తున్నాము. మరియు అక్కడనే 25వ పర్యాయంగా 7 కోట్ల జప సంకల్పం కూడా తీసుకొనుట జరుగుతుంది. ఈ 7 కోట్ల కార్యక్రమములో 70 వేల మంది భక్తులు భాగస్వాములు అయినారు. ఇదే విధంగా లోక కళ్యాణార్థం మాచే "హరినామక్షేత్రం" శంకుస్థాపన కూడా తేది 02-07-2026 నాడు కావించాడు. దీనిలో కూడా వీలైనంత ఎక్కువమంది భక్తులు భాగస్వాములు కావాలని స్వామివారి అభిమతం. తిరుమల ఆలయం నిర్మించు సమయాన మనము భాగస్వాములం కాలేదు. కాని, స్వామివారి ఆదేశముచే మరో తిరుమల లాగా నిర్మించు ఈ 'హరినామక్షేత్రం' (తిరుమల ఆలయ ప్రతిరూప నిర్మాణము) లో భాగస్వాములం అవుదాం. దేవాలయం శాశ్వతం, మనము అశాశ్వతం. కావున ఈ ఆలయములో యథాశక్తి పాలు పంచుకోగలరని ఆశిస్తున్నాము. ఈ ఆలయం కొరకు స్వామివారు చూపిన లీలలు 'దిశా నిర్దేశం' పేరుతో ప్రచురిస్తున్నామనే విషయం పాఠకులకు సుపరిచితం. అందరము 'హరినామక్షేత్రము' నిర్మాణంలో భాగస్వాములుగా కావడమనేది స్వామివారి ఆదేశం. మనం సంపాదించిన ఆస్తి, మనవారు అనుకున్నవారు ఎవరు మనవారు కారు. మనము అశాశ్వతము. దేవాలయము శాశ్వతము. పైగా స్వామివారి ఆజ్ఞ కాబట్టి పాఠకులందరూ యథాశక్తి హరినామక్షేత్ర నిర్మాణంలో పాలు పంచుకుందాం! తిరుమల శ్రీవేంకటేశ్వరుని కృపను పొందుదాం! నమో వేంకటేశాయ!

నమో వేంకటేశాయ
వినా వేంకటేశం న నాథో న నాథః ।
సదా వేంకటేశం స్మరామి స్మరామి॥

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి** (గోవిందదాసు)

# చందా వివరాలు

(రూ.లలో)

| | |
|---|---|
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 5,000-00 |
| ☐ పోషకులు | 10,000-00 |
| ☐ రాజపోషకులు | 50,000-00 |

**9348212354**

నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి. లేదా శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్‌డ్ చెక్‌ను లేదా

**Srivenkatesham**

A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు:______________________

______________________

చిరునామా:______________________

______________________

______________________

______________________

______________________

పిన్‌కోడ్:______________________

చందా వివరాలు:______________________

మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

చందాదారులకు
స్వామివారి పవిత్ర పాదాలు
(10"x8") **ఉచితం**




# శ్రీ వేంకటేశ్వర స్తుతి


– డా॥ కె.వి. రాఘవాచార్యులు


శ్లో ॥తామ్రోదరద్యుతి పరాజిత పద్మరాగౌ
బాహ్యై ర్మహోభి రభిభూత మహేంద్రనీలౌ ।
ఉద్యన్నఖాంశుభి రుదస్త శశాంక భాసౌ
శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే ॥

తాత్పర్యం – వేంకటేశ్వరా! నీ పాదములు అరికాళ్ళలోని ఎర్రని కాంతులనే పద్మరాగమణులను, బయటి నీలపు కాంతులచే ఇంద్రనీల మణులను, గోళ్ళ తెల్లని కాంతుల చేత చంద్రుని జయించినవి. అట్టి నీ శ్రీ పాదములను శరణు వేడుచున్నాను.

శ్లో ॥సప్రేమ భీతి కమాలా కరపల్లవాభ్యాం
సంవాహనే ఽపి సపది క్లమ మాదధానౌ ।
కాంతా వవాఙ్మనస గోచర సౌకుమార్యౌ
శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే ॥

తాత్పర్యం – వేంకటేశ్వరా! లక్ష్మీదేవి ప్రేమతో, భయముతో నీ పాదములను వత్తవలెనని చిగుళ్ళవంటి తన చేతులతో తాకినంతనే నీ పాదములు కందిపోయినవి. సుందరమైనవి, వాక్కుకు మనస్సుకు అందని సౌకుమార్యము గల్గిన నీ పాదములను శరణు వేడుచున్నాను.

# ముక్తిమార్గము



## మలహరి

వలెనను వారిదె – వైష్ణవము – ఇది
వలపుఁ దేనెపో – వైష్ణవము ॥ పల్లవి ॥

1. కోరికలుడుగుచు – గుఱి నిన్నిటిపై
వైరాగ్యమై పో – వైష్ణవము
సారెకుఁ గోపముఁ – జలముఁదనలో
వారించుట పో – వైష్ణవము ॥ వలె ॥

2. సుడిగొను దేహపు – సుఖదుఃఖములో
వడిఁ జొరనిదె పో – వైష్ణవము
ముడివడి ఇంద్రియ – ముల కింకరుఁడై
వడఁబడనిదె పో – వైష్ణవము ॥ వలె ॥

3. ఉదుటునఁ దన సక – లోపాయంబులు
వదలుట పో నిజ – వైష్ణవము
ఎదుటను శ్రీవేంక – టేశ్వరు నామము
వదనము చేర్చుట – వైష్ణవము ॥ వలె ॥





భావము: వైష్ణవ మత సిద్ధాంతము ఎవరు కావలెనని కోరుకుందురో వారికందరికినీ సంబంధించినదే. జాతి దేశాదిభేదములు దానికి లేవు. మఱియు వైష్ణవము పరిమళించు తేనెవలె మధురాతి మధురమైనది.

కోరికలు వదలి భగవత్పరమైన లక్ష్యము కలిగి భోగ్యవస్తువులపై పూర్తిగా వైరాగ్యము కల్గియుండుటే వైష్ణవము. మాటిమాటికీ తనలో తలయెత్తు కోపము, మచ్చరము మున్నగు దుర్గుణములను నివారించుటే వైష్ణవ మత తత్త్వము.

శరీరమునకు సంబంధించినవై సుడివలె చుట్టజుట్టుకొను సుఖదుఃఖాది ద్వంద్వములలో తగులువడక తాను దేహమునకు, సుఖదుఃఖములకు అతీతుడనను భావముతో నుండుటచే వైష్ణవమత రహస్యము. మరియు శ్రోత్రత్వక్చక్షురాదులగు ఇంద్రియములతో బంధింపబడి వాటికి దాసుడై తపింపక నిల్చుటయే వైష్ణవమత సారము.

'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ' అని భగవంతుడానతిచ్చినట్లు పూనికతో సాత్త్విక త్యాగియై తన సకలోపాయములను వదలి భగవంతుని శరణు జొచ్చుటయే నిజమైన వైష్ణవము. శ్రీవేంకటేశ్వరుని పవిత్ర నామము వదనమున జేర్చుటయే, అనగా భక్తితో కీర్తించుటయే వైష్ణవ మతము నందలి పరమ తత్త్వము.

**భావానువాదం:**
**శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య**

## PROGRAMME AT HYDERABAD

Date : **16-08-2026**
Venue : Namo Venkateshaya, Plot No.9/3,
M.Block, Road No. 1 & 2 (1-2-63/10/1)
Kakatiya Nagar, Habsiguda, Hyderabad.
Time : 6.00 P.M Onwards Vishnu Sahasra Nama Parayanam

**PROGRAMME AT TIRUPATHI**

Date : **03-09-2026** Thursday
Venue : Srivari Padala Mandapam, Near Alipiri, Tirupathi
Time : 5.45 P.M Starting of Puja, Vishnu Sahasra Nama Parayanam, submission of **24th Time 7 Crore Japam** at Lotus Feet of Lord Sri Venkateswara.
Date : **04-09-2026** Gokulashtami Day **Friday**
Venue : Tirumala Tirupathi Devasthanam Dairy Farm, Chandragiri Road, Tirupathi.
Time : 8.00 A.M Starting of Puja, Sri Venkateswara Maha Mantra Yagnam & Vishnu Sahasra Nama Parayanam.
11.30A.M : Yagna Purnahuthi by E.O., TTD.
12.00 P.M : Submission of 24th Time 7 Crore Japam into Sri Venkateswara Divya Maha Mantra Sthupam by Sri E.O., TTD., Tirupathi.
At 12.20 P.M : Initiation of 25th SAPTHA KOTI JAPA SANKALPAM by Executive Office, TTD., Tirupathi. Followed by Prasadam.

*Sri Venkateswara Pada Sevak*
**PULLAGURLA SAI REDDY**
**(GOVINDA DASU)**
*Founder and Organiser*
**Sri Venkateshwara Maha Mantra Peetham**

**93482 12354**

తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

చతుర్వింశతి (24వ) పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

# ఆహ్వానము






## శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం

ఇ.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సిగూడ,
హైదరాబాద్-500 007.

040 - 27175050 | 93482 12354, 93488 11223



# నమో వేంకటేశాయ

తిరుమలశ్రీవేంకటేశ్వరునికరుణాకటాక్షములు,దివ్యాశీస్సులు అందరికీ లభించాలనే ఉద్దేశ్యంతో, శ్రీవారి నామస్మరణలోని మాధుర్యమును అందరూ అనుభవించి తరించాలని, దానికి మేము ఒక సాధనముగా ఉపయోగపడాలనే తపనతో ఆయనకు తనివితీరా సేవ చేయాలని, ఆయన సేవే మా పరమ ధర్మంగా భావించి శ్రీవారికి ప్రతి సంవత్సరం 7 కోట్ల జపసమర్పణ సంకల్పంలో భాగంగా తిరుమల శ్రీవేంకటేశ్వరునికి **చతుర్వింశతి (24వ) పర్యాయంగా** 7 కోట్ల జప సమర్పణ కొరకై **16-08-2026** రోజున మా ఆఫీస్ / ఇంటి నుండి 24వ పర్యాయంగా 7 కోట్ల జపము తిరుపతికి పంపుదుము. ఇట్టి జపమును టిటిడి వారి సౌజన్యంతో తేది **03-09-2026** నాడు తిరుపతిలో స్వామివారి పాదాలకు సమర్పించి స్వస్తిశ్రీ పరాభవ నామ సంవత్సర శ్రావణ బహుళ అష్టమి శనివారం అనగా **04-09-2026 గోకులాష్టమి రోజున** తిరుపతిలోని ఎస్.వి.డెయిరీ ఫాంలో, శ్రీవేంకటేశ్వర మహామంత్ర యజ్ఞం చేసి **'శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపము'**లో స్వామివారికి సమర్పించబడును.

**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం**

## తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జప సమర్పణలోని సంకల్పము

1. శ్రీవేంకటేశ్వరుని నామమును అందరికీ తెలుపుతూ, నిర్మలమైన మనస్సుతో స్మరింప, ధ్యానింప చేయుటకు ప్రయత్నించుట. వారందరినీ శ్రీవారి కరుణా కటాక్షములకు, దివ్యమైన ఆశీస్సులకు, అనుగ్రహానికి పాత్రులుగా చేయుట.
2. భక్తులు తమ కోరికలను తీర్చుకొనుటకు ఒక సాధనముగా ఉపయోగపడుట. శ్రీవారి నామమును స్మరించుట వలన కలిగే ఆనందమును అందరికీ తెలియజేసి కృతార్థులమైనట్లు భావించుట.
3. భక్తులలో శ్రీవేంకటేశ్వర స్వామి పట్ల భక్తిని పెంపొందించి ఆయనపై అమితమైన విశ్వాసము, సమర్పణ భావాన్ని కలిగించుటకు మరియు భక్తులకు శ్రీవారి సేవ చేయు భాగ్యమును కల్పించుట.
4. ప్రతిసారీ కనీసం 7 కోట్ల జపమును స్వామివారికి సమర్పించి కనీసం 70 వేల మంది భక్తుల కోరికలను తీర్చుమని శ్రీవేంకటేశ్వరుని ప్రార్థించే భాగ్యమును పొందుట.
5. 2002 నుండి ప్రతి సంవత్సరం 7 కోట్ల జపమును శ్రీవేంకటేశ్వరస్వామికి సమర్పించుచూ 'శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపము'ను శ్రీవారి నామముతో నింపి శ్రీవేంకటేశ్వరుడు మాపై పెట్టిన బాధ్యతను నెరవేర్చినామని సంతోషించుట.
6. శ్రీవేంకటేశ్వరుని నామము \|/ విలువ అనంతము. దానికి విలువ కట్టుట మాకు ఈ జన్మకు సాధ్యము కాదు. కాని దాని విలువను \|/ కోట్ల జపమునకు సరిపెట్టుమని ప్రార్థించి, అంత జపమును సమర్పించి, ఫలితమాశింపక శ్రీవారి తిరునామములో \|/ బిందువులుగా ఇమిడిపోయి ఆ తిలకధారణలోని ఆనందమును అనుభవించుట.
7. ఈ కార్యక్రమములో అందరు భక్తులూ పాలుపంచుకొనేలా ప్రోత్సహించి వారి శక్త్యానుసారం తమ సేవలందించుటకు అవకాశము కల్పించి, నిస్వార్థ సేవతో, ఫలితమాశించకుండా చివరిదాకా సేవ చేయుచూ చిట్టచివరకు ఆ శ్రీవేంకటేశ్వరుని పాదసేవకునిగా మిగిలి అమితానందమును అనుభవించుట.

**శ్రీ వేంకటేశ్వర పాద సేవకుడు**
**పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)**
(వ్యవస్థాపకులు శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)

# పురాణాలు తెలిసిన వినాయకుడు

– కౌతా నిర్మల



భారతదేశంలో అతి ప్రాచీన కాలం నుంచే వినాయకుని పూజ జరుపబడుతోంది. గణపతి గణాధిపత్యం పొంది, పూజలు అందుకుంటూ, తొలి వేలుపు అయినాడు. ముందుగా గణపతి పూజను ఆరంభించిన తర్వాతనే ఏ కార్యమైనా, ఏ ఇతర పూజలైనా, నోములైనా, వ్రతాలైనా ఆరంభిస్తారు. వేదకాలపు ఆరంభానికి ముందునుంచే విఘ్నేశ్వరుని పూజ ఆరంభించబడినట్లుగా తెలుస్తోంది. తాము తలపెట్టిన పనులు ఎటువంటి విఘ్నాలు లేకుండా పూర్తవాలని వినాయకుని పూజించి, ముడుపు కడతారు చాలామంది భక్తులు. తమ పని పూర్తవగానే ఆ భగవంతునికి ముడుపు చెల్లిస్తారు. పురాణాలు విఘ్ననాయకుని గురించి తెలియచేశాయి.

పద్మపురాణంలో పార్వతీదేవి నలుగుపిండితో బాలుని బొమ్మను తయారు చేసి ప్రాణం పోస్తే, శివుని ఆగ్రహానికి గురైన ఆ బాలుని రుద్రుడు ఖండిస్తే, ఆ తర్వాత గజముఖాన్ని ఆ బాలునికి అమర్చి, శివుడు ఆ బాలుని బ్రతికించినట్లుగా వివరించబడింది. పార్వతీ పరమేశ్వరుల చేత ప్రాణం పోయబడినవాడు వినాయకుడు.

స్కందపురాణంలో గౌరీశంకరులు గజరూపాలు ధరించి విహరించడం వల్ల గజముఖుడైన గణపతి జన్మించాడని లిఖించబడింది. ఋగ్వేదము, యజుర్వేదములలో 'గణానాంత్వా గణపతిం హవామహే' అన్న మంత్రం ఎంతో ప్రసిద్ధి చెందింది.

బ్రహ్మవైవర్త పురాణంలో పార్వతీదేవి చేసిన పుణ్యకవ్రత ఫలితంగా పుత్రునికి జన్మనిచ్చిందని, అయితే శనిగ్రహ వక్రదృష్టి ఆ శిశువు మీద ప్రసరించడంతో శిరస్సు మొండెం నుండి వేరుపడిందని, అప్పుడు ఏనుగు తలను తెచ్చి అతికించి ఆ శిశువును బ్రతికించారని చెప్పబడింది.

సామవేదంలో చెప్పబడిన గణపతి సూక్తాలు గణపతి ఆధిక్యాన్ని తెలుపుతున్నాయి. శివపురాణంలో పార్వతిచేత రూపుదిద్దబడిన బాలుని శిరస్సును శివుడు ఖండించాడని, తన అర్థాంగి దుఃఖాన్ని చూసిన మహాదేవుడు, ఉత్తరంవైపు తలపెట్టి పడుకున్న ఏనుగు తలను తెచ్చి బిడ్డకు అతికించి, ఆ బాలుని బ్రతికించి, పార్వతీ దేవికి ఆనందం కలిగించాడని ఉంది.

అధర్వణవేదంలో గణేశతత్త్వం సూచించబడింది.

ఉపనిషత్తులు గణపతి ఉపాసనా విధానాన్ని, మంత్ర బీజాక్షరాలను నిర్ణయించాయి.

వినాయకుని పూజించిన అనంతరం గుంజిళ్ళు తీసి, వినాయకుని అనుగ్రహాన్ని పొందుతారు భక్తులు. ఈ స్వామిని విద్యాధిదేవతగా కొలుస్తారు. వినాయకుని వాహనం మూషికం. వినాయకుని విచిత్ర ఆకారంలోనూ, మూషిక వాహనంలోనూ ఎన్నెన్నో అర్థాలు దాగి ఉన్నాయి. వినాయకుని శిరస్సు విఘ్నాలను తొలగిస్తుంది. ఏకదంతం దుర్మార్గపు పనులను, చెడు భావాలను పోగొట్టి, మంచి మార్గాన నడుచుకోమని బోధిస్తుంది. పెద్ద ఉదరం అన్నింటినీ జీర్ణించుకోవాలని, మంచి విషయాలను నిక్షిప్తం చేసుకోవాలని సూచిస్తుంది. తొండం ఆత్మవిశ్వాసానికి ప్రతీక. పెద్ద చెవులు తాము విన్న విషయాలలో మంచిని గ్రహించి, చెడును వదిలేయాలని హెచ్చరిస్తాయి. గణపతి వాహనమైన మూషికం తమలోని దర్పాన్ని, అహాన్ని అణచివేసేందుకు, కోరికలను అదుపులో పెట్టుకోవాలన్న సూచన. గణేశ పురాణంలో గణేశుని గురించి ఎంతగానో వివరింపబడింది.




# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం స్వామి వారి దివ్య లీలలు

**తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల**

**శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు
**— గోవింద దాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)**

దిశా నిర్దేశం : సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం వెండి వాకిలి వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారీగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వారా ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగా చేయుటకు వీలుగా స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగా ప్రస్తుతపు 42 వ భాగపు లీలల ప్రచురణ. (ఫిబ్రవరి 2023-జూన్ 2023).



## పరిపక్వత చెందలేదని సూచించుట

మా తోటబావి వద్ద హరినామక్షేత్రం ఏర్పాటు గురించి నేను 7 ఎకరములు కేటాయించుకున్నాను. కాని ఈ మధ్యన కొంతమంది స్థపతులతో మాట్లాడినప్పుడు ఆలయానికి మూడు ఎకరములు సరిపోతుందని చెప్పారు. తిరుమల ఆలయం వెండివాకిలి వరకు పరిశీలించగా కూడా మూడు ఎకరములు సరిపోతుందనిపించింది. కాని నేను మాత్రం స్వామివారికి 7 ఎకరములు మాట ఇచ్చాను కాబట్టి మూడు ఎకరములు ఆలయానికి ఇవ్వగా మిగిలిన 4 ఎకరములు (మా అధీనములో ఉన్నప్పటికీ) స్వామివారి కైంకర్యం కోసం వినియోగిస్తానని భావించుకున్నాను.

మరోప్రక్క స్వామివారి శిక్షణ పరాకాష్ఠకు వెళ్ళింది. స్వామివారు ఆశించిన యోగ్యత సాధించుటే దీని ప్రధాన లక్ష్యం అని గ్రహించినప్పటికీ సమస్యలకు వణికిపోవుచున్నాను. ఒకప్రక్క సాధన చేస్తూ మరోప్రక్క రక్షించుమని స్వామివారిని తీవ్రంగా ప్రార్థిస్తున్నాను.

నిన్న రాత్రి పడుకునేముందు నేను స్వామివారికి మా ఊళ్ళో ఉన్న మొత్తం భూమితో పాటు నా సర్వదాస్తిని ధారపోస్తున్నాను స్వీకరించమని వేడుకున్నాను. ఈ విధంగా చేయుట ద్వారా నేను త్వరగా యోగ్యుణ్ణి అవుతానని భావించాను. తొందరగా స్వామివారు స్వీకరిస్తే పని ఐపోతుందని, బాధ నుండి త్వరగా ఉపశమనం లభిస్తుందని భావించాను. కాని స్వామివారు ఆ రాత్రి కలలో ఒక చిత్రం చూపి, నా స్థితిని చూపెట్టారు.

**తేది 20-02-2023 కల:** నేను ఒక ఆధ్యాత్మిక

ఫంక్షన్ ఏర్పాటు చేశాను. దీనికి శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామివారిని కూడా ఆహ్వానించాను. కాని వారు కొంత ఆలస్యంగా వచ్చారు. ఇంతలోపల నేను ఫంక్షన్ మొదలుపెట్టి వచ్చిన భక్తులతో ప్రసంగించాను. నేను మా తోట బావి వద్ద మూడు ఎకరములను స్వామివారికి ఇస్తున్నానన్నాను. ఆ తరువాత శ్రీశ్రీశ్రీ జీయర్ స్వామివారు సమావేశానంతరం తిరిగి పోవుచున్నారు. ఇంతలో ఆయనకు నేను మూడు ఎకరములు ఇస్తున్నాననే విషయం తెలిసింది. వెంటనే నన్ను తన వద్దకు పిలిచి, నీవు మాకు మూడు ఎకరములు ఇస్తున్నావా? అని అడిగారు. అప్పుడు నేను కాదు కాదు నేను దేవునికి ఇస్తున్నానన్నాను. మీకు కాదు దేవునికని అన్నాను. అప్పుడు జీయర్ స్వామివారు ఓహో... అంటూ నిట్టూర్చి వెళ్ళిపోయారు. ఇంతే కల.

దీనర్థం : ఇంకా నా మనస్సు పరిపక్వత చెందలేదని అర్థం. ఇక్కడ మరో విషయం అర్థం కానిది ఉన్నది. దేవుడు ఎవ్వరు? శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి ఎవ్వరు? నేను తేల్చుకోలేదు. యతీశ్వరుడైన శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామివారు నా ప్రభు తిరుమల శ్రీవేంకటేశ్వరుడేనని నమ్మలేదు. మొత్తం మీద నేను సాధన చేయవలసిన స్థితిలో ఉన్నానని సూచించారు. మరియు పరిపక్వత లేని సమర్పణను స్వామివారు స్వీకరించరని కూడా నమ్మాను.

## దివ్యదేశ మూర్తుల ఆశీర్వాదము పొందుట

నా అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించాలి కాబట్టి మొదటి రెండు భాగాలు చూచాయగా (రఫ్ గా) వ్రాసి పెట్టుకున్నాను. ఇంతలో మాకు తమిళనాడులోని దివ్యదేశాలను చూడాలనే కోరిక పుట్టింది. గతంలో స్వామివారు మంచి సౌకర్యవంతమైన బూట్లను కొనిచ్చారు. బహుశా దాని ఆధారంగా తేది 25-02-2023 నుండి 01-03-2023 వరకు శ్రీరంగం, తంజావూరు, కుంభకోణం, చిదంబరం, కంచి మరియు చెన్నై నగరములు తిరిగాము. అక్కడున్న దివ్యదేశములను, ఆలయాలను దర్శించి శ్రీవేంకటేశ్వరుని సంకల్పాన్ని సాధించే విధంగా ఆశీర్వదించమని ప్రార్థించాను. అనుకున్నట్లే తేది 01-03-2023 సాయంత్రం చివరిదైన చెన్నైలోని శ్రీ పార్థసారథి ఆలయాన్ని దర్శించి, వెనుతిరుగునప్పుడు ''నీ కోరిక ప్రకారం ఆశీర్వాదం లభించిందనే'' ఒక స్పష్టమైన హృదయాంతరంగ భావన కలిగింది. దీనితో ఎంతో సంతోషించాను.

## ఇక చాలు గో...వింద

నా అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించాలి కాబట్టి తేది 13-03-2023 వరకు అన్ని సవరణలతో మొదటి భాగము పూర్తైంది. ప్రూఫ్ సిద్ధమైంది. ఈ ప్రూఫ్ ను స్వామి వద్ద పెట్టి, ఇంకా ఏమైనా మార్పులు చేర్పులు ఉంటే సూచించమని ప్రార్థించాను. అప్పుడు స్వామివారు ఈ క్రింది లీలను చూపెట్టి సరిపోయిందని చెప్పారు.

**తేది 14-03-2023 కల :** ఈ రోజు ఉదయం 5.15 గంటలకు నిద్రనుండి మేల్కొను సమాయన గో...వింద అని ఒక భావన నా హృదయాంత రంగములో వెలువడింది. అంటే... ఇక చాలు ఫైనల్ చేయమని సూచించారన్నమాట. అనుకున్నట్లు ఈ రోజు ప్రూఫ్ ను సిద్ధం చేశాము.

## యోగ్యతకు కొలమానము – భయము లేని స్థితి

దమ్మాయిగూడ భూ సమస్యలో నాకు వ్యతిరేకి స్వతహాగా అడ్వకేటు. సమస్యలు సృష్టించుటలో నేర్పరి. మాకు తెగని సమస్యను సృష్టించి కొంత భాగం కొట్టేయాలనే వ్యూహం ప్రకారం, సమస్యను పెంచుతూ పోతుంటాడు.

ఈ రోజు ఈ క్రింది చిత్రమైన కల కన్నాను.

**తేది 15-03-2023 కల :** నేను మా భూమి వద్దకు వెళ్ళాను. అక్కడికి ఆర్మీలో పని చేసే అత్యంత ప్రతిభ కల్గిన డాక్టర్ లాంటివారు వచ్చారు. నేను ఎందుకో పరీక్ష చేయించుకొనుటకై నా చేతిని ఇచ్చాను. ఆయన బి.పి కొలిచేటటువంటి ఒక పరికరమును నా చేతికి పెట్టాడు. మరియు ఒక ఇంజెక్షన్ సూది మొదలు వరకు పూర్తిగా నా శరీరములోనికి గ్రుచ్చాడు. ఏదో మందు ఎక్కించాడు. వెంటనే రెండవ వ్యక్తి మరో ఇంజెక్షన్ ను మరో వైపు నుండి గ్రుచ్చి రక్తాన్ని పరీక్ష నిమిత్తం తీశాడు. ఈ ఇద్దరు వారి సూదులను నా శరీరము లోనికి పూర్తిగా గ్రుచ్చినప్పటికీ నాకు నొప్పి అనిపించలేదు. వారు చాలా ఎక్స్ పర్ట్స్ గా ఉన్నారు. ఇంతే కల.

ఈ కల కన్నప్పుడు మా దమ్మాయిగూడ భూమి విషయమై భయపడినప్పటికీ భయము లేదని చెప్పాదనుకున్నాను. కాని దీని నిజమైన అర్థం ఇలా గ్రహించాను. ఈ భూమి విషయమై ఒక ప్రక్క బాధపడుచూ, మరో ప్రక్క సాధన చేస్తూ ఎప్పటికప్పుడు నా స్థితిని పరిశీలించుకోవాలని, నాకు భయము లేని స్థితి కలిగినప్పుడు యోగ్యత సాధించినట్లు అని చెప్పారు.

గత కొన్ని రోజుల నుండి మళ్ళీ సర్వే చేయించి సమస్య పరిష్కరించుటకు ప్రయత్నిస్తున్నాను. కాని పని జరగడం లేదు. మరియు దీనికై తిరిగే క్రమములో నేను ఎంతో మానసిక క్షోభను అనుభవిస్తున్నాను. వ్యామోహము, భయము కలిసి నాపై పని చేస్తున్నాయి. ఫలితంగా స్వామివారి స్మరణ ఎన్నో రెట్లు పెరిగింది. ఇలా సాధన కొనసాగుతోంది. ప్రతిక్షణం

ఈ ఆస్తి నాది కాదు నా ప్రభుది, నేను సేవకుడిగా ఆయన పని చేస్తున్నాను అని భావిస్తూ స్వామివారిని మనస్సులో నిలుపుకుని పని చేసేవాడిని.

## ఆనందంగా మెరుస్తూ కనబడ్డ స్వామివారు

సంకల్పం ప్రకారంగా మేము మా కళ్యాణాలను హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో మాత్రమే నిర్వహిస్తామని నిర్ణయించాము. కాని స్వామివారి ఆదేశం మేరకు చిన్నగుండవెల్లి మరియు అప్పనపల్లి ఊర్లలో తప్ప మాకు కష్టమౌతుందని భావించి మరో దూర ప్రాంతాన నిర్వహించదలచుకోలేదు. కాని కామారెడ్డి నుండి ఒక భక్తుడు అత్యంత ఆర్తితో కళ్యాణానికై ప్రార్థించాడు. ఈ మధ్యన తేది 18-03-2023 నాడు మా అమ్మమ్మ గ్రామమైన అప్పనపల్లిలో 40 వ కళ్యాణము నిర్వహించుటకు ఏర్పాటు చేశాము. కాబట్టి అదే రోజు కామారెడ్డిలో రాత్రి పూట రథయాత్ర చేసి తెల్లవారి తేది 19-03-2023 నాడు 41 వ కళ్యాణమును జరిపించ నిర్ణయించాము. దీనికి సంతోషించిన శ్రీవేంకటేశ్వరుడు ఈ క్రింది విధంగా మెచ్చుకున్నాడు.

**తేది 16-03-2023 కల:** ఈ కలలో మేము ఒక కళ్యాణమునకై ఒక ప్రాంతమునకు పోయాము. అక్కడ మా 'నమో వేంకటేశాయ' రథయాత్ర అంగరంగ వైభవంగా జరిగింది. నేను తెలిసిన ఒక భక్తుని ఇంటికి వెళ్ళాను. వారు స్వామివారిని అత్యంత ఆకర్షణీయంగా మంచి నగలతో అలంకరించి జోల పాడుచూ ఊపారు. స్వామివారు అత్యంత ఆకర్షణీయంగా ధగ ధగ మెరిసిపోతూ కనిపించారు. మరో సంఘటనలో నేను ఒక ఆలయమునకు పోయాను. అక్కడ ప్రసాదం తీసుకొను నిమిత్తమై ఒక వైష్ణవ బ్రాహ్మణుడు కూర్చున్నాడు. కాని ఆ ఆలయం వారి ప్రవర్తన నచ్చక నొచ్చుకుని, మాది శ్రీవైష్ణవ సాంప్రదాయమంటూ వెళ్ళిపోయాడు.

దీని అర్థం ఇలా ఊహించాను. ఆ కామారెడ్డి భక్తుడు భక్తితో కళ్యాణాన్ని గొప్పగా నిర్వహిస్తాడు. కానీ కొన్ని సాంప్రదాయాలను పాటించకపోవచ్చునని భావించాను.

## స్వామివారిని స్థిర నివాసమేర్పరచుకొమ్మనే భావన

మా అమ్మమ్మ గ్రామమైన అప్పనపల్లిలో తేది 18-03-2023 శనివారం, శ్రవణా నక్షత్రం నాడు కళ్యాణం జరుప నిర్ణయించాము. అందుకని మేము తేది 17-03-2023 నాడు రథంతో పాటు చిన్నగుండవెల్లికి వెళ్ళాము. తేది 18-03-2023 ఉదయం శ్రవణా నక్షత్రం నాడు ఒక చక్కని భావం ఏర్పడ్డది. సాధారణంగా శ్రవణా నక్షత్రం రోజు వచ్చే భావన స్వామి సంకల్పం నెరవేర్చుటకు ఉపయోగపడుతుంది. ఈ భావన కూడా అలాంటిదే! స్వామివారు నన్ను భరతుణ్ణి అనుసరించమన్నారు. శ్రీరాముడు అయోధ్యకు ఒక్క రోజు ఆలస్యంగా వస్తే ప్రాణత్యాగం చేస్తానన్న భరతుడు, అయోధ్యకు వచ్చిన తరువాత తిరిగి పోతానంటే ఊరుకుంటాడా? ప్రాణత్యాగం చేస్తాననడా? అలాగే నేను కూడా ఒకవేళ శ్రీవేంకటేశ్వరుడు కరుణించి నా వద్దకు వస్తే నేను వారిని తిరిగి తిరుమలకు పోనివ్వకూడదు. వారికై ప్రాణత్యాగం చేసేంత అనన్య భక్తిని, వ్యామోహాన్ని పెంచుకోవాలి మరియు వారి ఒక అంశను ఇక్కడ స్థిరీకరించమని ప్రార్థించాలనే భావన ఏర్పడ్డది.

తేది 18-03-2023 శనివారము, ఏకాదశి, శ్రవణా నక్షత్రము నాడు స్వామివారి ఆదేశానుసారం నేను జన్మించిన మా అమ్మమ్మ గ్రామమైన అప్పనపల్లిలో 40వ కళ్యాణమును నిర్వహించాము. వీలైనంత ఎక్కువ బంధువులను, గ్రామస్థులను భాగస్వాములుగా చేసి కళ్యాణం నిర్వహించాము. మరియు యోగ్యత సిద్ధించుటకు పెద్దల ఆశీర్వాదము కూడా తీసుకున్నాము.

ఈ రోజు రాత్రి 8.30 గంటల నుండి కామారెడ్డిలో అత్యంత భారీస్థాయిలో రథయాత్ర జరిగింది మరియు తేది 19-03-2023 నాడు 41 వ కళ్యాణం నిర్వహించాము. దాదాపు 3,500 మంది భక్తులతోపాటు 518 జంటలు పాల్గొన్నారు.

## అనుభూతుల ప్రచురణ

మార్చి 2023 వరకు మొత్తం 111 కళ్యాణాలలో స్వామి కృపతో 41 కళ్యాణాలను నిర్వహించాము. మొత్తం కళ్యాణాలలో మూడవ వంతు నిర్వహించిన తర్వాత అనుభూతులను ప్రచురించే భాగ్యాన్ని ప్రసాదించమని గతంలో స్వామివారిని వేడుకున్నాను. 111 లో మూడవ వంతు 37 అవుతుంది. కాబట్టి నా ప్రార్థన అనుసారమే అనుభూతుల ప్రచురణ జరుగుచున్నదని భావించాను. ఏప్రిల్ 2023 నుండి 'తిరుమల శ్రీవేంకటేశ్వరుని దిశా నిర్దేశం' అనే పేరుతో మా 'శ్రీవేంకటేశం' మాసపత్రికలో ధారావాహికంగా ప్రచురించుట మొదలుపెట్టాము. మొదటి రెండు భాగాలను ప్రత్యేక అనుబంధంగా 24 పేజీలతో ప్రచురించాము.

## మార్చి 2023 వరకు పొందిన అనుభూతులు సమాప్తి

ఇంతవరకు మొత్తం ఆరు పుస్తకాలలోని 554 స్వప్న అనుభూతులతో పాటు మరెన్నో హృదయాంతర భావాలను తెలియచేశాను. ఇప్పుడు మార్చి 2023 తరువాత పొందిన

వాటిని తెలియచేస్తున్నాను. హరినామక్షేత్రం ఏర్పాటు జరిగే వరకు ఈ అనుభూతులు కొనసాగగలవని భావిస్తున్నాను.

## స్వామివారిపై భారము వేసి జీవించే స్థితికి చేరుట

ఇప్పటినుండి స్వామివారు నా స్థితిని ఎప్పటికప్పుడు తెలిసికొనుటకు కొన్ని లీలలను మధ్య మధ్యలో ప్రసాదించుట మొదలుపెట్టారు. ఈ క్రింది లీల కూడా ఈ కోవకు చెందిందని భావిస్తున్నాను.

**తేది 12-04-2023 కల :** నేను ఏదో ఒక పని నిమిత్తము మా ఊరికి వెళ్ళాను. శేఖరము మరికొందరు ఊరివారిని కలిశాను. తిరిగి హైదరాబాద్ వచ్చుటకు సిద్ధమైనాను. ఇంతలో ఏదో ఒక పని పడ్డది. ఆ పని నిమిత్తము తిరిగి శేఖరం వద్దకు వెళ్ళాను. వాళ్ళ తమ్ముడు గోపీనాథ్ ను పంపి ఆ పని చేయించాలనుకున్నాము. ఇంతలో మా ఊరిలో వారు వీరు మరికొందరు జమ అయ్యారు. మా పెద్దనాన్న మనవడు రాజిరెడ్డి కూడా వచ్చాడు. మేము ఒక మట్టి గోడ ప్రక్కన నిలబడి మాట్లాడుచున్నాము. ఆ గోడకు కట్టిన రాతికి మధ్య మధ్యన సందులు ఉన్నవి. ఆ సందులలో బల్లులు నివసిస్తున్నవి. ఇంతలో ఒక బల్లి కిచ కిచ మంటూ పెద్ద యెత్తున చప్పుడు చేసింది. మరియు రెండు సందుల నుండి పిచికారీ కొట్టినట్లు, వెడల్పుగా, అందరిమీద పడునట్లు బల్లి మూత్రం విరజిమ్మింది. అది దాదాపు అందరి మీద చిలకరించినట్లు పడ్డది. రాజిరెడ్డి ముఖంపై ఎక్కువ పడ్డది. ఆయన ఛీ అంటూ తుడుచుకున్నాడు. నేను కొంచెం దూరంగా ఉండుట వలన నాపైన కొద్దిగా పడ్డది. కల చెదిరింది. ఆ సమయాన ఈ కల మంచి శకునం కాదని భావించినప్పటికీ తరువాత రోజులలో దీని గురించి పట్టించుకోలేదు. స్వామివారికే వదిలేశాను. ఇలా స్వామివారిపై భారము వేసి జీవించే స్థితి ప్రారంభమవుతున్నదని సూచించాడు.

నా భార్య కంటే స్వామివారికే ఎక్కువ విలువ ఇచ్చు స్థితిని చూపెట్టుట

తిరుమల శ్రీవేంకటేశ్వరుని పొందుటకని లేదా వారిని మా ఇంటికి రమ్మని ఆహ్వానిస్తూ రకరకాలుగా సాధన చేస్తున్నాము. ముఖ్యంగా మొదటి సంకల్పంలో ఓడిపోయిన తరువాత నుండి దీనిని కొనసాగిస్తున్నాము. ప్రతి శ్రవణా నక్షత్రం రోజు రాత్రి 3 గంటలకు స్వామివారిని ప్రార్థిస్తూ నేతి దీపమును పెట్టుట నేను నా భార్య అలవాటు చేసుకున్నాము. స్వామివారు కూడా ఈ శ్రవణా నక్షత్రము రోజు ఎన్నో లీలలను చూపెట్టారు. అవి అన్నీ స్వామి సంకల్ప సాధన దిశగా, నాలో మార్పు కోసమని వచ్చాయి. ఈ రోజు కూడా శ్రవణా నక్షత్రం, రెండు కలలు వచ్చాయి. ఒకటి నేను మధ్యరాత్రి 2.30 గంటలకు మేల్కొనే ముందు వచ్చింది, దానిని మరచాను. రెండోది ఉదయం 7 గంటలకు నేను తిరిగి పడుకుని లేచే సమయానికి వచ్చింది. ఇది గుర్తుంది. ఇందులో ముఖ్యంగా మేము ఏ స్థితిలో ఉన్నామో తెలిపాడు.

**తేది 15-04-2023 కల :** ఈ కల సారం ఏమిటంటే... నా భార్య సురేఖ, స్వామివారిని పొందాలని లేక స్వామి సంకల్పమును నెరవేర్చాలనే సంకల్పముతో కాకుండా అన్య విషయాల పైన మనసు పెట్టుచున్నది. ఇక నేనేమో మిగిలిన అన్ని కోరికలను త్యజించి కేవలం స్వామి సంకల్పమందే మనస్సు నిలిపి, దానిని సాధించుటకు చేసే ప్రయత్నములోనే ఆనందమును పొందుచున్నాను. కాని సురేఖ మాత్రం ఆ విధంగా కాక ఇతరమైన విషయాలు అంటే పుత్రులు, బంధువులు, స్నేహితుల పట్ల ఆకర్షితురాలై అందులో ఆనందము పొందుటకు ప్రయత్నిస్తున్నది. నేను దీనిని గమనించి నొచ్చుకున్నప్పుడు ''ఏం కాదులే'' అంటూ దాటవేస్తున్నది. నన్నే సర్దుకుపొమ్మని చెప్పుచున్నది. నేను దీనిని గమనించి చాలా బాధపడ్డాను. ఈ బాధను మనస్సులో పెట్టుకుని స్వామివారిని క్షమించమని వేడుకున్నాను. మరియు అవసరమైతే సురేఖను వదిలి నేనొక్కడినే మీ సంకల్పమును సాధించేందుకు సిద్ధం ప్రభూ! అని సంసిద్ధుడనైనాను. నా భార్య కంటే స్వామి సంకల్పానికి ఎక్కువ విలువనిస్తున్నట్లు చూపెట్టాడు. ఒకరకంగా మా ఇద్దరి స్థితులు తెలియచేశాడు. ఇది కలలోని భావం.

నిజానికి సురేఖ కూడా పుత్రులు, బంధువులు, స్నేహితుల పట్ల చాలావరకు సాన్నిహిత్యాన్ని త్రుంచివేసుకుంది, కాని స్వామివారు ఆశించిన స్థాయిలో లేదు. అప్పుడప్పుడు నేను చెప్పినప్పటికీ ''ఇంత మాత్రమైనా మాట్లాడకూడదా'' అంటుండేది. అందుకే స్వామివారు ఈ లీలను చూపారు.

## ప్రక్కదారి... హెచ్చరిక

ఈ మధ్యన స్వామివారు ప్రసాదించు కలలు గుర్తుండుట లేదు. కాని వాటి భావము మాత్రము స్పష్టంగా గుర్తుంటుంది. ఈ క్రింది కల కూడా గుర్తులేదు కాని దాని భావం ఈ విధంగా ఉన్నది.

**తేది 17-04-2023 కల :** ''నేను నా సంకల్పము నుండి కొంచెము ప్రక్కకు జరిగి లోక వాసనలను తిరిగి ఆఘ్రాణిస్తున్నట్లుగా అనిపించింది. వెంటనే ఇది తప్పని నా మనస్సును అలా అన్య విషయాలపై వెళ్ళకుండా చూచుకోవాలనిపించింది'' ఇది కలలోని భావం. కాని కల విధానాన్ని మరచిపోయాను.

## స్వామి క్షమించుట

నిన్న స్వామివారు సూచించినట్లు మనస్సు ప్రక్క దారిలోకి ప్రయాణిస్తున్నదన్న విషయమును తిరిగి ఆలోచించాను. మరియు అలా జరుగకుండా అత్యంత కఠినంగా నిర్ణయం తీసుకున్నాను. స్వామివారిని క్షమించమని, మళ్ళీ ఇలా జరుగకుండా చూచుకుంటానని ప్రార్థించాను. అనుకున్నట్లుగానే ఈ రాత్రి స్వామివారు కరుణించి క్షమించినట్లు అనుభూతి పొందాను. స్వామివారికి ధన్యవాదాలు తెలుపుకున్నాను.

## అలసట తీర్చిన స్వామివారు

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు నాకు కఠిన శిక్షణ ఇస్తున్నప్పటికీ అప్పుడప్పుడు ఆయనతో ఆటలాడుకున్నట్లు అనిపించేది. నా అలసట తీర్చి నవ్వించాడు. ఇప్పుడు ఇలాంటి ఒక సంఘటన జరిగింది.

2002 సంవత్సరం నుండి 2020 సంవత్సరం వరకు నేను నిర్వహించిన ప్రతి స్వామి సేవలో, నమో వేంకటేశాయ రథయాత్రలో చివరికి తిరుపతిలో యజ్ఞం చేయునప్పుడు కూడా తెల్లని లుంగీ ధరించేది. ధోవతి కట్టుట రాక సులభంగా ఉండునని లుంగీని ధరించేది. కాని 2021 సంవత్సరం కళ్యాణాల కార్యక్రమము మొదలుపెట్టిన నుండి ధోవతి కట్టుట ప్రారంభించాను. ప్రతిసారీ ఈ ధోవతి సమస్యను ముఖ్యంగా కుచ్చులు ఎలా కుదిరాయని నా భార్యకు చూపెట్టి అడిగేవాణ్ణి. ఆమె చెప్పే సూచనలు పాటించేవాణ్ణి. ఈ విధంగా నేటికీ జరుగుచున్నది. స్వామివారు ఇప్పుడు దీనిని ఉపయోగించి ఒక ఆసక్తికర సన్నివేశాన్ని చూపెట్టాడు.

నిన్నటినుండి ఇతరత్రా మనస్సును మళ్ళించకుండుటకు, స్వామివారిని ఒక ప్రత్యేకమైన పద్ధతిలో అంతరంగాన దర్శించుట మొదలుపెట్టాను. మొత్తం స్వామి రూపమును నా మనస్సులో బంధించి ఆయన యొక్క అందచందాలను తదేక దృష్టితో చాలాసేపు దర్శించాను. మరియు ఇదే విధంగా జీవితాంతం ఉండాలనే భావమును ఏర్పరచుకున్నాను. దీనిని మెచ్చిన స్వామివారు ఈ క్రింది అద్భుతమైన లీలను ప్రసాదించారు. మరియు నా అలసట తీర్చారు.

**తేది 19-04-2023 కల :** ఈ కలలో స్వామివారు చాలా సంతోషించారు. ఆయన సంతోషాన్ని వారి అలంకరణలో, వస్త్రాలతో తెలిపారు. ముందు నాకు శ్రీ మలయప్పస్వామి వారు మామూలుగా కనబడ్డారు. తిరుమలలో ఊరేగింపు




తాను ధరించిన పంచె ఎలాగున్నదని అడుగుట (లీల 19-4-2023)

సందర్భంగా ఎలాంటి అలంకరణతో ఉంటారో అలా కనబడ్డారు. కొంతసేపు దర్శించిన తరువాత వెళ్ళిపోతుంటే 'ఆగు' అన్నారు. వెంటనే ఈ మలయప్పస్వామి వారు ప్రక్కనున్న ఒక గదిలోనికి వెళ్ళి మంచి పాలపిట్ట రంగు పూల డిజైన్ గల అత్యంత సుందరమైన గోధుమరంగు పట్టు పంచెను ధరించి క్షణములో దర్శనమిచ్చారు. వారు ధరించిన పంచె యొక్క కుచ్చులు నేను ధరించే పంచె కుచ్చులు మాదిరిగా ఉన్నాయి. ఎదుటివారు చూచునప్పుడు అది పాదాల నుండి వంపు తిరిగి నడుము వరకు చక్కని (సింగులు) కుచ్చులు పోస్తే ఎలా వ్రేలాడుతుందో ఆ విధంగా కట్టారు. ఈ కుచ్చుల పైన పాలపిట్ట రంగు వంకలు తిరిగిన పూల డిజైన్ క్రిందినుండి పై వరకు అత్యంత సుందరంగా కనబడుతుంది. మరియు దానిపైన మిరుమిట్లు గొలిపే ఆభరణాలను ధరించారు. ఆయన ధరించిన ధోవతిని, నగలను చూపి''చూడు బాగున్నాయా'' అని అడిగాడు. ఈ విధంగా తన ఆనందమును వ్యక్తపరచారు. ఇంతే కల.

**దీనర్థం :** నన్ను అదే విధంగా మానసికంగా స్తుతిస్తూ జీవితాన్ని గడుపమన్నారు. ఈ రకమైన సాధన స్వామివారికి నచ్చిందని అర్థం. ఏవిధంగానైతే నేను పంచె కట్టుకుని ముందరి కుచ్చులు బాగున్నవా? అని చూచుకుందునో అదేవిధంగా స్వామివారు తన పంచె కుచ్చులను చూపెట్టారు. మంచి గోధుమరంగు పట్టు వస్త్రంలో పాలపిట్ట రంగు తీగల పూల డిజైన్ కలిగిన 2.5 ఇంచుల అందమైన అంచు కలిగిన పంచెను ధరించారు. మరియు వీరు మిరుమిట్లు గొలుపుచు కనబడ్డారు. దీనితో నేను పరవశించి పోయాను. మరియు ఇన్ని రోజుల కష్టాల బాధ నుండి అలసట తీరినట్లైంది.

## నా ఆవేదన

దమ్మాయిగూడ భూ సమస్య వలన చాలా భయపడుచున్నాను. ఈ సమస్యను ఉపయోగించి వ్యామోహము, 'నా' అన్నది మరియు భయాన్ని నా నుండి తీసివేయుటకు సాధన చేస్తున్నాను. ఈ భయము, సమస్య దూరంగా ఉన్నప్పుడు తగ్గుతుంది, దగ్గరికి వచ్చేసరికి ఎక్కువ భయపడిపోవుచున్నాను. హైకోర్టు ఆర్డర్ ప్రకారం ఇద్దరి ల్యాండుల సర్వేను తేది 29-04-2023 శనివారం నాడు చేయుటకు మండల సర్వేయర్ నోటీసు ఇచ్చారు. దీనితో గత 10 రోజుల నుండి మళ్ళీ నాలో ఆందోళన ఎక్కువైంది. ఈ పది రోజులు క్షణము ఒక యుగముగా గడుచుట వలన స్వామివారి స్మరణ ఎన్నోరెట్లు పెరిగింది. చివరికి తేది 29-04-2023 నాడు సర్వే కాలేదు. సర్వే వలన ఈ సమస్యకు పరిష్కారము దొరుకుతుందని భావించినప్పటికీ సమస్య ఎలా ఉందో అలానే ఉన్నది. దీనితో మానసికంగా చాలా బాధపడ్డాను. స్వామివారు ఎందుకు దీనిని పొడిగిస్తున్నారో తెలియలేదు. నాలో ఇంకా ఏ మార్పు కోరుకుంటున్నారో తెలియలేదు. నిన్న తేది 29-04-2023 నాడు చాలా అలసిపోయాను. స్వామి సహాయం లేదని బాధపడ్డాను. దీనితో ఒకరకంగా ఉన్మాదిగా మారిపోయాను. చివరికి ఈ రోజు అంటే 30-04-2023 ఉదయం 11.30 గంటలకు స్వామివారిని క్షమించుమని, రక్షించుమని అత్యంత ఆర్తితో ప్రార్థించాను. స్వామివారు నా నుండి ఏమి కోరుచున్నారో దానిని వెంటనే తీర్చుకొని ఈ లీలకు ముగింపు పలకమన్నాను. మీ లక్ష్య సాధనే ధ్యేయంగా పని చేస్తున్నానన్నాను. నమ్మమన్నాను. నా అంతరంగం పరిశీలించమన్నాను. ఇలా రకరకాలుగా ఆవేదనను వెళ్ళబుచ్చాను.

ఈ రోజు ఉదయం మా కాలనీలో వాకింగ్ చేయునప్పుడు కొట్టిపడేసిన కొన్ని వెదురు కట్టెలు కనబడ్డవి. అవి కళ్యాణాలలో స్వామివారికి పూలు కట్టుటకు ఉపయోగపడునని సేకరించు క్రమములో నా చేతి వ్రేళ్ళు కోసుకుపోయి రక్తం బాగా కారింది. వ్రేళ్ళు వాచిపోయాయి. ఈ ప్రార్థన సమయాన నా చేతిని స్వామివారికి చూపుచు ''చూడు మీ కోసమే ప్రతిక్షణము తాపత్రయపడుచున్నాను. మీరు మాత్రం నా సమస్యను తీర్చుట లేదు'' అన్నాను. నన్ను నమ్మమన్నాను. ఈ చేతి నొప్పి మీ పని కోసం ప్రయత్నించినప్పుడే జరిగిందన్నాను. ఇలా స్వామివారికి తనివితీరా నా ఆవేదనను వెళ్ళబుచ్చాను. ఈ భూ సమస్యకు కాంప్రమైజ్ కమ్మంటారా? లేక పరిష్కరిస్తారా? అని కూడా అడిగాను. ఈ బాధలో నా మనస్సు కల్లోలంగా ఉన్నది, వణికిపోవుచున్నాను. ఎలాగైనా రక్షించుమని ప్రార్థించాను. నేను మీ వాడనన్నాను, తమరు నా స్వామి అన్నాను. నా ప్రతి శ్వాస మీ కోసమే అంటూ నా ఆవేదన వెలిబుచ్చాను. చివరికి అలసిపోయి ఇక మీ దయ అన్నాను.

## సిద్ధిపేటకు వెళ్ళాలంటే కష్టాలను ఎదుర్కోవాలి

ఈ మధ్యన కలలు స్పష్టంగా కనిపించడం లేదు. నేను వాటిని వెంటనే మరచిపోతున్నాను. కాని వాటి భావము మాత్రము నా హృదయంలో స్థిరంగా నిలిచిపోతుంది. ఈ కల కూడా ఇదే విధంగా జరిగింది. జరిగిన క్రమము తెలియదు కాని భావం గుర్తుంది.

**తేది 21-05-2023 కల :** ఇందులో సిద్ధిపేట ప్రాంతపు ఒక మిత్రుడు కనబడ్డారు. ఇతడు ఇంజనీర్ ఇన్ చీఫ్ గా పని చేసి రిటైర్ అయినాడు. మరొకరు కనబడ్డారు.ఇలా ఏదో కల జరిగింది కాని దీని భావం ఇలా ఉంది.

నేను సిద్ధిపేటకు వెళ్ళాలంటే స్వామివారి గురించి పెద్ద పెద్ద

కష్టాలను ఎదుర్కొనుచు సాధన చేయవలసి ఉంటుంది. అప్పుడే నేను సిద్ధిపేట వరకు చేరగలననే విషయాన్ని విశ్లేషణాత్మకంగా సూచించారు.

ఒకరకంగా దమ్మాయిగూడ భూ సమస్య వల్ల ఇబ్బంది పడుచు ఆ ఇబ్బందిని తీర్చుమని రకరకాలుగా స్వామివారిని వేడుకొనుచు, సాధన చేసి యోగ్యత సాధించవలసి ఉంది అని ఈ లీల ద్వారా చెప్పారు. ఈ సమస్యకు తొందరగా ముగింపు పలికి ఆనందమును ప్రసాదించుమని నేను చేసే ప్రార్థనకు జవాబుగా దీనిని చూపాడు. ఇక ఈ భూ సమస్యకు యోగ్యతకు సంబంధం ఎలా ఉంటుంది? అనే విషయం స్వామివారికే తెలుసు. మొత్తం మీద స్వామివారు ఆశించే విధంగా నా మానసిక పరివర్తన జరగాలి.

## 'నా' అన్నది వదల లేదనుట

ఇంతవరకు స్వామివారి శిక్షణలో చాలా విషయాలలో పరిణతి పొందాను. కాని 'నా' అన్న దానిలో పరిణతి పొందలేదని, దానిని సాధించాలనే విధంగా ఈ క్రింది లీల చూపెట్టారు.

నిన్న అంటే 16-05-2023 నాటి సాయంత్రం స్వామివారిని ఇలా ప్రార్థించాను. నా భూ సమస్యతో మనశ్శాంతిని కోల్పోవుచున్నాను కాబట్టి త్వరగా తీర్చుమన్నాను. కాని మీకు ఈ సమస్య ద్వారా నాలో మార్పు జరుగుతుంది, అది మీ హరినామ క్షేత్రమునకు ఉపయోగపడుతుందని మీరు భావించినచో నేను ఎంత పెద్ద సమస్యనైనా ఆనందంగా భరించగలనన్నాను. దీని ద్వారా సాధించే లాభాన్ని చూపమన్నాను. అప్పుడు స్వామివారు ఈ కలను చూపెట్టారు.

**తేది 17-05-2023 కల :** ఈ కల చాలా చిన్నది కాని విశ్లేషణాత్మకమైనది. ఇందులో నేను హైస్కూలుకు వెళ్ళే రోజుల్లో ఎక్కువ పుస్తకాలను ఒక సంచిలో పెట్టుకుని, దానిని నా భుజానికి వేసుకుని వెళ్ళేవాడిని. ఈ కలలో కూడా ఎక్కువ పుస్తకాలను ఒక సంచిలో పెట్టుకుని దానిని నా భుజానికి వేసుకుని నడుచుకుంటూ ఒక చౌరస్తా గుండా స్కూలుకు వెళ్ళుచున్నాను. పుస్తకాలు ఎక్కువ ఉన్నవి కావున




గాలికి కొట్టుకుపోయిన టోపి కై వెళ్ళుట (లీల 17-05-2023)

బరువుతో ఒకవైపుకు కొంచెము వంగి నడుచుకుంటూ వెళ్ళుచున్నాను. ఖాకీ రంగు టోపీ కూడా పెట్టుకున్నాను. ఆ బజారులో ఎంతోమంది జనాలు ఉన్నారు. రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు. ఇరుప్రక్కలా దుకాణాలు, అందులో రకరకాల ఆకర్షణీయ వస్తువులు ఉన్నవి. కాని నేను వాటివైపు చూడకుండా నా ధ్యేయమందే మనస్సు నిలిపి ముందుకు నడుస్తున్నాను. ఇంతలో ప్రక్కషాపు వద్ద ఒక నల్లని ముఖానికి మచ్చలున్న ఒక వ్యక్తి ఆధ్యాత్మిక భావజాలముతో ఏదో చక్కని మాట మాట్లాడాడు. అప్పుడు తల త్రిప్పి నేనతనిని చూచాను. వెంటనే మళ్ళీ మనస్సును మార్చుకుని ముందుకు వెళ్ళుచున్నాను. ఇంతలో గాలికి నా టోపీ ఎగిరిపోయింది. దీనిని గమనించకుండా ముందుకు పోతున్నాను. నా ఎదురు నుండి వచ్చు ఒకాయన దీనిని చూచి నీ టోపీ ఎగిరిపోయింది. పట్టించుకోవడం లేదు... పోనా?... అన్నారు. వెంటనే ప్రక్కకు చూచేసరికి ఆ టోపీ గాలికి ఎగురుతూ, ప్రక్క వీధిలోనికి కొట్టుకుపోవుచున్నది. నేను ముందుకు వెళ్ళుట మానివేసి ఆ టోపీ కోసం వెళ్ళాను. అది గాలికి ఇక్కడినుండి అక్కడికి, అక్కడినుండి మరింత దూరం ఎగిరెగిరి పోతోంది. దానిని అనుసరిస్తున్నప్పటికీ అది నాకు దొరకడం లేదు. ఇంతే కల.

దీనర్థం – నేను ఆధ్యాత్మిక విషయాలలో తప్ప మరో దానిలో రుచి లేని స్థితికి చేరినప్పటికీ 'నా' అన్న దానిలో ఇంకా కొంత పరిణతి చెందవలసి ఉన్నదని సూచించాడు. మరియు ఇది హరినామ క్షేత్ర ఏర్పాటుకు ఉపయోగపడుతుందని భావించాను.

## పరిక్రమ చేయుమని సూచించుట

గత కొన్ని రోజుల నుండి నా సాధన పూర్వపు సాధన కంటే ఎన్నోరెట్లు పెరిగింది. కాని స్వామివారు ఆశించిన స్థాయికి చేరుకోలేదు. చాలా రోజుల నుండి కఠోర సాధన చేస్తున్నాను కావున తేది 17-05-2023 నాడు ఎందుకో చికాకు వేసింది. మనస్సు ఇతర విషయముల పైకి వెళ్ళింది. లౌకిక విషయాలు ఆకర్షించాయి. చివరికి ఈనాటి మధ్యరాత్రి మేలుకున్నాను. దీనికి పశ్చాత్తప్తుడనై స్వామివారిని క్షమించమన్నాను. ఆ తరువాత నిద్రపోయాను. అప్పుడు ఈ క్రింది కల వచ్చింది.

**తేది 18-05-2023 కల :** ఈ కలలో నా ముందు ఒక అదృశ్య వ్యక్తి ఉన్నాడన్న భ్రమ కలిగింది. ఆయన తన చేతి ఒక వ్రేలును పైకి ఎత్తి స్వామివారికి పరిక్రమ చేయుమన్నట్లు చెప్పాడు. ఆ చేతి వ్రేలును గుండ్రంగా త్రిప్పుచూ స్వామివారికి పరిక్రమ చేయుమని సూచించాడు. వ్యక్తి కనబడలేదు కాని ఆయన చేతివ్రేలు మాత్రం స్పష్టంగా కనబడ్డది. ఇంతే కల.

స్వామివారు సూచించినట్లు మాకు దగ్గరలో ఉన్న హెచ్.ఎమ్.టి నగర్ శ్రీవేంకటేశ్వరుని ఆలయానికి వెళ్ళి ''ప్రదక్షిణలు ప్రారంభించాను. వీటిని తేది 30-05-2023 మొత్తం 11 రోజుల వరకు రోజూ ప్రదక్షిణలు చేస్తాననుకున్నాను. స్వామివారికి మరియు శ్రీ ఆంజనేయునికి ఇద్దరికీ చేశాను. లక్ష్యసాధనకు అవసరమైన శక్తిని, తగిన యోగ్యతను ప్రసాదించి హరినామక్షేత్రం ఏర్పాటు చేసేవిధంగా తీర్చిదిద్దమన్నాను.

ఎలాగైనా యోగ్యత సాధించాలని తీవ్రంగా సాధన చేస్తున్నాను. స్వామివారిని విరామం లేకుండా స్మరిస్తున్నాను. ఇంతలో మరో కల చూపెట్టారు.

**తేది 21-05-2023 కల:** ఈ కలలో ఒక వ్యవసాయ భూమిలో పూజ జరుగుచున్నది. నాకు తెలిసిన చాలామంది భక్తులు పూజ చేశారు. ఈ పూజను నేనే నిర్వహిస్తున్నానట. ప్రసాదం అందరికీ అందే విధంగా చూడాలని ప్రయత్నిస్తున్నాము.

దీని అర్థం – నేను స్వామివారి కృప హరినామక్షేత్రం ద్వారా అందరికీ సిద్ధించాలని ప్రయత్నిస్తున్నాను అని సూచించారు. సాధన సరైన దిశలో జరుగుచున్నదని భావించాను.

## హరినామ సంకీర్తనను ముందే ప్రారంభించాలనే ఆలోచన

యోగ్యత సాధించుటకు ఎన్నో విధాలుగా ప్రయత్నిస్తున్నాను. ఇంతలో చిన్నగుండవెల్లిలోని మా తోట బావి వద్ద అంటే హరినామక్షేత్రమును ఏర్పాటు చేయు స్థలము వద్ద, స్వామివారి అఖండ హరినామమును ముందే ప్రారంభించాలనే ఆలోచన కలిగింది. దీని ద్వారా త్వరగా స్వామివారు సంతృప్తి చెందుతారని భావించాను. భూమిని సర్వేచేసి, ఆలయం మార్కింగ్ చేసి, ప్రక్కన ఒక నిర్ణీత స్థలములో ఈ కార్యక్రమమును ఏర్పాటు చేయాలనే కోరిక కలిగింది. అక్కడ కొన్ని గదులు, భజన నిమిత్తము హాలు, వంటశాల ఏర్పాటు చేసి చిన్నగా నామస్మరణ ఏర్పాటు చేయాలనిపించింది. స్వామివారి ఫోటో పెట్టి, వారిని ఈ క్షేత్రానికి త్వరగా రావలసిందిగా ప్రార్థిస్తూ ఈ కార్యక్రమము జరిపించాలనుకున్నాము. ఈ విధమైన బలమైన భావన కలిగింది. ఈ విషయాన్ని తిరుపతిలోని వైఖానస పండితుడు శ్రీమాన్ విష్ణుభట్టాచార్యుల గారితో కూడా చెప్పాను. మరియు ఇదే విషయం స్వామివారిని ప్రార్థించి అనుమతించమన్నాను. కాని స్వామివారు ఈ క్రింది లీల ద్వారా అనుమతించలేదు.

## ఇంకా పరిపక్వత చెందలేదు

హరినామక్షేత్రం ఎప్పుడు ప్రారంభించమంటారని మరియు ఆలయం కంటే ముందు మీ నామ సంకీర్తనను

మొదలుపెట్టుటకు ఆజ్ఞ ఇవ్వమన్నాను. ఈ రోజు కలలో ఇలా జరిగింది.

**తేది 23-05-2023 కల :** అది ఒక పెద్ద (హైవే) రహదారి. ఈ దారి మధ్యలో సరుకులతో ఒక నిండు లారీ టార్పాలిన్ కప్పుకొని ఉన్నది. కొంతమంది యుక్తవయస్సు ఉన్న పోకిరీలు, ఈ లారీ టార్పాలిన్ పై ఒక వస్తువును పెట్టి లారీ ముందు నిలబడ్డారు. వీరు ఆఫ్రికన్ యువకుల్లాగా చాలా ఉత్సాహంగా ఉన్నారు. రకరకాల విన్యాసాలు చేస్తున్నారు. వెనుక నుండి వచ్చే వాహనదారులకు ఒక రబ్బరు రింగు ఇచ్చి, వేగం తగ్గించకుండా ఈ రింగును టార్పాలిన్ పై పెట్టిన వస్తువుపై పడునట్లు విసురుతూ వెళ్ళమంటున్నారు. కొందరు ప్రయత్నించలేదు. కొందరు ప్రయత్నించి విఫలులైనారు. ఇలా వారితో కేకలు వేయుచు సరదా చేస్తున్నారు. ఎవ్వరో నడుపుచుండగా నేను ఒక మోటారు సైకిల్ పై వెనుక కూర్చుండి వ్యతిరేక దిశలో వెళ్ళుచున్నాము. దీనిని చూచి ఆగిపోయాము. తమాషా చూస్తున్నాము, ధైర్యము చేసి పోగలము, కాని వీరి తమాషా చూస్తున్నాము. వారు మా పైన పడుదురని భయపడ్డాము. ఆగాము. ఇంతే కల.

అంటే నేను మార్గం పైకి వచ్చాను కాని తగిన యోగ్యత సాధించలేదని అర్థం. దీనితో నా ప్రయత్నాన్ని విరమించుకున్నాను. కాని మా భూమిని మాత్రం డిజిటల్ సర్వే చేయించి పెట్టుకున్నాను.

## కామ క్రోధాలను అదుపు చేసుకోవాలి

తేది 26-05-2023 సాయంత్రము చిన్నగుండవెల్లిలోని మా భూమిని సర్వే చేశామని, మాకు ఉన్నభూమిలో కొంత తగ్గిందని స్వామివారితో చెప్పాను. మరియు ఇలా ప్రార్థించాను. ప్రభూ! నేను ఇతరులది ఆశ పడుటలేదు. కాని నా దానిని ఇతరులు అన్యాయంగా లాక్కుంటే బాధ కలుగుతున్నది. మొత్తం ఆస్తి మీదేనని భావించాను. అయినంత మాత్రాన ఉన్న ఆస్తిని అన్యాయంగా లాక్కుంటుంటే ప్రతిఘటించకూడదా? ఎందుకు నాకు ఇలా బాధ కలుగుచున్నది చెప్పమన్నాను. చివరికి మీ హరినామ క్షేత్రాన్ని ఎప్పుడు ప్రారంభించాలని ప్రార్థించాను.

**తేది 27-05-2023 కల :** అది ఒక నూతనంగా ఏర్పాటు చేసిన ఆలయం లాంటి ప్రదేశం. పూర్తిగా ఆలయం కాదు, పూర్తిగా వ్యవహార బిల్డింగ్ కాదు. విశాలమైన స్థలము, చక్కని ప్లాను, మెట్లు మొత్తం మీద ఆధ్యాత్మిక ప్రాంతము. దాని ప్రారంభోత్సవం కొరకు నా భార్య సురేఖ, నేను మరికొందరు అక్కడ ఉన్నాము. సురేఖ పట్టు వస్త్రాలను ధరించింది. చేతిలో ఒక పళ్ళెము నిండా పూలు, పండ్లు పట్టుకుని ప్రారంభానికై మెట్లు ఎక్కుచున్నది. నాతో పాటు మరికొంతమందిమి ప్రక్కనే అనుసరిస్తున్నాము. ఇంతలో వర్షం వచ్చింది. వెంటనే సురేఖ మరియు నేను పరుగున మెట్లు ఎక్కి ప్రక్కనున్న హాస్టల్ లోకి వెళ్ళాము. ఆ హాస్టల్, మధ్యన కారిడార్ కలిగి అటు ఇటు చక్కని పెద్ద సైజు గదులు ఉన్నవి. ఒక గది తలుపు తీసి దానిలోనికి వెళ్ళుటకు ప్రయత్నించాము. అది నేను చదివిన ఇంజనీరింగ్ హాస్టల్ లో ఉన్న పెద్ద హాలు లాగా కనబడ్డది. అప్పటి పాలపిట్ట రంగు కిటికీలు, డోరులు ఉన్నవి.

ఈ కలలోని మరో సన్నివేశములో నేను ఒక మాల్ మొదటి అంతస్తులో ఉన్నాను. ఎందుకో పైనుండి క్రింది అంతస్తును చూచాను. అక్కడ చాలామంది జనాలు తిరుగుచున్నారు. నన్ను ఇన్ని రోజులు కష్టపెడుతున్న ఒక వ్యక్తి, ఆయనకు సహాయము చేస్తున్న మరో మాంత్రికుడు కనబడ్డారు. ఆ మాంత్రికుడు చింపిరిజుట్టుతో ఉన్నాడు. వారిద్దరి మధ్యన ఒక 50 అడుగుల దూరం ఉన్నది, మరియు వారి మధ్యన మరికొందరు జనాలు ఉన్నారు. వారిని నేను చూడగానే నన్ను ఇన్ని రోజులు కష్టపెడుచున్నందుకు వారిపై కోపము వచ్చింది. వెంటనే ఒక శక్తి వారిని కట్టడి చేసింది. వారు ముందుకు నడవలేక అక్కడనే స్తంభించిపోయారు. దానిని చూచి ఆనందించాను. మరియు ఆ స్తంభన అలాగే ఉంటే బాగుండుననే ఆలోచన కలలోనే వచ్చింది. కల చెదిరింది.

**దీనర్థం :** హరినామ క్షేత్రము కొరకు శిక్షణ జరుగుచున్నది. దానిని మేము తప్పక ఏర్పాటు చేయగలము. భక్తులకు ఇది సాధనాలయము లాగా ఉండగలదు. కాని నాలో ఇంకా కామ క్రోధాలు ఉన్నవి, వాటిని నశింపచేసుకోవాలని సూచనలిచ్చారు. స్వామి శక్తి తోడైనది.

## స్వామివారు 'లార్వా' స్థితిలో ఉండుట

ఈ కల సురేఖకు మే 2023 చివర వచ్చింది. దీనిలో శ్రీవేంకటేశ్వరుడు మా ఇంటికి వచ్చుటకు 'లార్వా' స్థితిలో ఉన్నట్లు చూపెట్టాడు. ఆయన మా ఇంటికి రావటానికి సిద్ధపడుచున్నాడని అర్థం. ఆ లీల ఈవిధంగా ఉంది. హైదరాబాద్ లో మా ఇంటి ఆవరణలో, తూర్పు వైపున గల ముఖద్వారం ముందు అరుగు, దానిముందు తులసి పొద, మరికొన్ని చెట్లు ఉన్నవి. దీనిని ఉపయోగించి ఈ కల చూపాడు.

**తేది 06-06-2023 కల :** మా సురేఖ మా ఇంటి తూర్పు వైపున ఉన్న ప్రధాన ద్వారము ముందు ఉన్న అరుగుపై కూర్చున్నదట. ఆమె ముందు కొద్ది దూరములో తులసి చెట్ల పొద ఉన్నది. ఒక క్రొత్త పనివాడు మా ఇంట్లో ఉన్న చెట్లకు పని చేస్తున్నాడట. ఈ పని చేయువాడు మా సురేఖతో




స్వామివారు లార్వాస్థితిలో ఉండుట.(లీల 06-06-2023)

‘‘అమ్మా పాము’’ అన్నాడట. దానితో ఆమె అటు ఇటు చూచిందట. ఏమీ కనబడనందున పాము లేదు ఏమి లేదు నీవు పని చెయ్యి అన్నదట. ‘‘లేదమ్మా పాము’’ అని మళ్ళీ ఆ పనివాడు అన్నాడట. ఇలా రెండు సార్లు అనేసరికి ఆమె చూపెట్టుమన్నదట. వెంటనే అతను తులసి పొద ప్రక్కన ‘‘చూడమ్మా చూడు’’ అంటూ చూపెట్టాడట. అక్కడ ఒక పుట్ట లాంటిది అప్పటికప్పుడే, వీరు చూస్తున్నప్పుడే ఒక అడుగు ఎత్తు వరకు పైకి పెరుగుచు వచ్చిందట. దానిని చూచి సురేఖ ఆశ్చర్యానికి గురైంది. ఇంతలో ఆ పనివాడు ‘‘చూడమ్మా చూడు’’ అంటూ ఆ పుట్టలో చేయి పెట్టి దాదాపు ఒక అడుగు వ్యాసముతో ఒకటిన్నర అడుగు పొడుగు గల రెండు లార్వా ముక్కలను పైకి తీసి ప్రక్కన పెట్టాడట. అవి అప్పుడే ప్రాణం పోసుకుంటున్నవి, చాలా లావుగా ఉన్నవి, ముఖము తోక ఇంకా ఏర్పడలేదు. ఎర్రగా ఇప్పుడిప్పుడే రూపమును సంతరించుకుంటున్నట్లు ఉన్నవి. వాటి కన్నులు చేప కన్నుల మాదిరిగా ఉన్నవట. రెండూ ఒకేలాగా ఉన్నవట. దానిని చూచిన సురేఖ ఆశ్చర్యానికి గురైంది. కల చెదిరింది.


ఈ కల ద్వారా స్వామివారు మా ఇంటికి రావడానికి లార్వా స్థితిలో ఉన్నారని అర్థం చేసుకున్నాము. మరియు ఒక్క స్వామివారే కాక వారితో పాటు అమ్మవారు కూడా రాగలరనే భావము ఏర్పడ్డది. మా సురేఖకు సంబంధించినంత వరకు పాము అంటే స్వయంగా శ్రీవేంకటేశ్వరుడే! (ఈ విషయాన్ని గతంలో ఎన్నోసార్లు చూపెట్టారు.)

దీనిని బట్టి ఇంకా మేము సాధన చేయవలసి ఉన్నదని భావించి బాధలను సహించుటకు సిద్ధపడ్డాము.

## స్వామివారిపై భారము వేయుట

చిన్నగుండవెల్లిలో తోటబావి వద్ద గల భూమిని సర్వే చేయించాము. మరియు హరినామక్షేత్రం ఏర్పాటుకు ముందు మా ఇంటిని రినోవేషన్ చేయమన్నారు కాబట్టి ఇంటి రినోవేషన్ ప్లాన్ సిద్ధం చేసుకున్నాము. ఇంతలో స్వామివారు ఈ క్రింది కలను చూపెట్టారు.

**తేది 09-06-2023 కల :** ఈ కలలో నా ప్రక్కవారు వారి స్థలములో ఇల్లు కట్టుకొనుటకు గుంటలు తీశారు. అవి కొన్ని



నేను భూమిని దేవుడికి ఇస్తున్నాను మీకు కాదని

శ్రీ శ్రీ శ్రీ చిన్న జీయర్ స్వామి వారితో చెప్పుట (లీల 20-02-2026)

నా భూమిలోకి వచ్చాయని నేను భావించాను. ఈ భూమి నాకు సంబంధించిన ఒక ప్రాపర్టీ లాగా కనబడ్డది. కల చెదిరింది.

**దీనర్థం :** ఒకానొక నా స్థలమును ప్రక్కవారు కొంత కబ్జా చేయుచున్నారని చూపెట్టారు. కాని నేను మాత్రం నా స్వామివారే దాన్ని చూచుకుందురని భావించి ఎలాంటి ఆందోళన చెందలేదు. పైగా ఈ విషయాన్ని పట్టించుకోలేదు. స్వామివారిపై భారము వేసి మరచిపోయాను.

ఈ కాలంలో జరిగిన కళ్యాణాలు – 38వ కళ్యాణం నుండి 44వ కళ్యాణం వరకు మొత్తం 7 కళ్యాణాలు.

**నా దశ :** యోగ్యత సాధించుటకు అభ్యాస, వైరాగ్యాల ద్వారా సాధన జరుగుచున్నది కాని ఇంకా నేను తగు స్థితి సాధించలేదు. అనుభూతుల ప్రచురణకు భగవంతుని ఆశీర్వాదము లభించింది. స్వామివారు మా ఇంటికి వచ్చుటకు లార్వా స్థితిలో ఉన్నట్లు చెప్పారు.

**భాగవత ఆశీర్వాదము:** తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా మిమ్మల్ని భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.


శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు

**గోవిందదాసు**

**(పుల్లగూర్ల సాయిరెడ్డి)**

**ఇ.నెం.1-1-53, వీధి నెం.1.హబ్సీగూడ,**

**హైదరాబాద్. ఫోన్: 040-27175050**

### శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

## ‘హరినామ క్షేత్రం’

# తిరుమల ఆలయ ప్రతిరూప నిర్మాణం

**చిన్నగుండవెల్లి, సిద్దిపేట, తెలంగాణ**

## భక్తులకు విజ్ఞప్తి

**ఓం నమో వేంకటేశాయ**

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి దివ్య ఆదేశంచే సిద్దిపేట జిల్లా చిన్నగుండవెల్లి గ్రామములో 7 ఎకరముల విశాల ప్రాంగణములో ‘హరినామ క్షేత్రం’ పేరుతో తిరుమల ఆలయ ప్రతిరూపం (వెండివాకిలి) నిర్మాణ కార్యక్రమము 02.07.2026 నుండి శంకుస్థాపనతో ప్రారంభమైంది. స్వామివారి దివ్య వాక్కు ప్రకారం, భవిష్యత్తులో ఈ క్షేత్రం ఒక దివ్యదేశంగా భక్తులకు ఆధ్యాత్మిక వెలుగును ప్రసాదిస్తుంది. ఈ ఆలయ ప్రాశస్త్యాన్ని బహిర్గత పరచుటకు మరియు భక్తులను ఈ ‘క్షేత్రము’లో భాగస్వాములుగా చేర్చుటకు, స్వామివారు 2000 సంవత్సరం నుండి ప్రసాదిస్తున్న వేలాది అనుభూతులను మా ‘శ్రీవేంకటేశం’ మాసపత్రికలో ఏప్రిల్ 2023 నుండి ‘దిశా నిర్దేశం’ అనే శీర్షికతో ధారావాహికంగా ప్రచురిస్తున్నాము. మరియు ఇవి www.srivenkatesham.org వెబ్ సైట్ లో తెలుగు, ఇంగ్లీష్ భాషలలో లభ్యమగును.

2. ఇలాంటి మహాభాగ్యం జన్మజన్మలకైనా లభించదు. మనకు లభించిన ఈ అమూల్యమైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుందాం! ఆలయ నిర్మాణం ఒక మహా యజ్ఞం. ఈ యజ్ఞంలో ప్రతి ఒక్కరూ ఒక సమిధలాగా ఆలయ నిర్మాణంకై శక్తికొలది విరాళం అందించి శ్రీనివాసుని సేవలో భాగస్వాములం అవుదాం!

మనతో రానిది సంపద.. మనతో వచ్చేది శ్రీహరి సేవ మాత్రమే. మీ విరాళమే శ్రీవేంకటేశ్వరుని ఆలయ నిర్మాణానికి బంగారు ఇటుక. ఈ సేవలో మీరు కూడ భాగస్వాములుకండి.. హరినామ క్షేత్ర నిర్మాణానికి మీవంతు సహాయాన్ని అందించి, శ్రీ వేంకటేశ్వర స్వామి వారి అపార కృపను పొందండి. గోవింద.. గోవింద.. శ్రీవేంకటేశ.. గోవింద..

## చందా వివరములు

| మహారాజ పోషకులు | రాజ పోషకులు | పోషకులు | మహా దాతలు | దాతలు | విశేష దాతలు |
|---|---|---|---|---|---|
| 50 లక్షల రూపాయలు, ఆ పైన | 25 లక్షల రూపాయలు, ఆ పైన | 11 లక్షల రూపాయలు, ఆ పైన | 1 లక్ష రూపాయలు, ఆ పైన | రూ.11,116/-, ఆ పైన | ఆలయంలో ఒక భాగాన్ని నిర్మించుట |

**భక్తులు యథాశక్తి సమర్పించవచ్చును**

మీకు అనువైన విరాళమును ఈ క్రింది అకౌంట్‌లో జమచేసిన తరువాత మీ అడ్రస్, చందా వివరాలను ఈ క్రింది నెంబర్‌కు మెసేజ్ లేదా వాట్సాప్ ద్వారా తెలియ చేయగలరు. మరియు మీకు తగిన రసీదును రిజిస్టర్డ్ పోస్టు ద్వారా పంపించగలము. (5000కు ఎక్కువ పంపినవారికి మాత్రమే రసీదు పంపబడును) Note: We do not accept foreign currency.

## BANK ACCOUNT DETAILS

| BANK | NAME | IFSC Code | A/c Number |
|---|---|---|---|
| SBI, Habsiguda | Sri Venkateshwara Maha Mantra Peetham | SBIN0016514 | 45388232753 |
| HDFC, Siddipet | Sri Venkateshwara Maha Mantra Peetham | HDFC0008931 | 50200124113242 |

**వివరాలకు సంప్రదించగలరు:**

**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

ఇంటి నెం.1-1-53, వీధి నెం.1, హబ్సిగూడ,
హైదరాబాద్-500007.

**గోవిందదాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)**

9348212354, 9348811223
040-27175050

ఓం నమో వెంకటేశాయ

# పవిత్ర యజ్ఞ ఆహ్వానం

శ్రీ వేంకటేశ్వర మహా మంత్ర పీఠం ఆధ్వర్యంలో

## 1 వ శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం



తేది 26-08-2026 ఉ. 10.30 నుండి, హరినామ క్షేత్రం, సిద్దిపేట

అన్నాద్భవంతి భూతాని పర్జన్యాదన్నసంభవః।
యజ్ఞాద్భవతి పర్జన్యో యజ్ఞః కర్మసముద్భవః॥ -శ్రీమద్భగవద్గీత 3.14

భావం: అన్నము వలన సమస్త ప్రాణులు ఉద్భవిస్తాయి. అన్నము వర్షము వలన కలుగుతుంది. వర్షము యజ్ఞము వలన కలుగుతుంది. యజ్ఞము సత్కర్మల వలన ఉద్భవిస్తుంది.



**యజ్ఞమే లోకక్షేమానికి ఆధారం యజ్ఞము చేత శ్రీమహావిష్ణువు ప్రసన్నుడు అవుతాడు. తిరుమల క్షేత్ర వాసుడు యజ్ఞ ప్రియుడు కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామివారి తిరుమల ఆలయ ప్రతిరూప నిర్మాణం సిద్ధిపేట జిల్లా, చిన్నగుండవెల్లి గ్రామంలో (హరినామక్షేత్రం) తేది 02–07–2026 శంకుస్థాపనతో ప్రారంభమై, దివ్య సంకల్పంతో ఆలయ నిర్మాణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.**

ఈ దివ్య తరుణంలో, సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు త్వరితగతిన ఆలయంలో కొలువుదీరి భక్తులను అనుగ్రహించాలని, ఆలయ నిర్మాణం శీఘ్రంగా పూర్తి కావాలని, సమస్త లోకక్షేమం కలగాలి, భక్తుల మనోభీష్టాలు నెరవేరాలి అనే మహాసంకల్పంతో- శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం సిద్దిపేట చిన్న గుండవెల్లి గ్రామంలో ఆలయ ప్రాంగణంలో యాగ మండపంలో ఈ యజ్ఞాన్ని ప్రతి మాసము ఒకసారి, తిరుమల క్షేత్ర పండితుల చేత వైదికంగా నిర్వహించబడును.

ఈ యజ్ఞం ఎంతో విశిష్ట ఫలితాన్ని అందిస్తుందని శ్రీ వేంకటేశ్వర స్వామివారి దివ్య కృపాకటాక్షాలు లభించి సమస్త సుఖ శాంతులు కలుగుతాయని వైఖానస ఆగమం తెలియజేస్తున్నది, ధర్మాభివృద్ధి, భక్తుల మనోభీష్ట సిద్ధి కలగాలని ప్రార్థిస్తూ ఈ మహా యజ్ఞం నిర్వహించబడును.

ఈ మహా యజ్ఞంలో దంపతులుగా ప్రత్యక్షంగా పాల్గొని యజ్ఞ సంకల్పం చేసుకునే అవకాశం కలదు. యజ్ఞాన్ని దర్శించడం, పాల్గొనడం, యజ్ఞ ప్రసాదాన్ని స్వీకరించడం భక్తులకు ఒక అదృష్ట అవకాశం.

**యజ్ఞం రుసుము**
**రూ. 3,000/-**

ప్రత్యక్షంగా హాజరు కాలేని భక్తులు సైతం తమ గోత్రనామాలను నమోదు చేయించుకొని పరోక్షంగా ఈ పవిత్ర యజ్ఞంలో భాగస్వాములు కావచ్చు. యజ్ఞ ప్రసాదాన్ని స్వీకరించి శ్రీ వేంకటేశ్వర స్వామివారి కృపకు పాత్రులు కండి.

**BANK ACCOUNT DETAILS**

| BANK | NAME | IFSC Code | A/c Number |
| --- | --- | --- | --- |
| SBI, Habsiguda | Sri Venkateshwara Maha Mantra Peetham | SBIN0016514 | 45388232753 |
| HDFC, Siddipet | Sri Venkateshwara Maha Mantra Peetham | HDFC0008931 | 50200124113242 |

**సంప్రదించండి:**
**93482 12354, 98480 56468, 9030359359**

ఓం నమో వేంకటేశాయ



# శ్రీకృష్ణావతారం

– డా॥ అద్దంకి శ్రీనివాస్

తే.గీ. తివిరి యజ్ఞాన తిమిర ప్రదీప మగుచు - నవ్యయంబైన బ్రహ్మంబు ననుభవించు
భరిత సత్త్వుండు సత్కర్మ నిరతుఁ డతుల - భూసురశ్రేష్ఠుఁ డలఘుండు బుధనుతుండు

గురువు – అజ్ఞానం అనే చీకటికి దీపం. బ్రహ్మానందాన్ని అనుభవించే సత్త్వగుణ సంపన్నుడు. నిత్యం సత్కర్మల్ని ఆచరించే సత్పురుషుడు. సాటిలేని బ్రాహ్మణ శ్రేష్ఠుడు. గొప్పవాడు. పండితులు కొనియాడేవాడు.

గుర్తుందా! మనం గురుపత్ని ఆదేశంపై అడవికి వెళ్ళి కట్టెలు తెచ్చిన సంగతి. అప్పుడు పెద్ద వర్షం వచ్చింది. ఉరుములు, మెరుపులు. చీకటి పడింది. ఒకటే చలి. మనం దారితప్పి అడవిలో ఎక్కడికో వెళ్ళిపోయాం. తెల్లవారేవరకూ అక్కడే ఉండిపోయాం.

అప్పుడు మన గురువుగారే మనల్ని వెతుక్కుంటూ వచ్చి మనకోసం కంగారు పడలేదూ! మనల్ని నిండు నూరేళ్ళూ ఐశ్వర్యంతో వర్ధిల్లమని దీవించలేదూ! దానికి కుచేలుడు ఇలా అన్నాడు. 'శ్రీకృష్ణా! అన్నీ గుర్తున్నాయి. అయినా ముల్లోకాలకు నువ్వే గురువ్వి. నీకు మళ్ళీ గురువుంటాడా? అంతా నీ లీల! అన్నాడు. శ్రీకృష్ణుడికి అతడి మాటల్లోని ఆంతర్యం అర్థమయింది. మిత్రమా! ఏం తెచ్చావయ్యా నాకోసం? అది ఎంత లేశమైనా నాకు మహా ప్రసాదమే. ఎందుకంటే నువ్వు తెచ్చావు కాబట్టి. నాపై భక్తిలేని నీచుడు మేరుపర్వతం తెచ్చి ఇచ్చినా తిప్పి కొడతాను.

కం. దళమైనఁ బుష్పమైనను - ఫలమైనను సలలిమైనఁ బాయని భక్తిం
గొలిచిన జను లర్పించిన - నెలమిన్ రుచిరాన్నముగనె యేను భుజింతున్

పత్రం, పుష్పం, ఫలం, తోయం ఏదైనా భక్తితో అర్పిస్తే అది నాకు పరమాన్నమే. ఇష్టంగా స్వీకరిస్తాను అన్నాడు.

ఇంతలా చెప్పినా తాను తెచ్చిన అటుకుల్ని శ్రీకృష్ణుడికి ఇవ్వలేకపోయాడు కుచేలుడు. మౌనం వహించాడు. శ్రీకృష్ణుడికి కుచేలుడు వచ్చిన కారణం తెలుసు. పూర్వం ఐశ్వర్యాన్ని కోరి అతడు నన్ను అర్చించలేదు. ఇపుడు తన భార్య కోసం వచ్చాడు. అందుకే ఇంద్రాదులకు సైతం లేనన్ని సంపదలు ఇతడికి ఇవ్వాలి అనుకొని – ఇదేమిటి కుచేలా? అని చనువుగా అటుకుల మూట విప్పాడు. వాటిలోంచి ఒక గుప్పెడు అటుకులు తీసుకుని 'నాకు ఇవి చాలవా' అంటూ ఆరగించాడు. వెంటనే మరో పిడికెడు అందుకున్నాడు. అప్పుడు రుక్మిణి 'స్వామీ ఇతడికి సకలసంపదలూ అందించడానికి మీరు తిన్న అటుకులు చాలు. ఇంకానా వద్దు' అని వారించింది.

కుచేలుడికి ఆ రోజు గొప్ప ఆతిథ్యం లభించింది. మరునాడు ఉదయం తన నగరానికి బయలుదేరాడు. అతడి హృదయం ఆనందంలో తేలిపోతోంది. 'ఆగర్భ దరిద్రుణ్ణయిన నేనెక్కడ? శ్రీకృష్ణుడెక్కడ? ఆహా! నన్ను ఎంత ఆదరించాడు! ఎంత సత్కరించాడు!

అరె! అతడి పట్టపురాణి రుక్మిణీదేవి కూడా నాకు వింజామరలు విసిరిందే! నా మిత్రుడు నా కాళ్ళు పట్టాడే! ఏమి నా భాగ్యం! అనుకుంటూ తన నగరం చేరుకున్నాడు. తన నగరంలో తను ఉండేచోటు, ఇల్లు ఇంతకు ముందులా లేవు. ఆశ్చర్యపోయాడు.

చంద్రకాంత శిలలతో కూడిన కట్టడాలతో, చక్కటి ఉద్యానవనాలతో, సరోవరాలతో, అనేక భూషణాలు ధరించిన దాసదాసీ జనులతో కళకళ లాడే ఒక సుందర భవనం కనిపించింది. ఇది ఏ పుణ్యాత్ముడి భవనమో అనుకున్నాడు. కానీ అంతలోనే ఆ భవనంలోంచి సుందరీమణులు వచ్చి కుచేలుణ్ణి సాదరంగా లోపలికి తీసుకువెళ్ళారు. లోపలికి వెళ్ళగానే మానవరూపం ధరించిన లక్ష్మీదేవిలా ఉన్న ఒక స్త్రీ ఎదురు వచ్చింది. ఆమెను చూచి ఆశ్చర్యపోయాడు కుచేలుడు. ఆమె ఎవరో కాదు – అతడి భార్యే.

అయ్యో! నేను ధనం కోసమే వెళ్ళాను. అడక్కపోయినా ఇలా నాకు సకల సంపదలూ అనుగ్రహించాడు అని భక్తి ప్రపత్తులతో నమస్కరించాడు కుచేలుడు. శ్రీకృష్ణుడినే ధ్యానిస్తూ జీవితాన్ని చరితార్థం చేసుకున్నాడు.

రాజా! ఈ కుచేలోపాఖ్యానం విన్నవారికి, చెప్పినవారికి ఇహలోక సౌఖ్యాలు తప్పక లభిస్తాయి. పరలోక సౌఖ్యాలూ, హరిభక్తీ, యశస్సూ కలుగుతాయి. కొన్నాళ్ళు బలరామకృష్ణులు ద్వారకలోనే సుఖంగా ఉన్నారు. ఒకసారి సూర్యగ్రహణం వచ్చింది. శమంతకపంచకం అనే పవిత్ర క్షేత్రానికి చేరుకొని పుణ్యస్నానాలు చేశారు.

దానాలు ఇచ్చి, భోజనాలు చేసి అక్కడే పొన్నచెట్ల నీడలో విశ్రమించారు. ఎందరో రాజులు అక్కడికే వచ్చి శ్రీకృష్ణుణ్ణి సందర్శించారు. బలరామకృష్ణులు వచ్చినవారందరినీ సత్కరించారు. ఆ రాజులు – "మన శాస్త్రాలూ, వాక్కులూ, మనస్సులూ ఏ పరంధాముడి పాదతీర్థం వల్ల పవిత్రాలౌతున్నాయో, ఏ మహాత్ముడి పాదస్పర్శకు నోచుకున్న ప్రదేశమంతా ముక్తికి హేతువవుతుందో అలాంటి మహానుభావుడే శ్రీకృష్ణుడు. సనక సనందనాది మహర్షులు ఎంత తపించినా కనిపించని ఈ మంగళ స్వరూపుడు మన కళ్ళముందు ఇలా సాక్షాత్కరిస్తున్నాడు" అన్నారు.

ఆ వచ్చినవారిలో కుంతీదేవి ఉంది. తన అన్న వసుదేవునితో కష్టం సుఖం మాట్లాడింది. ఈలోగా యశోదానందులు వచ్చారు. వాళ్ళను చూడగానే శ్రీకృష్ణుడు ఆప్యాయంగా స్వాగతం పలికాడు. పుత్రుడిపై ప్రేమ ఆనంద బాష్పాలుగా జాలువారింది. కంఠం మూగవోయింది.

రోహిణి, దేవకీదేవి యశోదను ప్రస్తుతించారు. "పసిగుడ్డుల్ని అప్పగిస్తే పెద్దవాళ్ళను చేశావు. నీ ఋణం ఎలా తీరుతుంది యశోదా?" అంటూ కౌగలించుకున్నారు.

పాండవులూ వచ్చారు. శ్రీకృష్ణుడు వాళ్ళను కుశల ప్రశ్నలు అడిగాడు. ద్రౌపది, శ్రీకృష్ణుడి భార్యలూ ఒకచోట చేరారు. సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నారు.

## పెళ్ళి ముచ్చట్లు

ఒకరినొకరు వారి వారి పెళ్ళి ముచ్చట్లు అడిగి తెలుసుకొని ఆనందిస్తున్నారు. అప్పుడు ద్రౌపది కోరిన మీదట లక్షణ తన పెళ్ళి వృత్తాంతం మొదలు పెట్టింది.

"ద్రౌపదీ! నేను గోవిందుడి కథలు విని విని పరవశించేదాన్ని. నా తండ్రి మద్ర దేశాధీశుడికి నేనంటే వల్లమాలిన ప్రేమ. అతడికి నా మనసు తెలుసు. అందుకే ఆకాశంలో కంటికి కానరాని మత్స్యయంత్రాన్ని ఏర్పాటు చేసి దాని నీడ నీటిలో ప్రతిబింబించేటట్లు చేసి, ఈ యంత్రాన్ని ఛేదించిన వాడికే నా కుమార్తెను ఇచ్చి వివాహం చేస్తానని ప్రకటించాడు.

ఎందరెందరో వచ్చారు. వచ్చినవాళ్ళు వచ్చినట్లే వెనుదిరిగారు. నీకో విషయం చెప్పనా? అర్జునుడు కూడా ఆ మత్స్యయంత్రాన్ని కొట్టలేకపోయాడు. అప్పుడు వచ్చాడు శ్రీకృష్ణుడు.

అలవోకగా బాణాన్ని ఎక్కుపెట్టి మత్స్య యంత్రాన్ని పడగొట్టాడు. నాకు పరమానందం కలిగింది. సిగ్గుల మొగ్గనౌతూ విప్పపూలమాల తీసుకువెళ్ళి స్వామి కొప్పుపై అలంకరించాను. అంతే! శ్రీకృష్ణుడు నన్ను స్వర్ణరథంపై కూర్చోబెట్టుకుని తనను ఎదిరించిన రాజులతో యుద్ధం చేసి వారిని సంహరించాడు" అంటూ తన స్వయంవర విశేషాలు తెలిపింది. ఇలా వాళ్ళందరూ ఎంతో ఆనందంగా కాలం గడిపారు.

నారద వ్యాస కణ్వాది మహర్షులు వచ్చి శ్రీకృష్ణుణ్ణి సేవించారు. శ్రీకృష్ణుడు వాళ్ళకు అతిథి సత్కారాలు చేసి "మహాత్ములారా! మిమ్మల్ని సేవిస్తే పుణ్యతీర్థాలను, పుణ్యక్షేత్రాలను సేవించిన ఫలం వస్తుంది" అన్నాడు.

అప్పుడా మునులు – "శ్రీకృష్ణా! విశ్వమంతా అనేక రూపాలతో ఉన్నది నువ్వే. ఒకే మట్టి ఎన్నో రూపాల్ని పొందుతుంది. అలాగే నువ్వూనూ. అన్ని ప్రాణుల్లోని ఆత్మా నీవే! నీ దర్శనం వల్ల సకల పాపాలూ తొలగిపోతాయి. నువ్వు పరమాత్మ స్వరూపుడివి మమ్మల్ని అనుగ్రహించు" అన్నారు.

అప్పుడు వసుదేవుడు ఆ మహర్షులతో "అయ్యా! భగవంతుడి అనుగ్రహానికి అడ్డుగా నిలిచేవి పూర్వకర్మలే. వాటిని రూపుమాపుకొనే పుణ్యకర్మలు ఏవో సెలవియ్యండి" అని అడిగాడు.

వసుదేవుడి అజ్ఞానానికి నవ్వుకున్నారు మహర్షులు. "ఇతడింకా శ్రీకృష్ణుణ్ణి తన కొడుకే అనుకొంటున్నాడు. పెరటిచెట్టు వైద్యానికి పనికిరాదు అన్నట్లు, దగ్గరలోనే ఉన్న పెన్నిధానాన్ని గుర్తించలేనట్లు ఇతడు శ్రీకృష్ణుణ్ణి గుర్తించలేదు.



# భక్తుల పాలిటి కల్పతరువు - శ్రీ గణేశుడు

: చిల్లర సీతారామారావు

క. "తలచితి నే గణనాథుని
తలచితి నే విఘ్నపతిని దలచిన పనిగా
దలచితి నే హేరంబుని
దలచిన నా విఘ్నములను తొలగుట కొరకున్"

భక్తులు మనసా వాచా కర్మణా ఒకసారి స్మరించుకున్నా చాలు గణేశుడు భక్తుల సమస్త మనోభీష్టాలను నెరవేరుస్తాడు. అందుకనే గణేశుడిని భక్తుల పాలిటి కల్పతరువు అని అంటారు. ఆబాల గోపాలానికి ఇష్టమైన దైవము గణేశుడు. భాద్రపద శుద్ధ చవితి నాడు గణేశుడి ఆవిర్భావము జరిగింది. కనుకనే ఆ చవితికి అధిక ప్రాశస్త్యము వచ్చింది. చవితినాడు తనను పూజించిన భక్తులకు మనోవాంఛా ఫల సిద్ధిని ప్రసాదిస్తాడు గణేశుడు. అందువలన సిద్ధి వినాయకుడు అన్న ఖ్యాతి కలిగింది అని ఈ క్రింది శ్లోకము ద్వారా తెలియుచున్నది.

శ్లో ॥ "సిద్ధయంతి సర్వకార్యాణి మనసాం చింతితాన్యాం
తేన ఖ్యాతి గతో లోకే నామ్నా సిద్ధి వినాయకమ్"

గణేశుడి ఆవిర్భావ దినమును గణేశ చతుర్థి లేదా వినాయక చవితి యను పేర్లతో పిలుచుకుంటారు. ఆ రోజు భక్తి శ్రద్ధలతో గణేశుడిని పూజించుకుంటారు. తొమ్మిది

రోజులు ఘనంగా ఉత్సవములు జరుపుతారు. తొమ్మిదవ రోజున గణేశుడిని ఊరేగించి నిమజ్జనము గావిస్తారు. గణేశుడు అను శబ్దము గణ, ఈశుడు అను రెండు పదముల కలయిక. గణ శబ్దమునకు వర్గము, సముదాయము, సమూహము అను అర్థములు ఉన్నాయి. ఈశుడు అనగా ''స్వామి'' యని అర్థం. అష్ట వసువులు, ద్వాదశ రుద్రులు, ద్వాదశాదిత్యులు – వీరిని గణదేవతలంటారు. గణములకు ఈశుడు కనుక గణేశుడు. భాద్రపద శుద్ధ చవితి నాడు గణేశ చతుర్థి వ్రతమును ఆచరించుట అనాది నుండి ఉన్నది. దేవతలు, దేవేంద్రుడు, భగీరథుడు, ధర్మరాజు మున్నగు ఎందరో ఈ వ్రతమును ఆచరించి తమ తమ కార్యములను దిగ్విజయము గావించుకున్నారు. హిందువులు ఏ శుభకార్యమును సంకల్పించుకున్నా ప్రథమంగా గణేశుడిని పూజించుకుంటారు.

గణేశుడికి అనేక నామములు ఉన్నాయి. బ్రహ్మవైవర్త పురాణము గణేశుడికి చెందిన 8 నామములను పేర్కొన్నది.

**శ్లో ॥ "గణేశమేకదంతంచ హేరంబం విఘ్ననాయకమ్**
**లంబోదరం శూర్పకర్ణం గజవక్త్రం మహోగ్రజమ్"**

ఈ నామాష్టక స్తోత్రం సామవేదోక్తమైనది. సర్వవిఘ్నములను నాశనము గావించేది. కనుక ఈ నామాష్టకమును పఠిస్తూ గణేశుడికి వందనము చేయాలి. విఘ్నములకు అధిపతి కావున విఘ్నేశ్వరుడు, మూషికమును వాహనముగా కలవాడు కావున మూషికవాహనుడు, ఏకదంతము కలిగియుండుటచే ఏకదంతుడు, ఉదరము పెద్దదిగా ఉండుట వలన లంబోదరుడు, చెవులు చేటంత కలవి కనుక శూర్పకర్ణుడు, సర్వసిద్ధులు కలవాడు కనుక సర్వసిద్ధిప్రదాయకుడు – ఇలా విభిన్న నామములతో గణేశుడిని భక్తులు స్మరించుకుంటారు. అంతేకాదు ఈయన యుగాలను బట్టి వివిధ రూపాలతో అవతరించాడు. కృతయుగములో కశ్యపుడు అదితి దంపతులకు మహోత్కట వినాయకుడిగా అవతరించాడు. ఆ యుగమున ఆయన వాహనము సింహము. దశభుజములు కలవాడు, బంగారపు శరీరము గలవాడు, త్రేతాయుగమున శివపార్వతులకు మయూరేశ్వరుడుగా అవతరించాడు. ఆ యుగములో ఆయనది నెమలి వాహనము. ఆరు భుజములు, స్ఫటిక శరీర ఛాయ గలవాడు. ద్వాపరయుగములో శివుడి కుమారుడిగా అవతరించాడు. ఆ యుగమున ఆయన పేరు గజాననుడు. వాహనము మూషికము. మూషికవాహనము గజాననుడికి భూదేవి ద్వారా ప్రాప్తించింది. చతుర్భుజములు గలవాడు. కుంకుమరంగు శరీర ఛాయ గలవాడు. కలియుగమున గణేశుడి అవతారము ధూమకేతువు. ఈ యుగమున వాహనము అశ్వము. రెండు భుజములు కలవాడు. పొగరంగు శరీరఛాయ కలవాడు. భక్తులు గణేశుడిని విఘ్నాధిపతిగా ఆరాధించుకుంటారు. దీనివలన అపనిందలు, ఆటంకములు మున్నగునవి తొలగిపోతాయని తమ కార్యములన్నీ నిరాటంకముగా కొనసాగుతుంటాయని భక్తుల అచంచల విశ్వాసము. గణేశుడి విఘ్నాధిపత్యమును గురించి పురాణాలలో నొక కథ ఉంది.

ఒకసారి మునులు, దేవతలు మున్నగువారందరూ కలిసి శివుడి దగ్గరకు వెళ్ళి ఆయనను స్తుతించారు. దేవా! రాక్షసులు మిమ్ములను తపస్సు ద్వారా మెప్పించి వరములు పొందారు. ఆ వర గర్వముతో మా పనులకు, తపస్సుకు ఆటంకములు కలిగిస్తున్నారు. రాక్షసులను నిరోధించి మమ్ములను రక్షించుట కొరకు ఒక విఘ్నాధిపతిని నియమించండి. ఆ పదవి కొరకు కుమారస్వామి, గణపతి ఇరువురూ పోటీ పడ్డారు. శివుడు వారిద్దరికీ ఒక పరీక్షను పెట్టాలని నిశ్చయించుకున్నాడు. అదే సంగతిని ఇరువురు తనయులకు చెప్పాడు. ముల్లోకములలోని సమస్త తీర్థముల యందు స్నానము గావించి ఎవ్వరు ముందుగా నా వద్దకు వస్తారో వారే విఘ్నాధిపత్య పదవికి అర్హులు అని పలికాడు శివుడు. వెంటనే కుమారస్వామి నెమలవాహనము మీద వేగముగా బయలుదేరాడు. మూషికవాహనము మీద ప్రయాణము కష్టసాధ్యము కనుక తరుణోపాయమును సూచించమని గణేశుడు శివుడిని ప్రార్థించాడు. శివుడు గణేశునకు నారాయణ మంత్రముపదేశించాడు. ఆ మంత్ర ప్రభావము వలన కుమారస్వామికి ప్రతి తీర్థమున తనకంటె ముందుగా స్నానము చేసి వస్తున్న అన్నగారిని చూసి ఆశ్చర్యపోయాడు. అన్నగారే విఘ్నాధిపత్యమునకు అర్హులు. ఆయనకే ఆ పదవిని ఇవ్వండి అని కుమారస్వామి శివుడిని ప్రార్థించాడు. శివుడు భాద్రపద శుద్ధ చతుర్థి నాడు గణేశునకు విఘ్నాధిపత్యమును అనుగ్రహించాడు.

గణేశుడు కూడా శిష్టరక్షణ, దుష్టశిక్షణ కొరకు అవతారము లెత్తి శిష్టులను బాధపెడుతున్న అసురులను సంహరించాడు.

వక్రతుండ గణపతి అవతారములో మత్సరాసురుడిని,
ఏకదంత గణపతి అవతారములో మదాసురుడిని,
మహోదరగణపతి అవతారములో మోహాసురుడిని,
గజానన గణపతి అవతారములో లోభాసురుడిని,
లంబోదర గణపతి అవతారములో క్రోధాసురుడిని,
వికటగణపతి అవతారములో కామాసురుడిని,
విఘ్నరాజగణపతి అవతారములో మమతాసురుడిని,
ధూమ్రవర్ణ గణపతి అవతారములో అభిమానాసురుడిని వధించి దేవతలకు, ప్రజలకు రాక్షసుల తాకిడి లేకుండా చేశాడు.

గణేశుడి జన్మ వృత్తాంత గాథలు పురాణాలలో అనేక రకాలుగా వర్ణించబడినాయి. శివపురాణములో ఒక కథ ఇలా వర్ణించబడింది. పార్వతీదేవి ఒకసారి స్నానము చేయుటకు వెళుతూ దగ్గర ఎవ్వరూ లేరని గమనించింది. శరీరమునకు రాసుకోగా మిగిలిన నలుగుపిండితో ఒక ప్రతిమను చేసి ప్రాణము పోసింది. ఆ బాలుడిని ద్వారము దగ్గర నిలబడి ఎవ్వరినీ లోపలికి రానీయవద్దు అని చెప్పి స్నానానికి వెళ్ళింది. అదే సమయమున శివుడు అక్కడికి వచ్చి స్నానపు గదిలోనికి వెళ్ళబోతుండగా కాపలాగా ఉన్న బాలుడు అడ్డుపడ్డాడు. శివుడు ఆగ్రహముతో తన త్రిశూలముతో ఆ బాలుడి తలను నరికివేశాడు. పార్వతీదేవికి ఈ సంగతి తెలిసి రోదిస్తూ ఆ బాలుడిని బ్రతికించమని శివుడిని ప్రార్థించింది. శివుడు ఏనుగు తలను తెచ్చి మొండెమునకు అతికించి ప్రాణము పోశాడు. ఆ బాలుడు వికార రూపమును పొందినాడని తలచి అగ్రపూజ జరుగునట్లు అనుగ్రహించాడు.



బ్రహ్మవైవర్త పురాణములో వర్ణించబడిన కథ ఈ విధముగా ఉన్నది. పార్వతీదేవికి పుత్రుడు జన్మించాడు. బాలుడి పుట్టిన రోజును పురస్కరించుకుని కైలాసములో జన్మదినోత్సవమును ఏర్పాటు చేశారు. దేవతలు, మునులు మున్నగువారంతా ఆ ఉత్సవమునకు విచ్చేశారు. శనిదేవుడు కూడా ఆ ఉత్సవానికి వచ్చాడు. కాని తల వంచుకొని నిలబడ్డాడు. అలా తల వంచుకోవడానికి ఒక కారణమున్నది. అది శని భార్య శనికి ఇచ్చిన శాపము. ఆ శాపము ప్రకారము శని ఎవరినైనా తల పైకెత్తి చూస్తే వారి శిరస్సు తెగి క్రింద పడుతుంది. పార్వతీదేవి అడిగినప్పుడు ఈ వృత్తాంతమును తెలియచేస్తాడు శని. విధిరాతను ఎవ్వరూ తప్పించలేరు. అయిననూ ఈ బాలుడు శివుడి కుమారుడు. ఈ బాలునకు ఏమీ కాదు. తల పైకెత్తి ఈ బాలుడిని చూడుము అని పార్వతీదేవి పలికింది. పార్వతీదేవి వచనానుసారం శని తల పైకెత్తి ఆ బాలుడిని చూశాడు. వెంటనే బాలుడి శిరస్సు తెగి క్రిందపడింది. తల తెగిన బాలుడిని చూచిన పార్వతీదేవి విలపించసాగింది. ఆమె విలాపమును చూడలేక విష్ణువు ఉత్తరదిక్కున తలపెట్టి నిద్రిస్తున్న ఒక గజము తలను నరికి తెస్తాడు. ఆ తలను బాలుడి మొండెమునకు తగిలించి ప్రాణము పోశాడు. ఆ బాలుడికి గజాననుడు అని నామకరణము గావించాడు. అక్కడ ఉన్నవారందరూ సంతోషించారు. కానుకలు సమర్పించారు. గణేశుడి జన్మ వృత్తాంత కథాగమనంలో భేదాలు ఉన్నప్పటికీ గణేశుడు శివపార్వతుల ద్వారా అవతరించాడన్నది అన్ని కథలలోని ముఖ్యాంశము.

భాద్రపద శుద్ధ చవితి నాడు భక్తులు వేకువ జాముననే లేచి స్నానాదికములు పూర్తి గావించుకుంటారు. గణేశుడికి మంటపమును ఏర్పాటు చేస్తారు. మంటపములో బియ్యము పోసి, దానిమీద గణేశుడి ప్రతిమను ప్రతిష్ఠిస్తారు. పూజలు అందుకొనే ప్రతిమను మట్టితో తయారు చేసినది అయితే శ్రేష్ఠము. ఒకరోజు ముందుగానే పత్రములు, పుష్పములు, ఫలములు మున్నగువాటిని తెచ్చుకుని గృహము నందుంచుతారు. మధ్యాహ్న సమయమున కుటుంబీకులు అందరూ కలిసి మంత్రపూర్వకముగా గణేశుడిని పూజిస్తారు. దేవుడికి ఇరవై ఒక్క కుడుములు నైవేద్యముగా పెడతారు. తర్వాత అయిదు కుడుములు ప్రతిమ దగ్గర ఉంచుతారు. అయిదు కుడుములు పూజలు చేయించిన బ్రాహ్మణునకు ఇస్తారు. మిగతా కుడుములను కుటుంబ సభ్యులు స్వీకరిస్తారు. పూజ అయిపోయిన తరువాత బ్రాహ్మణునకు భోజనము ఏర్పాటు చేస్తారు. భోజనానంతరం బ్రాహ్మణునకు దక్షిణ, తాంబూలాదులను సమర్పిస్తారు. వీటితోపాటు పూజాసామగ్రిని కూడా బ్రాహ్మణునకు ఇస్తారు. కలియుగములో గణపతి, చండిక – వీరిని స్మరించినా, పూజించినా, సమస్త పాపములు నశించిపోతాయని, సమస్త కార్యములు శీఘ్రముగా నెరవేరుతాయని పురాణోక్తి. భాద్రపద శుద్ధ చవితినాడు గణేశుడికి పూజలు చేసి ఈ విధముగా ప్రార్థించుకుంటారు. ఓ గజాననా! నీవు అజుడవు. అనగా పుట్టుక లేనివాడు. నిర్వికల్పుడవు. నిరీహుడవు. నిరాకారుడవు. అద్వితీయుడవు. ఆనందస్వరూపుడవు. పూర్ణుడవు. బ్రహ్మస్వరూపుడవు అయిన నిన్ను భజించుచున్నాను.

**శ్లో ॥ "అజం నిర్వికల్పం నిరాకారమేకం**
**నిరానందమద్వైత మానంద పూర్ణం**
**పరం నిర్గుణం నిర్విశేషం నిరీహం**
**పరబ్రహ్మరూపం గణేశం భజేమహం"**



# గణేశ చతుర్థి

- డా. దేవులపల్లి పద్మజ

**గౌరీపుత్రం ప్రణవ స్వరూపం నమామి**
**గణాధిరాజో విజయస్థిరో గణపతి ధ్వజీ!**
**దేవదేవ స్మరప్రాణదీపకో వాయుకీలకః!!**
**సర్వవిఘ్నైకహరణం సర్వకామఫలప్రదమ్**
**తతస్తస్మై సర్వనామ్నాం సహస్రమిద మబ్రవీత్.**
**సర్వవిఘ్నాలను తొలగించి ఇష్టకామనలు తీర్చే**

ఆదిదేవుడికిదే నా నమస్సుమాంజలులు. స్థిరవిజయాలను భక్తులకు అనుగ్రహించే ఆదిదేవునకు నమస్కరిస్తూ అందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు. గణేశ చతుర్థికి ముందు తదియ రోజు కొన్ని ప్రాంతాలలో గౌరీ స్థాపన పూజ చేసి శివపార్వతులను పూజించి మరునాడు చతుర్దశి రోజు వినాయక వ్రతం చేస్తారు. ఈ సందర్భాన్ని చక్కని పద్యంలో డాక్టర్ రఘుపతి శాస్త్రుల వారు హృద్యంగా వర్ణించారు.

**భాద్రపదార్ధమౌ తదియ వర్థిల నెంచుచు నుండు గాత**
**ఆ అద్రిజ పార్వతీ జనని అర్మిలితో గని పూజసేయగా**
**భద్రమొసంగుచున్ కనుత భక్తుల నా గజవక్త్ర కల్మితో**
**క్షుద్ర జనమ్ములన్ భువిని కూల్చి హితమ్మొనరించి సర్వదా..**

మన సంప్రదాయంలో ఏ పని తలపెట్టినా ముందుగా శ్రీవిఘ్నేశ్వరుని తలచి, సక్రమంగా కొలిచి ఆ పనిని ప్రారంభిస్తాము. మనం జరుపుకునే పండుగలలో వినాయక చవితి అత్యంత ప్రధానమైనది. భాద్రపద మాస శుద్ధ చవితినాడు విఘ్నేశ్వర జననం జరిగింది. వేదకాలం నుండి 'గణాధిపత్యము' వినాయకునికి ఇవ్వబడినట్లు పురాణాల ద్వారా మనకు తెలుస్తోంది. త్రేతాయుగంలో శ్రీరాముడు, ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడు కూడా శ్రీవినాయకుని కొలిచినట్లు మనకు తెలుస్తోంది.

**గణానాం త్వా గణపతిగం హవా మహే**
**కవిం కవీనా ముపమశ్రవస్తమం**
**జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మణస్పత**
**ఆనశృణ్వన్నూతిభిస్సీద సాధనమ్!!**

ఈ మంత్రములో గణపతిని ''జ్యేష్ఠరాజః'' అని స్తుతించటం జరిగింది. "ప్రథమంగా పూజలందుకుంటున్న వాడు" అని అర్థము. గణములకు అధిపతి 'గణపతి'. గణములనగా దేవతా గణములని అర్థము. సృష్టి అంతా కలిసి మొత్తం 33 కోట్ల దేవతాగణములచే నిర్వహింపబడుతూ వారి పాలనలో ఈ జగత్తు నడుస్తున్నదని వేదములు తెలియచేస్తున్నాయి. ఒక్కొక్క దేవతా గణమునకు ఒక్కొక్క సంఖ్య వుంది. అవి ఏమిటంటే రుద్రగణములు 11, గురు ఆదిత్యులు 12, వసువులు 8, అశ్వినులు 2. మొత్తంగా 33 దేవతా గణములు. ఈ అన్ని గణములకు అధిపతి, ప్రథముడు, ఏకైక దేవుడు శ్రీ గణపతి.

గణేశుడు ఓంకార స్వరూపుడని వేదం చెబుతున్నది. సంస్కృతంలో ''ఓం'' అనే అక్షరం వ్రాసి పరిశీలిస్తే, ఈ స్వరూపంలో కుడివైపు వంకరగా తిరిగియున్న ఒంపుయొక్క ఆకారమే 'వక్రతుండము'. చంద్రరూపమే అర్థానుస్వారము "అర్థేదులసితం" అని గణపతి అథర్వశీర్షం తెలియచేస్తోంది. దానిపైన వున్న చుక్కయే ఫాలనేత్రము. లంబోదరము అనగా పెద్ద పొట్ట. సంస్కృతంలో వ్రాసిన ఈ ఓంకారము అర్థం 3 అంకె వలె పెద్దపొట్ట వుండటం కూడా చూడవచ్చును.

ఈ విధంగా ఏర్పడిన ప్రణవం యొక్క ఆకారమే గణపతి స్వరూపము. కాబట్టి ప్రణవ స్వరూపుడు అని, ఎంతో రహస్యంగా దానిని మనకు తెలియకుండా పెద్ద మొత్తంలో జ్ఞానాన్ని ఉదరంలో ఇముడ్చుకున్నాడని మన ఋషులు మనకు సూచించారు.

అంతేకాదు గణేశ విద్య ప్రాచీనమైన బ్రహ్మవిద్య. ప్రతి సంవత్సరంలోను బ్రహ్మచారులకు బ్రహ్మవిద్యను ప్రారంభింపచేసే పవిత్రమైన దినమే భాద్రపద చతుర్థి. ఆ మరునాడే తూర్పున సప్తఋషులు ఉదయిస్తారు. ఈ సప్తఋషుల కిరణములు సాధకులపైన ప్రసరించే దినమే బ్రహ్మవిద్యకు అనువైన 'ఋషిపంచమి'. అందువలన గణపతి బ్రహ్మవిద్యాప్రదుడైనాడు.

మంత్రశాస్త్రములో గణేశుని అనేక మూర్తులుగా వర్ణించారు. వ్యాసమహర్షి విరచిత అష్టాదశ పురాణాలలో అర్థంకాని నిగూఢమైన అనేక రహస్యాలున్నాయి. ఆ రహస్యాలను వివరించుటకు మరో 18 ఉపపురాణాలను కూడా వ్యాసుడు రచించాడు. ఈ ఉప పురాణాలలో 'గణేశపురాణము' ముఖ్యమైనది.

గణపతి విష్ణుస్వరూపుడని మరియు పర్వత గుహలలో బదరీనారాయణమనే ప్రాంతంలో తపస్సు చేసి పరబ్రహ్మ సాక్షాత్కారము పొంది దాని ద్వారా దివ్యదృష్టికి గోచరించిన జగత్ సృష్టి మొదలుగా ప్రళయము వరకు గల అనేక దేవ రహస్యములను దర్శించినట్లు మహాభారతము ఆదిపర్వములో తెలియచేయబడినది.

మంత్రశాస్త్రములో గణపతులు 32 రకాలుగా చెప్పబడినాయి. అందులో ముఖ్యమైనవి బ్రహ్మ గణపతి, శక్తి గణపతి, హేరంభ గణపతి, నృత్య గణపతి, సంకష్ట గణపతి, అమృత సిద్ధి గణపతి, వర గణపతి, ఉచ్ఛిష్ట గణపతి మొదలైనవి. అనేక రూపములలో అనేక బీజాక్షరముల సమ్మేళనంలో అనేక మూలమంత్రములలో వర్ణింపబడిన గణపతి మంత్రము ఈ 32 గణపతులపైన ఆధారపడియున్నది.

మంత్రమహోదధిలోను, ఇతర వాస్తు గ్రంథములలోను ఈ గణపతులకు ధ్యాన రూపములు, మూలమంత్రములు కూడా చెప్పబడి వున్నాయి. ఇవి చాలా చోట్ల శిల్పములుగా చెక్కబడి వుండటాన్ని కూడా మనము చూడవచ్చును. అందులో ఎక్కువగా మనకు దర్శనమిచ్చేది ''వల్లభ గణపతి''. ఈ రూపంలో గణపతి ఎడమ తొడపై వల్లభాదేవి (వల్లభ అనగా ప్రియమైన అని అర్థం) గణేశుని ప్రియ సతి కూర్చుండి ఆమె కుడిచేయి గణేశుని భుజముపై వేసినట్లూ, ఎడమచేత కలువ పూవు ధరించినట్లూ, గణేశుని చేతిలో అంకుశం, బీజాపూరం, పాశం, ఏకదంతం, పద్మం ధరించినట్లు వర్ణింపబడినది. దీనినే లక్ష్మీగణపతి అనుకుని కొందరు పొరబడి లక్ష్మీగణపతి మంత్రముతో ఆరాధిస్తున్నారు. ఇది గమనించవలసిన విషయము.

గణపతికి గరిక పూజ విశేష ఫలితాన్నిస్తుంది. గణేశ చతుర్థినాడు మాత్రమే తులసితో పూజింపవచ్చును. మిగిలిన రోజులలో తులసి పూజ నిషిద్ధము. ఆయనకు ఉండ్రాళ్ళు, కొబ్బరి, చెరకు మొదలైన నివేదనలు తృప్తినిస్తాయి.

ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఏ రూపంలో ఆరాధించినా మూలమూర్తి ఒక్కరే కనుక భక్తి శ్రద్ధలతో, త్రికరణ శుద్ధిగా కొలచినవారి కొంగు బంగారమై కోరికలు ఈడేర్చి, ఇహపర సుఖాలు గణపతి ప్రసాదిస్తాడనటంలో ఏమాత్రము అతిశయోక్తిలేదు.

సమస్యలతో బాధపడుచున్నవారు, జీవితంలో చైతన్యం కోల్పోయినవారు నమ్మకంతో అథర్వశీర్షం 41 రోజులు శ్రద్ధగా పారాయణ చేసినట్లయితే ఆనంద తీరాలకు చేరుకుంటారు. ఇది అనుభవయోగ్యమైనది. ఈ పర్వదినాన మనందరం శ్రీగణేశుని భక్తిశ్రద్ధలతో కొలచి సర్వ సంకటములను దూరం చేసుకుని ఆనందంగా గడుపుదాం.

**ఓం శ్రీ వినాయకాయ నమామి**




# అష్టావక్ర మహర్షి

**గత సంచిక తరువాయి**

అష్టావక్రుడికి సుందరమైన రూపం రాకముందు వంకర టింకరగా కుంటుకుంటూ, వంగుతూ లేస్తూ నడుస్తుండేవాడు. ఒళ్ళంతా ఎనిమిది వంకరలుగా ఉంది కదా పాపం. ఆయన ఒకసారి నడుస్తూ వెళుతూ ఉంటే, అర్భకుడైనటువంటి భగీరథుడు కూడా అష్టావక్రుడి లాగే నడుస్తున్నాడు. అష్టావక్రుడు, భగీరథుడు తన రాజు కొడుకు కాబట్టి అహంకారంతో నన్ను వెక్కిరిస్తున్నాడు అనుకొని, భగీరథుడిని శపించటానికి కోపంతో శాపోదకం చేతిలోకి తీసుకున్నాడు. అంతలోనే ఆయనకు సందేహం వచ్చింది. ''వీడు నిజంగానే అర్భకుడా లేక నన్ను వెక్కిరిస్తున్నాడా?'' అని. ఈ విషయం ఆయనకు అనుమానంగా ఉండటం చేత, ''ఒకవేళ నాలాగా అర్భకమైన శరీరంతో ఉండి ఉంటే, మంచి దృఢమైన శరీరాన్ని పొందుతాడు. ఇతడి శరీరం ఆరోగ్యంగా దివ్యతేజస్సుతో వెలుగును గాక!'' అని ఆ శాపోదకం భగీరథుడి మీద చల్లాడు. సహజంగానే అతడు అర్భకమైన శరీరాన్ని కలిగి ఉండడం చేత, అష్టావక్రుడి దయ చేత ఉత్తమమైన శరీరాన్ని ధరించాడు భగీరథుడు.

కొంతకాలానికి అష్టావక్రుడికి వృద్ధాప్యం వచ్చేసింది. ఆయన భార్య అయిన సుప్రభాదేవికి ఆయన ఉత్తమగతులు కల్పించి ఆమెను ముందరే పంపించాడు. ఆమె వెళ్ళిపోయింది.

ద్వాపరయుగం వచ్చింది. ద్వారకలో కృష్ణపరమాత్మ ఉన్నాడు. కృష్ణుని వెతుక్కుంటూ ద్వారకకు చేరుకున్నాడు అష్టావక్రుడు. ఆయన కృష్ణుని చూచాడు. వెంటనే ధ్యానయోగంలో నమస్కరించాడు. శ్రీకృష్ణుడు ఆయనను చూచి లేచి, గౌరవించి ఆహ్వానించాడు. అర్ఘ్య పాద్యాదులు ఇవ్వబోతున్నాడు. ఇంతలో ఆయన శ్రీకృష్ణుడి పాదాల మీద తల ఉంచి శరీరాన్ని వదిలేశాడు. శ్రీకృష్ణుడు ఆయనకు స్వయంగా అంత్యక్రియలు జరిపించాడు. ఉదకాలను తానే స్వయంగా ఇచ్చి ఆ జీవుణ్ణి ఎంతో గౌరవించాడు.

అప్పుడు ఆయన పత్నులు, మంత్రులు అందరూ కూడా అష్టావక్రుడిని గురించి అడిగారు. ''ఎవరీ అష్టావక్రుడు? నీ సన్నిధిలో శరీరాన్ని వదిలిపెట్టిపోయినాడు? ఆయనకు అంత పరమభక్తి తాత్పర్యాలతో ఉత్తరక్రియలు నీవే నిర్వహించావు. అతడి వృత్తాంతమేమిటి?'' అని.

అప్పుడు కృష్ణుడు ఆయన పూర్వజన్మ వృత్తాంతాన్ని గురించి చెప్పాడు. ''ఈ అష్టావక్రుడు నాకు పరమభక్తుడు. జితేంద్రియుడు. మహా తపస్సంపన్నుడు. బ్రహ్మవంశస్థుడు. పూర్వం నేను బ్రహ్మను నా నాభికమలం నుండి సృష్టించి విశ్వసృష్టిని చెయ్యమని నియోగించాను. ఆయన సనక, సనందన, సనత్కుమార, సనాతనులు అనేటటువంటి నలుగురు ఋషులను సృష్టించాడు. వాళ్ళకు సంతానాన్ని కని సృష్టిని వృద్ధి చేయాలనే కోరిక లేదు. ఎందుకంటే వాళ్ళు బ్రహ్మజ్ఞానమందు నిష్ఠ కలిగినవాళ్ళు కావటం చేత సంతానాన్ని కనాలనే ఇచ్ఛ లేదు. వాళ్ళు స్త్రీ సంపర్కం ఇష్టపడక నిత్యం తపస్సు చేసుకుంటూ ఉండిపోయినారు. ఆ తరువాత కూడా సంతానాన్ని కనలేదు.

ఆ తరువాత బ్రహ్మ వసిష్ఠ, అంగిర, మరీచి, ప్రచేతసులు అనే మహర్షులను, మానసపుత్రులను సృష్టించాడు. వాళ్ళు కూడా తపస్సంపన్నులై వెళ్ళిపోయారు కాని, చివరకు బ్రహ్మదేవుడి ఉపదేశం చేత వాళ్ళు సంతానాన్ని పొందారు. అందులో ప్రచేతసుడికి అసితుడు అనే కుమారుడు కలిగాడు. అసితుడు గొప్ప విష్ణుభక్తుడు. ఆయనకు సంతానం లేదు. ఆయన తపస్సులో ఉన్నప్పుడు బ్రహ్మ ఆకాశవాణి రూపంలో ప్రత్యక్షమై, రుద్రుడిని గురించి తపస్సు చెయ్యమని అసితుడికి ఆజ్ఞ ఇచ్చాడు.

అసితుడు బ్రహ్మ ఆనతి ప్రకారంగా ఈశ్వరుడిని గురించి మహా తపస్సు చేస్తే, కొంతకాలానికి ఈశ్వరుడు ప్రత్యక్షమై 'రాధా మంత్రాన్ని' ఉపదేశించాడు. అసితుడు ఆ మంత్రాన్ని

ధారణ చేసి రాధాదేవి అనుగ్రహంతో ఒక కొడుకును కన్నాడు. ఆ కొడుకు పేరు దేవలుడు. ఆ దేవలుడు మాలావతి అనే ఒక రాజకుమార్తెను పెళ్ళి చేసుకున్నాడు. ఆమె యందు సంతానాన్ని పొందాడు. దేవలుడు చాలా విరాగి. చాలా తీక్షణమైన తపస్సు చేశాడు. ఆ తపస్సుకు దేవతలు కూడా భయపడ్డారు. ఆయన సూర్యుడికంటే తేజోవంతుడైనాడు. ఆయన తపస్సును భంగం చేయటానికి ఇంద్రుడు రంభను పంపించాడు. రంభను ఆయన తిరస్కరించి అవమానించాడు. రంభకు కోపం వచ్చింది. మరొక జన్మలో అష్టావక్రుడవై పుట్టమని దేవలుడిని రంభ శపించింది. కానీ తను చేసిన తప్పును ఆమె వెంటనే గ్రహించి ఆయనకు శాప విమోచనాన్ని కూడా తెలియచేసింది. ''మరొక జన్మలో అష్టావక్రుడవై పుడతావు కానీ నీ జ్ఞానము నీలోనే ఉంటుంది. నీ జ్ఞానానికి భంగకరమైన ఆజ్ఞ ఎవ్వరూ ఇవ్వలేరు. నీ జ్ఞానాన్ని ఎవ్వరూ అపహరించలేరు. నీవు జగత్పూజ్యుడవై అష్టావక్రుడవనే పేరుతో ఉంటావు'' అని ఆమె స్వర్గానికి వెళ్ళిపోయింది.

అలా అష్టావక్రుడిగా దేవలుడు ఏకపాదుడి కొడుకుగా పుట్టి దివ్యచరితుడైనాడు. ఆయన ఈనాడు ప్రత్యక్షంగా నా దగ్గరికి వచ్చి నాతో సన్నిహితంగా ఉండి నన్ను చూస్తూ ప్రాణాలు వదిలిపెట్టాలనే సంకల్పంతోనే అలా పుట్టాడు. కాబట్టి ద్వారకకు వచ్చి నన్ను స్తోత్రం చేసి నా ఎదురుగా ఉండి, శరీరాన్ని నా పాదాల మీద వదిలిపెట్టాడు'' అని కృష్ణుడు చెప్పాడు.

రాధాదేవి అంటే ఎవరు? ఒక సిద్ధాంతం ఎలా ఉందంటే – కృష్ణుడు కేవలం విష్ణువు అంశ మాత్రమే కాదు. గోలోకాధిపతియైన రాధాకృష్ణులిద్దరూ ఉన్నారు. వాళ్ళిద్దరూ పరాశక్తి, పరమపురుషుడు. విష్ణువు గోలోకానికి క్రిందుగా ఉండేటటువంటి విష్ణులోకాన్ని పరిపాలిస్తాడు. అన్ని లోకాల పైన గోలోకం ఉంది. అక్కడ పరమపురుషుడు, పరతత్త్వమైనటువంటి ప్రకృతి ఈ ఇద్దరూ కృష్ణుడు, రాధ అనే రూపాలలో ఉంటారు. ఆ గోలోకం సమస్త దేవతలకు, జీవులకు గమ్యస్థానం. అక్కడ – ఆ లోకంలో ఉన్న కృష్ణుడి యొక్క అంశయే ఈ ద్వాపర యుగంలోని కృష్ణుడు కాని, విష్ణువు కాదు అని ఆ సిద్ధాంతం. విష్ణువు యొక్క అతారము బలరాముడే. అందుకనే ఎనిమిదో అవతారంగా బలరాముడే అవతరించాడు.

ఈ కృష్ణుడు ఇక్కడ ఈ లోకంలో ఉండే ధర్మసంరక్షణ కోసం విష్ణు ప్రేరణ చేత, విష్ణువు తనను ప్రార్థిస్తేనే, గోలోకం నుంచి అవతారంగా ఇక్కడికి వచ్చాడు. ఎందుకంటే దుష్టసంహారం, శిష్టరక్షణ ఇత్యాది కార్యక్రమాలను విష్ణువు చేస్తున్నాడు. కాని గురువుగా పరమసత్యాన్ని బోధించే అధికారం మాత్రం విష్ణువు తీసుకోలేదు. అంటే ఆ అవతారంలో గురుత్వాన్ని వహించలేదు. (అయితే మరి కపిలుడు విష్ణువే. కపిలుడిగా బోధ చేసాడు). ఆ ద్వాపరాంతంలో పరమ సత్యాన్ని గురించి రూఢిగా ఒక నాలుగు మాటల్లో చెప్పమని, తన లోకానికి కూడా ఆధారభూతమైనటువంటి గోలోకానికి అధిపతి అయిన కృష్ణుణ్ణి విష్ణువు వేడుకుంటే – ఆయనే కృష్ణావతారంగా వచ్చి చెప్పాడని 'శ్రీకృష్ణ సిద్ధాంతం'. చైతన్య మహాప్రభువు వంటి వారందరూ కూడా దీన్ని ఇలాగే విశ్వసిస్తున్నారు. గౌడీయ మతస్థులు కూడా ఈ సిద్ధాంతమే నమ్ముతారు. 'ఉజ్జ్వల నీలమణి' అనేటటువంటి గ్రంథంలో కూడా కృష్ణచరిత్రను ఇలాగే చెపుతారు.

అనేకమంది విష్ణువులు, అనేకమంది రుద్రులు, అనేకమంది బ్రహ్మలు ఆ గోలోకానికి వెళ్ళి ఆయన దర్శనం చేసుకుంటారు. అక్కడ రాధాదేవి ఉంటుంది అని వాళ్ళ నమ్మకం. రుద్రుడు దేవలుడికి చెప్పింది ఈ రాధాదేవి మంత్రమే – దీన్నే జపించమని చెప్పాడు. అక్కడ ఆ పరాశక్తి రూపంలో ఉన్న రాధాదేవిని ఆ నామంతో జపించటం చేత, అష్టావక్రుడు కృష్ణతత్త్వంలో లీనమైనాడని మనం అన్వయించుకోవాలి. అదీ అన్వయం.

అష్టావక్రుడి చేత లోకానికి ప్రసాదించబడిన 'అష్టావక్రుడి సంహిత' అనే గ్రంథం ఇరవై అధ్యాయాలతో ఉంది. ఉత్కృష్టమైనటువంటి వేదాంత గ్రంథంగా పండితులు దీనిని వర్ణిస్తారు. ఆత్మోపదేశము, ఆత్మానుభవోల్లాసము, ప్రత్యాక్షేప ద్వారోపదేశము, ఆత్మజ్ఞాన సంకీర్తనము, లయయోగము, జ్ఞానయోగము, అనుభవ పంచకము, బంధమోక్ష వ్యవస్థ, నిర్వేదము, ఉపశమము, జ్ఞానము, స్వరూప సంస్థితి, ఆత్మసౌఖ్యానుభూతి, శాంతిశతకము, ఆత్మస్థితి అనుభవము, జీవన్ముక్తి అని అందులోని అధ్యాయాలు.

అష్టావక్రుడి యొక్క జ్ఞానబోధ విన్నటువంటి జనకమహారాజు ఆయనను అపరిమితంగా స్తోత్రం చేశాడు. ''ఈ మాటలతో ఈ సత్యాన్ని ఇంతగా ఇలాగ చేసిన బోధ నాకు ఎప్పుడూ లభించలేదు. నువ్వు జగత్పూజ్యుడివి. నీ రాక చేత, నీ దర్శనం చేత నా జన్మ చరితార్థమైంది'' అని ఎనిమిదేళ్ళ పిల్లవాడిగా వచ్చిన అష్టావక్రుడిని స్తోత్రం చేశాడు జనకమహారాజు. అంత ఉత్కృష్టమైన వ్యక్తిత్వం గల మహానుభావుడాయన. మహాజ్ఞాని, అగ్రగణ్యుడు. పరమాత్మలో విలీనమయ్యాడు. ఆయన బోధాంశాలు మాత్రం ఇంకా ఉన్నాయి. మహర్షులలో చిరస్మరణీయుడు అష్టావక్రమహర్షి.

త్రేత, ద్వాపర – రెండు యుగాల్లోనూ ఆయన ఉన్నాడు. కృష్ణావతార కాలం కోసమని వేచి వుండి, కృష్ణావతారం ప్రారంభమైన తరువాత తన కార్యం ముగించుకొని శరీరాన్ని కృష్ణుడి దగ్గర వదిలిపెట్టి ఆ విధంగా ముక్తి పొందాడు అష్టావక్రుడు. ఆయనలో విలీనం అయ్యాడు. 'బ్రహ్మవైవర్త

పురాణం'లో శ్రీకృష్ణఖండము అనే భాగంలో ఈ ప్రస్తావన ఉంది. ఆయన 'అష్టావక్ర సంహిత' నిత్యపారాయణ యోగ్యమైంది.

అష్టావక్రుడు శ్రీకృష్ణుణ్ణి చేసిన సోత్రం బ్రహ్మవైవర్తపురాణం శ్రీకృష్ణఖండంలో ఇలా ఉంది.

కం. గుణబీజ గుణాత్మక ని
ర్గుణ గుణి బీజాప్రమేయ గుణనాథ మహా
గుణశోభిత గుణరూపక
గుణనికరాధార దేవ గుణివరవినుతా!

కం. సిద్ధేశ సిద్ధరూపక
సిద్ధిప్రద సిద్ధిబీజ సిద్ధాధారా
సిద్ధిస్వరూప కేవల
సిద్ధాచార్యవర నిన్ను చేరి భజింతున్!

కం. వేదజ్ఞ వేదబీజక
వేదాత్మక వేదవేద్య వేదాధారా
వేదాతీత గుణాత్మక
వేదజనక నిన్ను భక్తి వినుతింతు నొగన్!

కం. సర్వేశ సర్వరూపక
సర్వోత్తమ సర్వబీజ సర్వాధారా
సర్వజ్ఞ సర్వవందిత
సర్వాతీత నిన్ను భక్తి సన్నుతిచేతున్!

కం. ప్రకృతీశ ప్రకృతివందిత
ప్రకృతిపురుషరూప ప్రాజ్ఞ ప్రకృతివిదూరా
ప్రకృతితరుబీజ కేశవ
ప్రకృతిస్థిర నిన్ను భక్తి ప్రణతింతుమదిన్!

కం. సృష్టీశ సృష్టికారణ
సృష్టిస్థిత్యంతబీజ సృష్ట్యాధారా
సృష్టివిరాట్తరుబీజక
సృష్టీశ్వరజనక నిన్ను సేవింతు మదిన్!

సీ. ప్రకృతియు మూలంబు బ్రహ్మేశ విష్ణువుల్
శాఖలు సురలుపశాఖలఖిల
తపములు పుష్పముల్ విపుల సంసారాది
కంబులు ఫలసమూహంబు లగుచున్
దనకు బ్రహ్మాండపాదపమున కర్థి నా
ధారుడ వటు నిరాధారకుడవు
కడిమి సర్వాధారకుడవు తేజోరూపు
డవును నిరాకారుడవు మహాత్మ!
సర్వమయుడవు మరియు స్వేచ్ఛామయుడవు
ముక్తిమయుడవు నఖిల ముముక్షులకున్
ముక్తిదాయకుడవు సుగన్మూర్తి వీవు
నీకు నతులాచరించెద నీరజాక్ష!

అందులో ఉండే శ్లోకాలకు తెలుగు తర్జుమా ఇది. ఈ విధంగా కృష్ణుడిని స్తోత్రం చేశాడాయన. దీన్నిబట్టి కృష్ణావతారానికి ఉత్కర్ష. ఇందులో మళ్ళీ భాగవతమే, కృష్ణపరమాత్మ చరిత్రయే సిద్ధించింది.

ఉత్తమలోకాలనేవి ఉన్నాయా అని చాలామంది అడుగుతుంటారు. ఒక్కమాటలో చెప్పాలంటే, ఆ లోకములు పొందిన జీవులకు అవి ఉన్నాయి. ఇతర జీవులకు అవి లేవు. ఈ భూలోకం మనందరికీ ఉంది. అందరూ సామాన్యంగా అనుభవిస్తాం ఈ భూలోకాన్ని. ఆ లోకములకు వెళ్ళినవారు మాత్రమే వాటిని అనుభవిస్తారు. దూరంనుంచీ ఈ లోకం ఇతరులకు కనిపిస్తుంది. ఆ లోకం వెళ్ళినవారికి మాత్రమే కనబడుతుంది. కానీ వెళ్ళనివారికి కనబడే లోకములు కావవి. అంటే, అవి సూక్ష్మంగా ఉండేటటువంటి లోకాలు. భౌతికమయిన లోకంలోలా, అంతరిక్షంలో క్షిపణులలో ప్రయాణించి వెళ్ళగలిగేవి కావు. అవి నిరాధారమయినవి. ఆకాశంలోని కొన్ని కొన్ని విశేషమైన ప్రదేశాలలో; జీవకోటి పొందేటటువంటి కొన్ని అతి విచిత్రమయినటువంటి అనుభూతులు ఏ ఆనందాన్ని ఏ మార్గంలో అనుభవించే వీలుందో, ఆ అనుభూతులిచ్చే ఆ ప్రదేశాలకు ఆయా లోకాలని పేరు. చంద్రమండలం, అంగారకమండలం దాటిన తరువాత భౌతిక లోకాలు లేవని చెప్పవచ్చును. బృహస్పతిలోకం దాటిన తరువాత లేనేలేవని చెప్పవచ్చు.

ఉదాహరణకు – ప్రేత లోకం ఉంది. జీవులు శరీరాన్ని వదిలిపెట్టి చంద్రమండలం చుట్టూ తిరుగుతారు. అక్కడికి వెళతారు. ఈ చంద్రుడు భూమిచుట్టూ తిరుగుతున్న పరిభ్రమణ కాలంలో వాళ్ళు చేసిన కర్మకు అనుకూలమయినటువంటి (లోకం) శరీరం, భార్య, భర్త ఇత్యాదులన్నీ పొందుతారు. అట్టి గర్భవాసంలోకి వెళ్ళి తమ యొక్క ఆ కర్మను అనుభవించటానికి జన్మలను ఎత్తుతారు. భూమి మీదికి వచ్చి మళ్ళీ జన్మించేవరకు, చంద్రలోకంలో ఉంటారు. చంద్రమండలం అంటే చంద్రలోకం. చంద్రగోళం కాదు. చంద్రగోళం చుట్టూ జీవులు తిరిగేటటువంటి – పరిభ్రమించేటటువంటి స్పేస్ (రోదసి)ని చంద్రమండలం చంద్రలోకం అని పేర్కొన్నారు. చంద్రగోళం మనకు భౌతికంగా కనబడుతుంది. కాని చంద్రలోకం కనబడదు. అంటే ప్రత్యక్షంగా – భౌతికంగా కనబడేటటువంటి గోళాన్ని ఆశ్రయించిన లోకము మనకు కనబడటం లేదు. ఇక ఆ పైనున్న దివ్యలోకాలు అలాగ కనబడే భౌతికమయిన గోళాన్ని ఆశ్రయించిన లోకాలు కూడా కావు. ఏ గోళాన్నీ అవి ఆశ్రయించలేదు.

స్పేస్ లో జీవులు ఎక్కడికి వెళితే ఈ భూలోక వాసన ఉండదో, ఎక్కడికి వెళితే దివ్యమయినటువంటి ఆనందం,

అనుభూతి కలుగుతుందో – అంతదూరం భూలోకం నుంచి వెళ్ళటమనే సత్యమే అందులో ఉంది. ఇక్కడినుంచి దూరంగా ఉన్న ఆ లోకాలలో అట్టి ఉత్తమస్థితి ఉంది. కాని ఈ భౌతికమయిన, నశ్వరమై పంచభూతాత్మకమైన శరీరంతో, పుట్టినప్పటినుంచి చావుకి దగ్గరగా వెళ్ళటమే! రోజూ అదే పని మనకు. ఆ ఊర్ధ్వలోకాలు ఇట్లాంటివి కావు. భౌతికమయిన అంటే, పాంచభౌతికమయిన శరీరాలున్న లోకం ఈ భూలోకం ఒక్కటే. పాంచభౌతిక దేహం మాత్రం లేక, దేహాత్మ భావన – దేహాభిమానము – దేహలక్షణములు కలిగినటువంటి లోకం ప్రేతలోకం.

భూలోకవాసన అసలే లేకుండా ఆనందము, సుఖము మాత్రము – భూలోకంలో ఏది సుఖమనుకున్నాడో అట్టి సుఖాన్ని మాత్రం అపరిమితంగా – జీవుడు అనుభవిస్తూ, శరీరం లేకుండా ఉండే లోకం స్వర్గలోకం. అక్కడ భూమివలె ఒక గోళము అంటూ ఏమీ లేదు. తల్లితండ్రుల అనుబంధం, నవమాసాలు మోసి బిడ్డను కనటం వంటివేమీ ఉండవు అక్కడ. జీవాత్మ సుఖాన్ని అనుభవిస్తుంది. దానికే స్వర్గమని పేరు. జీవుడు పొందే ఆ అనుభూతికి ఉత్తమ లోకాలని పేరు. ఇలాంటి భూలోకం కలిగిన సౌరమండలాలు (భౌతికమైన శరీరములను, జీవకోటిని మోసేటటువంటి లోకములు) అక్కడక్కడ సకృత్తుగా ఉన్నవి. అట్లాంటి లోకములు మొత్తం ఈ సృష్టిలో వేలకోట్ల కొద్దీ ఉన్నప్పటికీ, అవి లవలేశం మాత్రమే అవుతాయి అనంతమైన ఈ విశ్వంలో.

కాబట్టి ఎంత విశాలమైన సృష్టి ఉందంటే, ఈ జీవకోటి ఏ మూలకూ కనబడటం లేదు. ''ఈ సృష్టిలో జీవులు ఎక్కువై పోయారు. భూమి క్రిక్కిరిసిపోయింది. పుట్టుకలను ఆపేయండి. కనటం మానేయండి'' అని మనం లబోదిబోమని మొత్తుకుంటున్నాం. ఈ సృష్టికి వాస్తవంగా ఈ జీవకోటి భారమే కాదు. అనంత జీవకోటి అని మనం అనుకుంటూ ఉన్నదానికి, ఇంకా శతలక్ష కోటి గుణితమయితే కూడా ఇంకా అది అదృశ్యంగానే ఉంటుంది – అంత విశాలంగా ఉంది ఈ విశ్వం. అనేక లోకాలున్నాయి. భూలోకం మీదనే ఎందుకుండాలి? ఉత్తమకర్మ చేసి ఇంకొక లోకానికి జీవుడు వెళ్ళవచ్చు కదా! ఉత్తమ లోకాలకు వెళ్ళవచ్చు. వెళ్ళక, ఇక్కడ ఉండి తిప్పలు పడుతున్నాం మనం.

ఉత్తమలోకాలలో – ఇంకా పైకి వెళితే విష్ణులోకం, శివలోకం ఉన్నాయని అంటున్నాం కదా. ఈశ్వరతత్త్వం ఎలా ఉంటుందని మనం ఇక్కడ భావన చేస్తున్నామో – బ్రహ్మదేవుడి సన్నిధి ఎలా ఉంటుందని పురాణాలు, వేదాలు మనకు వర్ణించి చెప్పితే మనకు ఏ భావాలు కలిగినవో, విష్ణుతత్త్వం ఎలా ఉంటుందని భావిస్తున్నామో – అటువంటి భావాలనే అక్కడికి వెళ్ళి జీవుడనుభవిస్తున్నాడు.

అక్కడికి వెళితే ఆ భావం, మూడు దశలలో ఉంటుంది. నేను విష్ణు సన్నిధికి వచ్చేశాను అని ఆ జీవుడనుకుంటాడు. అదిగో విష్ణువు కనబడుతున్నాడనుకుంటాడు. అతడికి చర్మచక్షువులు లేవు కాబట్టి, అతడు ఈ కళ్ళతో చూచే లక్షణం కలిగిన ప్రపంచం కాదది. అలా విష్ణువుకు సమీపవర్తిని అయ్యాననుకుంటాడు. సాలోక్యం – సామీప్యం – సమీపంగా వెళ్ళటము. ఆ తరువాత జీవుడికి నేనే విష్ణువును అనిపిస్తుంది. ఏ విష్ణువునైతే ఏ భావంతో ఏ రూపంలో పూజించి భజించాడో, ఊహించుకున్నాడో అట్టి తత్త్వం ఆ జీవుడు పొందుతాడు. తానే విష్ణువుతో సారూప్యం పొందుతాడు. సారూప్యంలో అక్కడ కొంతకాలం ఉంటాడు. తరువాత ఆ జీవుడు సాయుజ్యం పొందుతాడు. తనుండక, విష్ణుతత్త్వంలో సాయుజ్యం పొందుతాడు. కాబట్టి సాలోక్య, సామీప్య, సారూప్య, సాయుజ్యములు అనే నాలుగు స్థితులు లోకముల విషయములో ఉన్నాయి.

అంటే, సగుణంగా వర్ణించబడినట్టి ఉత్తమ లోకములలో ఇవి ఉన్నాయి. బ్రహ్మజ్ఞాని బ్రహ్మైక్యం పొందినప్పుడు ఏ లోకమూ లేదు. అతడక్కడ శరీరాన్ని వదిలిపెడతాడు. మరెక్కడా ఉండడు. భూలోకం నుంచే బ్రహ్మజ్ఞానం చేత బ్రహ్మైక్యం పొందుతాడతడు. ఉత్తమ లోకాలు అతడికవసరమే లేదు. అటువంటి ఉత్తమమయిన అవకాశం కలిగి ఉన్నటువంటిది భూలోకం. అందువల్లనే ఈ మహాత్ములైన మహర్షులందరూ ఇక్కడ పుట్టారు.

మహర్షులు ఇక్కడ ఈ పవిత్ర భారత దేశంలో పుట్టటానికి కారణం ఏమిటంటే; ఈలోకంలో ఇంత అవిద్య, ఇంత అజ్ఞానము, ఇంత భౌతికమయిన – నశ్వరమయిన – రోజురోజూ పాడైపోయేటటువంటి శరీరములు కలిగిన మనకు కూడా, ఇక్కడినుంచీ ఏ లోకానికీ వెళ్ళకుండా, ఏ దేవతలనూ ప్రత్యేకంగా ఆరాధించకుండా తిన్నగా బ్రహ్మైక్యం పొందేందుకు అవకాశం కలిగినటువంటిది ఈ లోకమే అని చెప్పటానికే. అయితే అది వేరే సంగతి. దానికి వేరే మార్గం ఉంది. అదంతా పెద్ద గ్రంథమే అవుతుంది. అలాంటి అవకాశం ఉన్న లోకం మాత్రం ఈ విశ్వంలో ఇదొక్కటేనని గుర్తుంచుకోవాలి.

దేవతలు కూడా జ్ఞానాన్ని అన్వేషించాల్సివస్తే, స్వర్గలోకాన్ని వదిలిపెట్టి భూలోకానికి వచ్చి, ఇక్కడ జ్ఞానాన్ని సంపాదిస్తున్నారు అని చెప్తున్నారు పెద్దలు. దేవతలు భోగంలో ఉంటారే కాని జ్ఞానాన్ని కలిగి ఉండరు. భోగంలో ఉన్నంతసేపూ జ్ఞానం కలగదు. భోగం ఆనందాన్నిస్తుంది. కాబట్టి అది వదిలిపెట్టబుద్ధి కాదు. మనకు భోగం అనేది దుఃఖానికి, దుఃఖానికి మధ్యలో వచ్చేటటువంటి ఒక చిన్న విరామం.

దుఃఖమయమయిన జీవితంలో ఒక చిన్న ఆటవిడుపే సుఖం మనకు. ఎప్పుడూ ఆ భోగంలోనే ఉండడం చేత అందులోంచి దేవతలు విముక్తిని అడగరు. కాని మనుష్యజీవితం అలా కాదు. ఈ దుఃఖమయమైనటువంటి జీవితంలో, నిత్యమూ మృత్యువు దగ్గర పడేటటువంటి ఈ జీవనంలో, ఎక్కడైనా ఆనందమంటూ ఉంటే అది క్షణికంగానే ఉంది. ''ఇక్కడి జీవితం దుర్భరంగా ఉంది. ఇలా నేను ఉండలేను. ఏది ముక్తి! ఎలాగైనా శాశ్వతంగా ఇక్కడికి రాకుండాపోతే బావుండును'' అనే కోరిక ఒకనాటికి మనిషికి కలుగుతుంది. అట్టివాడు ముక్తి పొందుతాడు.

దేవలోకంలో గాని, గంధర్వలోకంలో గాని, అప్సరసలకు గాని, విద్యాధరులకు గాని ఇలాంటి మోక్షేచ్ఛ ఉండదు. వాళ్ళు సగుణభక్తి యందుంటారు. అంటే దేవతలు, గంధర్వులు, అప్సరసలు, విద్యాధరులు, కిన్నరులు, కింపురుషులు మొదలైన అనేకమంది ఉత్తమజీవులు అందరూ కూడా సగుణోపాసనలో ఉంటారు. తాము ఆనందకరమైన ఒకానొక దివ్యశరీరాన్ని ధరించి, రత్నమాల్యాభూషణాలన్నీ ధరించి విమానాల్లో తిరుగుతూ, సంగీతం వింటూ, నాట్యం చేసుకుంటూ ఈశ్వరపూజ చేస్తారు. ఇవన్నీ తమకు ఈశ్వరుడే ఇచ్చాడనే భావనతో ఈ జీవులు ఈశ్వరుడి యెడల కృతజ్ఞతతో, ప్రేమతో ఉంటారు గాని, మోక్షం అడగరు. అక్కడ వాళ్ళకు మోక్షేచ్ఛ ఉండదు. భోగేచ్ఛ ఉన్నప్పుడు మోక్షేచ్ఛ రాదు. ద్వంద్వస్థితి లేని ఒకానొకస్థితి అందులో రాదు.

ఇక కేవలం దుఃఖంలో ఉండే అథోలోకాలున్నాయి. వాళ్ళకూ మోక్షేచ్ఛ రాదు. దుఃఖమే వాళ్ళకలవాటయిపోయింది. కేవలం దుఃఖం మాత్రమే వాళ్ళకు నిరంతరమూ ఉండటం చేత, అసలు ఆనందం అనే ఒక విషయం ఉందని వాళ్ళకు తెలియదు. దుఃఖాన్ని, అప్పుడప్పుడు సుఖాన్ని అనుభవిస్తూ ఉండేటటువంటి మానవులకు మాత్రమే ఆనందం యొక్క స్వరూపం తెలుసు. దాని రుచి తెలుసు. ఈ ద్వంద్వస్థితికి అతీతమయినటువంటి శాంతస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోగలడు మనిషి. కాబట్టే ఇతడికి మోక్షేచ్ఛ కలుగుతుంది. ఆనందానుభవం ఎప్పుడూ లేనటువంటి నీచలోకములందు ఉండేటటువంటి, సర్వకాల దుఃఖితులైనటువంటి జీవులకు ఆనందస్వరూపం తెలియకపోవటం చేత; ఆ ఇచ్ఛ కలగదు. వాళ్ళకు (ఆ అథోలోక జీవులకు) ఆ దుఃఖాలన్నీ పోయాక, కర్మ నశించిన తరువాత భూలోకంలో జన్మిస్తారు. కాబట్టి ఈ లోకములను దాటి భూమిమీదకు వచ్చిన తరువాత, భూలోకంలో మనుషులై పుట్టిన తరువాతనే, సుఖ దుఃఖాలు రెండూ ఉన్నవి అనే విషయం మొదటిసారి తెలుస్తుంది. అంతకుముందు దుఃఖం మాత్రమే చూసిన జీవుడు, అప్పుడు సుఖం లోంచి దుఃఖం లోకి ఎప్పుడూ వెళ్ళకూడదనీ – దుఃఖంలోంచి సుఖం లోకి రావాలని కొంతకాలం అనుకుంటాడు. ఎన్నిమార్లు వచ్చినా, మళ్ళీ దుఃఖం తప్పటం లేదు కదా. ఈ విషయాన్ని తరువాత మళ్ళీ కొన్ని జన్మలకు తెలుసుకుంటాడు. రెండూ లేని స్థితి ఉత్తమమని తరువాత తెలుసుకుంటాడు. దాన్నే కోరుకుంటాడు. దాన్నే పొందుతాడు కూడా.

ఈ కారణం చేత మానవజన్మ జీవుడికి అత్యుత్తమమైన జన్మ అని పెద్దలు చెప్తారు. మానవజన్మలోనే ముక్తియందు కోరిక కలుగుతుంది. మరెందులోనూ ఎవరికీ కలుగదు. ఆఖరుకు దేవతలకు కూడా కలుగదు. వాళ్ళకు దుఃఖాన్ని రుచి చూసేటటువంటి గతి పట్టినప్పుడు మాత్రమే మోక్షేచ్ఛ కలుగుతుంది. అదీ శాపగ్రస్తులై, మనుషులై భూమిమీద పడి (పుట్టి) నప్పుడు మాత్రమే జ్ఞానేచ్ఛ కలుగుతుంది.

దేవతలు మనుషుల చరిత్ర అంతా తెలిసినవాళ్ళు కదా! మరి మనుషులకే ఇది తెలిస్తే, దేవతలకు తెలియదా అంటే; వాళ్ళు పుణ్యకర్మ ఫలాన్ని అనుభవించేటటువంటి ఆనందస్వరూపులై ఉండటం చేత, వాళ్ళకు మనుషుల సుఖ దుఃఖాలకు హేతువేదో తెలుసునే కాని, ఏ కర్మ చేస్తుండాలో తెలుసునే కాని, మోక్షమనేది – జ్ఞానమనేది – ఒక వస్తువు ఉన్నదనే విషయంతో కూడిన బుద్ధి ఉంటుందే గాని, దానిలో ఇచ్ఛ మాత్రం ఉండదు. శాశ్వతమైన ముక్తి నాకు కావాలి అనే భావన దేవతలకు రాదు.

మనుషులు వెళ్ళి తమకు బోధ చెయ్యమని అడిగితే, బోధ చెయ్యటానికి వరుణాది దేవతలు సర్వసమర్థులే. వాళ్ళకు తత్త్వం తెలుసు కాబట్టి. వరుణ దేవుడి కొడుకు అయిన భృగువు, ఆత్మబోధ అడిగాడు – ''నాకేది సత్యమో తెలుసుకోవాలని ఉంది తండ్రీ!'' అని. ఆ వృత్తాంతమంతా 'భృగువల్లి'లో ఉంది.

మనుషులు దేవతలను కొన్ని ముఖ్యమైన కారణాల చేత, ధర్మాల చేత యజించాలి. మన సౌఖ్యం కోసం అంటే ఇక్కడ ఉండేటటువంటి మన పిల్లాపాపలు సుఖంగా ఉండాలి. ఆయురారోగ్యాలతో ఉండాలనే కోరికలతో యజించటం ఒకటి. అంటే, దుఃఖాన్ని రుచి చూడకూడదు, సుఖమే కావాలనే కోరికతో దేవతలను ఆరాధించాలి. అయితే, దేవతలలో శాశ్వతమైనటువంటి దేవతలైన మిత్రావరుణులు వంటి అందరూ కూడా, ఆత్మజ్ఞాన సందేశం ఇవ్వటానికి కూడా అర్హులే. వాళ్ళు జ్ఞానులే. జ్ఞానులై, నిత్యులై వాళ్ళు ఈశ్వరుడి యొక్క ప్రతిబింబాలుగా ఉద్యోగాలు చేస్తున్నారని అర్థం చేసుకోవాలి.

-శివానంద సువిధ ఫౌండేషన్ సౌజన్యంతో

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

వ్యాఖ్యాత : కె.వి.రాఘవాచార్యులు

## 431. త్రిపుర స్త్రీ మానభంగాయ నమః

-తారకాసురుని కుమారులు ముగ్గురు. వారు 1. కమలాక్షుడు 2. విద్యున్మాలి 3. తారకాక్షుడు అనువారు. ఈ ముగ్గురు సోదరులు శివుని గూర్చి తీవ్రమైన తపస్సు చేసి ఇనుముతో, బంగారముతో, వెండితో నిర్మించబడిన మూడు జంగమ పట్టణములను శివుని అనుగ్రహము వలన పొందినారు. జంగమ పట్టణములతో తారకాసురుని పుత్రులు తిరుగుచు లోకములోని ప్రజలు నివసించుచున్న పట్టణముల పైబడి నాశనము చేయుచుండిరి.

అప్పుడు విష్ణువు బుద్ధుడుగా అవతరించి నారదుని తన శిష్యునిగా చేసుకుని ఈ త్రిపురాసురులకు, వారి ఆశ్రితులకు శివుని యందలి భక్తి లేకుండుటకు తగిన విషయములు బోధించెను. అంత వీరు, వీరి ఆశ్రితులు అందరూ శివద్వేషులైరి. అందులకు శివుడు ఆగ్రహించి వీరితో యుద్ధము చేయదలంచెను. ఈ సమయమున బుద్ధ దేవుడు తన మాయా శక్తిచేత త్రిపురాసురుల భార్యలకు మానభంగము కల్పింపగా, వారి పాతివ్రత్యమునకు కళంకమేర్పడింది. అందుచేత శివుడు త్రిపురాసురులతో యుద్ధము చేసి సంహరింప వీలు కలిగింది. శివుడు త్రిపురాసురులను వధించిన తరువాత వీరు శివుని ప్రమథ గణములలో చేరి శివుని సేవించుచుండిరి.

త్రిపురాసురుల భార్యలు తమ సుమంగళీత్వమును కాపాడుకొనుటకు, భర్తలకు ఆపదలు రాకుండుట కొరకు పరమాత్మునకు – శ్రీమన్నారాయణునకు – ప్రదక్షిణ ప్రణామాదులు చేయుటకు ఆయా దివ్యక్షేత్రములకు పోవుచుండిరి. ఒకచోట సాక్షాత్కరించిన బుద్ధదేవుని ఆరాధింప సమ కట్టినారు. ఈ బుద్ధుడు (గౌతమ బుద్ధుడు కాడు) సాక్షాత్ మన్మథ మన్మథుడైనవాడు నారాయణుడే కదా! అపుడు బుద్ధుడు దిగంబరుడై యుండెను. త్రిపురాసురుల భార్యలు ముగ్ధమోహన రూపము గల బుద్ధుని చూచి, కర్తవ్యమును మరచి, హెచ్చిన తమకముతో నగ్నముగా ఉన్న ఆ బుద్ధదేవుని బిగియార కౌగలించుకొనిరి. ఇది బుద్ధుని యందు వికారము కలిగించలేదు. కాని త్రిపుర స్త్రీల పక్షమున ఇది (బుద్ధుని కౌగలించుట) మానసిక వ్యభిచారమగుటచే – పరపురుష కామ జనిత శరీర స్పర్శచే వారికి మానభంగము వాటిల్లెను. దీనిచే వారి భర్తలగు త్రిపురాసురులు శివునిచే సంహరించబడిరి.


త్రిపురాసుర సంహారము, త్రిపుర స్త్రీల మానభంగము కృతయుగములోని సంఘటనలు, గౌతమ బుద్ధుడు కలియుగమున జన్మించి, జీవించి, అహింసా ప్రధానమైన బౌద్ధమతమును ఏర్పరచినాడు.

వైష్ణవుల దశావతారములలో బుద్ధావతారము లేదు. కృష్ణదేవరాయల ఆముక్తమాల్యదలో దశావతార వర్ణన పరిశీలించండి (ఆముక్త 4-17-7-31 పద్యములు) అల్లసాని పెద్దన రచించిన మను చరిత్రలోని దశావతార వర్ణన పరిశీలించండి (మను,3-107 – 116 పద్యములు).

త్రిపురాసురుల భార్యలకు మానభంగము కలిగించిన బుద్ధదేవుని అవతారమెత్తిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

పూర్వకాలమున భర్త మృతి అతని భార్య పాతివ్రత్యముపై ఆధారపడి యున్నదని విశ్వాసము కలదు. ఈ విశ్వాసము ఆధారముగా మళయాళ భాషలో ఛెమ్మీన్ అను చలనచిత్రము వచ్చింది. జలంధరుని చంపుటకు, అతనిని శక్తిహీనుని చేయుటకు విష్ణువు జలంధరుని రూపమును ధరించి జలంధరుని భార్య బృంద పాతివ్రత్యము కోల్పోవునట్లు చేయగా శివుడు జలంధరుని సంహరించినాడు. అహో! పాతివ్రత్య మహిమా!

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**





అన్ని నామాలూ నీవే అయిన
ఓ వేంకటేశా! నీకు నమస్కారము

## 432. నిరాభాసాయ నమః

భ్రాంతి, జ్ఞానము లేనివాడు విష్ణువు. నిరాభాసుడైన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 433. నిరామయాయ నమః

వ్యాధి రహితుడు.

నిరామయుడైన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 434. జగన్మోహక ధర్మిణే నమః

బుద్ధావతారమున జగత్తును మోహింపచేయు ధర్మములు బోధించినవాడు. అసురులను మోహింపచేసి ధర్మభ్రష్టులను చేసినవాడు బుద్ధుడైన విష్ణువు (గౌతమబుద్ధుడు కాడు). వేంకటేశ్వరస్వామి విగ్రహము జగన్మోహనమూర్తి. ఒక సౌందర్యలహరి.

జగన్మోహన ధర్మి అయిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 435. దిగ్వస్త్రాయ నమః

దిక్కులే వస్త్రముగా కలిగినవాడు దిగంబరుడగు కృతయుగము నందలి బుద్ధుడు. కలియుగము నందలి గౌతమ బుద్ధుడు కాడు. నగ్నస్వరూపము గలవాడు.

దిక్కులే వస్త్రముగా గల్గిన బుద్ధునిగా అవతరించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

దిగంబరాయ నమః (82) అను నామము శివ 108 నామములలో కలదు. దిగంబరత్వేన నివేదితం వసు అని కాళిదాసుని ప్రయోగము.

## 436. దిక్పతీశ్వరాయ నమః

దిక్పాలకులకు అధిపతి. వారిని శాసించువాడు.

దిక్పతీశ్వరుడైన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 437. కల్కినే నమః

కలియుగమున చతుర్ధ భాగమున కల్కిగా అవతరించు విష్ణుదేవుడు.

ప్రస్తుతం కలియుగమున ప్రథమ పాదము జరుగుచున్నది. క్రీ.శ. 2018-2019 సంవత్సరమున కలియుగాబ్దములలో 5119 సంవత్సరము జరుగుచున్నది. కలియుగ ప్రమాణము 4,32,000 సంవత్సరాలు. కల్కి విష్ణువు యొక్క దశావతారములలో కడపటి అవతారము. కలియుగాంతమున (చతుర్థ భాగమున) శంబళ గ్రామమున విష్ణుని అంశమున జన్మించిన బ్రాహ్మణోత్తమునకు విష్ణుదేవుడు కల్క్యాత్మకుడై జన్మించును. కల్కి సంస్మరణ మాత్రమున వేద శాస్త్రములను అధిగమించి భూమియందలి అధర్మవర్తనులను, మ్లేచ్ఛులను అందరినీ నాశనము చేసి ధర్మము నిలుపును. అంత భూమిపై కృత యుగము ఏర్పడును అని పురాణములందు చెప్పబడి యున్నది.

కల్కిగ అవతరించబోవు విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.




**గత సంచిక తరువాయి**

మహారాజా! రాముడు మహాపరాక్రమశాలి. విరాధుడు, కబంధుడు, ఖరాదులను హతమార్చాడు. సీతాదేవి జాడ తెల్సుకున్నాడు. సుగ్రీవునితో వచ్చాడు. ఆ వానర భల్లూకాలు అంసఖ్యాకంగా ఉన్నారు. అందరూ మహాకాయులు. పర్వతాకారులు. భూమి కనపడకుండా నిలిచారు. దేవదానవులకి ఎలా సంధి కుదరదో అలా వానర రాక్షసులకి సంధి పొసగదు. లంకపై దాడి చేయకముందే సీతాదేవిని రాముడికి ఇస్తావా, యుద్ధం చేస్తావా నిర్ణయించుకో. ఆలస్యం చేయకు''.

విన్నాడు రావణుడు. కోపం నసాళానికి అంటింది. కన్నులు ఎర్రబడ్డాయి. శుకుణ్ణి దహించేట్లు ఉన్నాయి. ఆ చూపుతో అంటున్నాడు.

## తెలిసిన మూర్ఖుడు

దేవ దానవ గంధర్వులు ఒక్కటై వచ్చినా – సమస్త లోకాలు భయపెట్టినా, ఏది ఏమైనా సీతను మాత్రం ఇవ్వను. వసంత ఋతువులో పూలు బాగా పూస్తాయి. తుమ్మెదలు బాగా మూగుతాయి. అలా తూణీరాల్లోంచి నా బాణాలు రామునిపై పడతాయి. నా కార్ముకం నుండి వెలువడే బాణాలు



కొరువుల్లా ఉంటాయి. రాముణ్ణి నిగ్రహిస్తాయి. ఉదయించే సూర్యుడు గ్రహనక్షత్రాల కాంతిని రూపుమాపుతాడు. అలా నా సేనాబలంతో వానరబలాన్ని, రాముణ్ణి రూపుమాపుతాను. సముద్రం అంత వేగం – వాయువు అంత గమనం – నాకు ఉన్నట్లు తెలియదు రామునికి. అందుకే నాతో పోరాడాలని ఉన్నాడు. నా యుద్ధ నైపుణ్యం రాముడెప్పుడూ చూడలేదు. నా పరాక్రమం చూడలేదు.

శత్రుసేన ఒక రంగస్థలం. నా ధనుస్సు ఒక వీణ. నా బాణాలు దాని దండం. ధనుష్టంకారాలు వీణా స్వర లహరులు.

సైనికుల ఆర్తనాదాలు – స్వరానుగుణంగా సాగే గీతాలాపనలు. అలా యుద్ధం నాకో వినోదం. అలా వర్ణించాడు వాల్మీకి.

## శుక సారణులు

వెంటనే శుక సారణులను పిలిపించాడు. వారతని మంత్రులు. అంటున్నాడు.

సముద్ర తరణం దుష్కరణం. సేతుబంధనం గావించాడు రాముడు. అది కనీవినీ ఎరుగని అద్భుతకార్యం. మీరుభయులూ వెళ్లండి. వానర సేన సంఖ్యాబలమెంత? వారి శక్తి ఎంత? సామర్థ్యమెంత? తెల్సుకోండి. ఎవ్వరూ గుర్తుపట్టరాదు. సైన్యంలో ప్రవేశించండి. వానర ముఖ్యులెవరు? రాముని మంత్రులెవరు? ప్రధానులెవరు? సుగ్రీవుని మంత్రులెవరు? వారిలో శూరులెవరు తెల్సుకోండి. సేతువు ఎలా కట్టారు? ఏయే దేశాల నుంచి వానరులు వచ్చారు? వారి ఆయుధాలేమిటి? రామలక్ష్మణుల పరాక్రమమెంత? వానర సేనానాయకుడెవరు? – ఈ సంగతులన్నీ తెల్సుకోండి. వెంటనే తిరిగి వచ్చేయండి – అది రావణుని ఆదేశం.

విన్నారు శుక సారణులు. కపి రూపం ధరించారు. వెళ్లారు. వానరసేనలో కలిసారు. అది అపారమైన సేనవాహిని. లెక్కించ అలవికానిది. కొందరు పర్వతశిఖరాల్లో ఉన్నారు. కొండ చరియల్లో ఉన్నారు. సముద్రతీరాన ఉన్నారు. వనాల్లో ఉన్నారు. ఉద్యానవనాల్లో ఉన్నారు. సముద్రం దాటుతున్నారు. దాటినవారున్నారు. ఇవతలి తీరం చేరుతున్నారు. అందరూ పర్వతాకారులు. బలశాలురు. భయంకర నినాదాలు చేస్తున్నారు. అది ఒక సేనా సముద్రం. చూసారు శుకసారణులు. నివ్వెరపోయారు.

ఎంతో ప్రచ్ఛన్నంగా సంచరిస్తున్నారు శుకసారణులు. గుర్తించాడు విభీషణుడు. బంధించాడు. రాముని కడకు తీసుకెళ్లాడు. రామా! శత్రు సంహారా! ఈ ఇద్దరూ రావణుని అమాత్యులు. శుకసారణులు. గూఢచారుల్లా వచ్చారు అన్నాడు.

ఆ ఇద్దరూ చూసారు రాముణ్ణి. భయపడ్డారు. బతుకు మీద ఆశ పోయింది. దిగులు పడ్డారు. అంజలి ఘటించారు. ''రఘునందనా! దయానిధీ, మమ్మల్ని రావణుడు పంపాడు. మీ బలాలు తెల్సుకుని రమ్మన్నాడు.

విన్నాడు రాముడు. సర్వభూత హితరతుడు దాశరథి. నవ్వాడు. అంటున్నాడు. మా బలాల్ని చూసారా? బాగా పరీక్షించారా? మీకు అప్పగించిన పని పూర్తి చేసారా? అయితే ఇక వెళ్లొచ్చు. అలా కాదు ఇంకా చూడాల్సింది ఉంది అంటే – వెళ్లండి. చూడండి. తృప్తి తీరాక వెళ్లొచ్చు. ఈ విభీషణుడు మీ దగ్గర ఉంటాడు. అన్ని వివరాలు చెబుతాడు. భయపడవద్దు.



ప్రాణభయం లేదు. నిర్భయంగా తిరగండి. చూడండి. నిరాయుధులు మీరు. దూతలు మీరు. దూతలను వధించరాదు.

విభీషణా! ఈ ఇద్దరూ మన సైన్యం ఆనుపానులు తెలుసుకోవాలని వచ్చారుగా. గూఢచారులే. మనల్ని వేడుకుంటున్నారు, వీళ్లని విడిచిపెట్టు అన్నాడు రాముడు. శుకసారణులతో చెబుతున్నాడు.

మీ ఏలికకు నా మాటగా చెప్పండి. ''రావణా! నీ బలమెంతో – నా భార్యని అపహరించావో – ఆ బలాన్ని ఇపుడు చూపించు. నీ సేనల్ని నీ బంధువుల్ని సమకూర్చుకో. యుద్ధానికి సిద్ధపడు. నేను ఉదయం నీ లంకా పట్టణం బహిర్ ద్వారాలను, ప్రాకారాలను బద్దలుకొడతాను. నీ సేనల్ని ధ్వంసం చేస్తాను. చూసుకో. దేవేంద్రుడు వజ్రాయుధాన్ని దానవులపై ప్రయోగించాడు. అలా నా బాణాలు నీ మీద ప్రయోగిస్తాను. నా కోపానికి గురి కాబోతున్నావు''.

విన్నారు శుకసారణులు. ధర్మవత్సలుడు రాఘవునికి జయం పలికారు. తిన్నగా రావణుణ్ణి చేరారు. చెబుతున్నారు. ప్రభూ! మమ్మల్ని గుర్తించాడు విభీషణుడు. బంధించాడు. వధార్హులన్నాడు. కాని ధర్మాత్ముడు రాముడు దూతను చంపరాదన్నాడు. మమ్మల్ని విడిచిపెట్టాడు. రామలక్ష్మణ సుగ్రీవ విభీషణులు నలుగురూ పురుష శ్రేష్ఠులు. అస్త్రవేత్తలు. దృఢమైత్రి వారిది. వాళ్లకి విజయం తథ్యం. సైన్య సహాయం అక్కర్లేదు. ఆ నలుగురూ చాలు. మన లంకా పట్టణ బహిర్ ద్వారాలు ప్రాకారాలు పెళ్లగిస్తారు.

రాజా! మేం రాముని ఆకారం చూసాం. ఆయుధాలు చూసాం. లక్ష్మణ సుగ్రీవ విభీషణులు అక్కర్లేదు. రాముడొక్కడే చాలు. లంకానగరాన్ని రూపుమాపుతాడు. రామలక్ష్మణ సుగ్రీవులు ముగ్గురూ వానరసేన రక్షకులు. ఆ సేన దుర్భేద్యం. పది యోజనాల వెడల్పుతో ఉంది సేతువు. కండ్లారా చూసాం. ఆ వారధి నుంచి సేన దాటుతోంది. చాలాభాగం వచ్చేసింది. ఇంకా దాటుతున్నారు. ఆ సేన అంతు కనబడలేదు. రాజా! వానరవీరులు మహాబలవంతులు. యుద్ధోత్సాహులు. ఏ

క్షణంలోనైనా లంకపై దాడి చేయవచ్చు. రాజా! వారితో యుద్ధం వద్దు. నీవు కోపం వదిలెయ్. శాంతించు. సీతాదేవిని రామునికి అప్పగించు.

## వానర సేనలు

శుకసారణులు నిర్భయంగా చెప్పారు. మందలించాడు రాక్షసరాజు. అందుకు కారణం – శత్రువుని తన ముందు స్తుతించడమే. అంటున్నాడు రావణుడు – దేవతలు గంధర్వులు దానవులు ఒక్కుమ్మడిగా వచ్చినా, లోకం భయపెట్టినా సీతను మాత్రం ఇవ్వను. సారణా! నీవు సౌమ్యుడవు. వానరులు కొట్టారు. అందుకే భయపడుతున్నావు. సీతని ఇవ్వమంటున్నావు. ఏ శత్రువు నన్ను జయించగలడో చెప్పు.

శుకసారణుల్ని వెంట ఉంచుకున్నాడు. తన ప్రాసాదం ఎక్కాడు. వానరసేనల్ని చూస్తున్నాడు. సముద్రం పర్వతం వనాలపై దృష్టి సారించాడు. ఆ ప్రదేశాలన్నీ వానర వ్యాప్తమై ఉన్నాయి. లెక్కపెట్టడం అసాధ్యంగా తోచిందతనికి.

సారణా! వానర ప్రముఖుల్లో ముఖ్యులెవరు? మహాశూరులెవరు? మహాబలశాలురెవ్వరు? ఉత్సాహంతో పోరాటానికి ముందుకు వచ్చేవారెవరు? ఉన్నది ఉన్నట్లు చెప్పు అన్నాడు.

రాజా! రణోత్సాహంతో గర్జిస్తున్నాడు అదుగో అతడే నీలుడు. వానరసేనా నాయకుడు. మహాప్రాకారాలు సింహద్వారాలు పర్వతాలు వనాలు వాడి గర్జనకి కంపిస్తాయి. వాడే సేనాగ్రభాగాన నిలిచి ఉన్నాడు.

మహాపరాక్రమవంతుడు అంగదుడు. చేతులు పైకెత్తాడు. లంకాభిముఖుడై ఉన్నాడు. కోపంతో విజృంభిస్తున్నాడు. వాడు పర్వత సమున్నతుడు. పద్మ కింజిల్క వర్ణంలో ఉన్నాడు. రోషంతో తోకను పదే పదే నేలకేసి కొడుతున్నాడు. ఆ తోక తాకిడికి శబ్దానికి దశ దిశలూ ప్రతిధ్వనిస్తున్నాయి. ఆ అంగదుడే యువరాజుగా అభిషిక్తుడైనాడు. అతడే వాలి కొడుకు. పరాక్రమంలో వాలి అంతటివాడు. దేవేంద్రుని పని నెరవేర్చిన వరుణునిలా – రామ కార్య సిద్ధుడై ఉన్నాడు.

అదుగో అతడే జనకాత్మజని చూసాడు. రామహితైషి. హనుమంతుడు. ఆ సేనలు రావడానికి అతడే కారకుడు. ఆ వీర్యవంతుడు, దర్జయుండు నిన్ను దెబ్బ తీయాలని ఉన్నాడు.

అంగదుని వెనుక అదుగో నలుడు. వాడే సేతు నిర్మాణ కర్త. వాడి సేనలోని వీరులు తీవ్ర స్వభావులు. భయంకరులు. చండ పరాక్రములు. ఈ నలుడు ఒక్కడే లంకా పట్టణాన్ని నాశనం చేస్తానంటున్నాడు.

వెండికొండలా మెరుస్తున్నాడు చూడు. వాడే శ్వేతుడు.



వాడు యుద్ధ చపలుడు. భయంకర పరాక్రముడు. సేనల్ని విభజిస్తున్నాడు చూడు. యోధుల్ని ఉత్సాహపరుస్తున్నాడు చూడు.

సుగ్రీవుని సమీపంలో ఉన్నాడు చూడు. వాడే కుముదుడు. శత్రుభయంకరుడు. వాడి తోక చూడు. ఆ వెంట్రుకలు చూడు. పొడుగ్గా ఎర్రగా పచ్చగా తెల్లగా ఉన్నాయి.

రాజా! అడుగో రంభుడు. సింహ సమాన పరాక్రముడు. కపిల వర్ణంలో దీర్ఘ నేత్రాలతో ఉన్నాడు. కన్నులతోనే లంకని కాల్చేట్లున్నాడు. వాడి సేనలోని వాళ్లు శూరులు. క్రూరులు. చండ పరాక్రములు.

అడుగో వాడు శరభుడు. వానర యూథపతి. వాడి చెవులు చూడు నిక్కపొడుచుకుని ఉన్నాయి. మాటి మాటికీ ఆవలిస్తున్నాడు. వాడికి చావంటే భయం లేదు. యుద్ధావేశంలో ఊగిపోతున్నాడు.

అడుగో పనసుడు. పర్వతాకారుడు. వాడి సింహనాదం భేరి ధ్వనిని మించింది. దేవతల మధ్య దేవేంద్రునిలా కూర్చున్నాడు చూడు.

అడుగో వినతుడు. గొప్ప సేనా సమూహంతో శోభిస్తున్నాడు. అడుగో క్రోధనుడు. నిన్ను యుద్ధానికి పిలుస్తున్నట్లు ఉన్నాడు. అడుగో గవయుడు. యుద్ధోత్సాహి. తన ఎర్రటి దేహాన్ని పెంచుతున్నాడు. వాడు పరమ తేజోవంతుడు. కోపిష్ఠి. నీమీద పడాలని ఉన్నాడు.

రాజా! ఆ వానర వీరులందరూ శూరులు. బలవంతులు. కామరూపులు. జయించ వీలుకానివారు. ఒక్కొక్కరు కొన్ని లక్షల కోట్ల సేనతో వచ్చారు.

అడుగో హరుడు. వాడి యుద్ధరీతులు శత్రు భయంకరాలు. వాడి తోక చూడు. పొడవైన వెంట్రుకలు – ఎర్రగా తెల్లగా పసుపురంగులో ఉన్నాయి. తోక పైకెత్తితే సూర్యకిరణాలు నేలమీదికి పడుతున్నట్లున్నాయి. వాడొక యూథపతి. వాడి సైనికుల్ని చూడు. వందల చెట్లు పట్టుకున్నారు. లంకా పట్టణాన్ని ఎక్కడానికి వస్తున్నారు.

అరుగో భల్లూక వీరులు. నీలమేఘంలా కాటుకకొండలా ఉన్నారు. వాళ్లని లెక్కపెట్టలేం. మహాసముద్రంలా ఉందా సేన. వాళ్లు పరమ భయంకరులు. అడుగో ధూమ్రుడు. వాడి రూపం చూడు. ఎంత భయంకరంగా ఉందో. వాడొక భల్లూక నాయకుడు. వాడి పక్కన పర్వతాకారుడున్నాడు చూడు, వాడు ధూమ్రుని తమ్ముడు. రూపంలో అన్నని పోలి ఉన్నాడు. పరాక్రమంలో అన్నకంటే అధికుడు.

అడుగో వాడే జాంబవంతుడు. గొప్ప నాయకుడు. మహాపరాక్రమవంతుడు. యుద్ధంలో వాణ్ణి ఎదిరించలేం. దేవాసుర యుద్ధంలో దేవతలకి సాయపడ్డాడు. ఇంద్రుని చేత ఎన్నో వరాలు పొందాడు. భల్లూక వీరులు రాక్షసుల్లాంటి వారు. పిశాచాల్లాంటి వారు. అగ్నిహోత్రునితో సమానులు. తేజోవంతులు. పెద్ద పెద్ద నల్లని రోమాలున్నవారు. పర్వతాలెక్కారు. వాళ్లని తోస్తున్నారు. వాళ్లకి చావంటే భయంలేదు.

రాజా! అడుగో ఎగురుతున్నవాడే దంభుడు. మహాబలసంపన్నుడు. వానర సేన నాయకుల్లో ముఖ్యుడు. వాడు దేవేంద్రుని మెప్పించాడు. అడుగో సన్నాదుడు. వాడు వానరుల పితామహుడు. వాని శరీరం చూడు. ఒక యోజనం ఎత్తు ఉంది. ఎత్తైన పర్వతం వాడి చేతికి అందుతుంది. నాలుగు కాళ్ల జంతువుల్లో ఇంత పెద్ద శరీరం దేనికీ లేదు. వాడు బహుముఖ ప్రజ్ఞాశాలి. దేవేంద్రునితో యుద్ధం చేసాడు. ఓడిపోలేదు. వాడు అపరాజితుడు. దేవేంద్ర సముడు.

అడుగో క్రథనుడు. మహా యుద్ధాసక్తుడు. అపజయం ఎరుగనివాడు. తన సేనతో వస్తున్నాడు. నిన్ను, నీ లంకా పట్టణాన్ని నాశనం చేస్తాడట. అడుగో ప్రమథి. మహావీరుడు. శంబసాదనుడు ఒక రాక్షసుడు, ఏనుగు రూపంలో తిరుగుతున్నాడు. మునులను బాధించేవాడు. ఆ రాక్షసుణ్ణి కేసరి అనే వానరుడు చంపాడు. అప్పటినుండి ఏనుగులకి, వానరులకి వైరం. ఈ ప్రమాథి కనిపించే ఏనుగుల్ని చంపేసేవాడు. పర్వతాల్ని ఎత్తేవాడు. వాటితో ఏనుగుల్ని చావమోదేవాడు. చెట్లతో కొట్టి చంపేవాడు. వాడి సైనికులు మహా బలవంతులు. వాళ్లు నడుస్తుంటే దుమ్మురేగిపోతోంది చూడు. ఆ సేనలో ఒక మేఘంలా ఉన్నాడు ప్రమథి. తానొక్కడే లంకని ధ్వంసం చేస్తానంటున్నాడు.

అడుగో గవాక్షుడు. వాడు గోలాంగులకు అధిపతి. వారి సైనికులు తెల్లటి ముఖాలతో ఉన్నారు చూడు. అడుగో కేసరి. వాడి సేనని చూడు. కపిల ముఖాలు, శ్వేతముఖాలు, తామ్రముఖాలు, పింగళముఖాలు. సింహంలా నాలుగు కోరలున్నవాళ్లు. వారు దుర్జయులు. అగ్నిజ్వాలల్లా ఉంటారు. దృఢకాయులు. లంకను నుగ్గు నుగ్గు చేస్తామంటున్నారు.

అడుగో శతబలి. వానర నాయకుడు. మహావీరుడు. ప్రతిభావంతుడు. సూర్యోపాసకుడు. లంకను భస్మం చేస్తానంటున్నాడు. రాముని కోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధపడ్డాడు.

గజుడు, గవాక్షుడు, గవయుడు, నలుడు, నీలుడు ఒక్కొక్కరు పది కోట్ల వానర యోధుల్ని తెచ్చారు. ఇంకా ఎందరో వీరులున్నారు. మహాపర్వతాకారులు. కొండల్ని క్షణాల్లో ధ్వంసం చేయగలరు. వాటిని దశ దిశల్లోకి విసిరి వేయగల సమర్థులు.

**(సశేషం)**

ధారావాహికం



# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా|| విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

## భవిష్యోత్తర పురాణాంతర్గతం

**గత సంచిక తరువాయి**

కావున నీవిప్పుడు శ్రీహరికి అత్యంత ప్రీతిపాత్రుడు, ఆంతరంగికుడు అయిన ఆదిశేషుని ప్రసన్నం చేసుకో. నీవనవసరంగా ఆ మహాత్ముని యెడ అపరాధం చేశావు' అని ఈ విధంగా దేవతలు వాయుదేవుని హితం కోరి ప్రేమతో అతనికి హితాన్ని బోధించారు.

అంతట వాయుదేవుడు గర్వమును వీడి శేషుని ఇలా స్తుతించాడు- 'ప్రభూ! నా దుర్మార్గాన్ని క్షమించు. నేను అజ్ఞానంతో అపరాధం చేశాను. సాక్షాత్తు భగవంతుడు నీపై అధివసిస్తాడు. మహాత్మా! అనవసరంగా నేను మూర్ఖంగా నీ విషయంలో అపచారం చేశాను' అని ఆదిశేషుని వాయుదేవుడు ప్రసన్నుని చేసుకొన్నాడు.

పరస్పరం వారిద్దరిమధ్య వైరం తొలగుటవలన శేషుడు వాయుదేవుని యెడల ప్రసన్నుడయ్యాడు. ఈ విధంగా శేషుని అంశతో పుట్టిన ఈ పర్వతాన్ని శేషునిచేత చుట్టబడిన దానిని శ్రీహరి తాను నివసించుట కొరకై వాయుదేవుని మిషచే ఇక్కడకు తెప్పించుకున్నాడు. మహారాజా! శేషుని నిమిత్తంగా ఈ పర్వతానికి శేషాచలమనే ప్రసిద్ధి వచ్చింది.

**ఇత్థం శేషాంశజం శైలం శేషేణ పరివేష్టితమ్ ।**
**స్వావాసహేతోర్హరిణా వాహితం వాయునా ఛలాత్ ॥**
**రాజన్! శేషనిమిత్తేన శేషాచలమిమం విదుః ॥**
**భ.పు. అ.1. శ్లో. 126, 127**

### కలియుగంలో వేంకటాచలంగా ప్రసిద్ధి

జనక మహారాజు శతానందుని 'ఓ మహామునీ! కలియుగంలో ఈ పర్వతానికి వేంకటాచలమని పేరెలా వచ్చిందో తెలియజేయండి' అని అడిగాడు. అంతట శతానందుడు ఈ విధంగా చెప్పసాగాడు –

పూర్వం శ్రీకాళహస్తి పట్టణంలో పురందరుడనే సోమయాజి ఉండేవాడు. ఆయన ధర్మాచరణలో గట్టి పట్టుదల గలవాడు, దీక్ష కలవాడు, సత్య వచనుడు, అనేక యాగములు చేశాడు. అతనికి చాలాకాలం వరకు పుత్రులు కలుగలేదు. అయినా ఆయన పుత్రులకొరకు విచారించలేదు. ఆయన పూర్వపుణ్య విశేషం చేత పెద్ద వయసులో అతనికి ఒక కుమారుడు కలిగాడు. ఆయన బ్రాహ్మణులను పిలిచి ఆ పిల్లవానికి 'మాధవుడ'నే పేరు పెట్టాడు. ఆ తరువాత పెరిగి పెద్దవాడు కాగా ఆ పిల్లవానికి ఉపనయనం చేశాడు. ఆ బాలుడు శుక్లపక్ష చంద్రునివలె వృద్ధి చెందాడు.

మాధవుడు వేదవేదాంగ శాస్త్రాలను అధ్యయనం చేశాడు. అతడు సకల విద్యావిశారదుడయ్యాడు. అతనికి యౌవనం రాగా పురందరుడు వివాహం చేశాడు. 'చంద్రలేఖ' అనే కన్యతో అతనికి వివాహం జరిగింది. మాధవుడు ఆమెతో చాలాకాలం భోగాలనుభవించాడు.

అతడు నిత్యం దైవయజ్ఞం, పితృయజ్ఞం, భూతయజ్ఞం, ఋషియజ్ఞం, మనుష్యయజ్ఞం అనే పంచయజ్ఞాలను నిర్వర్తించేవాడు. అతడు బ్రహ్మతేజస్సుతో విరాజిల్లుతున్నాడు. అతడు 37 సంవత్సరాల వయస్సులో అపరభాస్కరునివలె ప్రకాశిస్తున్నాడు. అతని భార్య చంద్రలేఖ పాండ్యదేశీయురాలు. ఆ దేశస్తులకు ఆమె చాలా అభిమానపాత్రురాలు. ఆమె భర్త నిద్రించిన తర్వాత నిద్రిస్తూ ఆయన భుజించిన తర్వాతే భుజిస్తూ పతివ్రతాధర్మాన్ని పాటిస్తున్నది.

ఇలా ఉండగా ఒకనాడు మాధవుడు పగటిపూట భార్యను పొందగోరి చంద్రలేఖను సమీపించి మదనపీడితుడై ఆమెతో 'ఓ కల్యాణి నేను నిన్ను పొందగోరుచున్నాను' అన్నాడు. అప్పుడు చంద్రలేఖ భర్తమాట విని అతనితో ఇలా అన్నది. మహారాజా! ఈ శరీరం ఎముకలు మాంసాదులతో నిండినది. శరీరంతో మరొక శరీరం కలవడాన్ని సాధువులు సమ్మతించరు. అదీకాకుండ మహర్షులు పగటి సంగమాన్ని కూడదంటారు. ఇంట్లో తల్లీ, తండ్రీ, అగ్నిహోత్రుడు, భగవంతుడు ఉన్నారు. సూర్యకాంతిని చూడు. వీరంతా ప్రత్యక్షదైవాలు. కావున కామాన్ని 'విసర్జించు' అని చెప్పగా భార్య మాటలు విని మాధవుడు ఆమెతో 'భామినీ! నాకు సుఖాన్ని ఇమ్ము. నా మనోరథాన్ని నెరవేర్చు. నీకు పుత్రసౌభాగ్యం కలుగుతుంది. నీకు ఉత్తమ లోకాలు భర్తతోపాటు లభిస్తాయి' అన్నాడు. అప్పుడు భర్త మాట విని చంద్రలేఖ, అతనితో ఇలా అంది -

మహారాజా! చంద్రలేఖ తన భర్తతో 'నేను నీరు తేవడానికి వెళుతున్నాను. నీవు నా ముందు వెళ్ళు' అని చెప్పగా అతడు అలవాటు ప్రకారం దర్భలు తేవడానికి బయలుదేరాడు. చంద్రలేఖ కూడా నీరు తేవడానికి బిందె తీసుకుని బయలుదేరింది. మాధవుడు ఆమెను అనుసరిస్తూ మర్రిచెట్ల గుబురువైపు వేగంగా వెళ్ళాడు.

ఇంతలో ఆ బ్రాహ్మణ కుమారుడు ఆ అడవి మధ్యలో మరొక స్త్రీని చూశాడు. వసంత ఋతువులో ఆమె తెల్లని వస్త్రాన్ని ధరించి మొలనూలు ధరించి ఒక చెట్టు మొదట్లో కూర్చొని ఉంది. ఆమె చక్కని ముక్కు, కనుబొమలు, కలిగి సుందరంగా ఉంది. ఆమె ముంగురులు నల్లగా ప్రకాశిస్తున్నాయి. ఆ బ్రాహ్మణుడు మంచి రంగుతో ఉన్నతమైన స్తనాలతో రవికను ధరించి, కోకిలవలె మధురమైన స్వరం కలిగి కళ్ళకు కాటుకను అలంకరించుకొని, మోకాళ్ళపై తలవెంట్రుకలను విరబోసుకొని కాలితో భూమిపై రాస్తూ కూర్చొని ఉన్న 'కుంతల' అనే చండాల కన్యను చూసి మోహించాడు.

ఆమెను చూడగానే మనస్సులో బ్రహ్మదేవుని సృష్టి వైచిత్రాన్ని గురించి విచారిస్తూ బాధపడుతూ తన భార్యతో 'ప్రియా! ఇక నీవు ఇంటికి వెళ్ళు' నేను నీ పతిభక్తికి మెచ్చాను. నా కోరిక నెరవేరింది' అని చెప్పగా చంద్రలేఖ 'స్వామీ! మీరు చక్కగా చెప్పారు. నేను మన యింటికి వెడుతున్నాను' అని చెప్పి భర్త అనుమతి తీసుకొని యింటికి వెళ్ళింది.

మాధవుడు తన భార్య వెళ్ళేదాక అక్కడే ఉన్నాడు. ఆమె యింటికి వెళ్ళిన తరువాత తానంతకుముందు చూచిన యువతిని గురించి చింతిస్తూ మన్మథుడు మనస్సును హరించగా నెమ్మదిగా ఆమెవద్దకు వెళ్ళాడు. మహారాజా! విశాలనేత్రములు కల ఆమె తనవద్దకు వస్తున్న విప్రపుత్రుని చూచి తొట్రుపాటుతో బొంగురు గొంతుతో ఇలా అన్నది -

'ఓ మునీంద్రా! మహామతీ! నా వద్దకు రావద్దు' అని హెచ్చరించింది. అది విని మాధవుడు వెంటనే ఇలా అన్నాడు - కల్యాణీ! నీవెవరు? నీకు శుభమగుగాక! నీ తల్లిదండ్రులెవరు? నీ నివాసమెక్కడ? మీది ఏ దేశం?' అని అడుగగా ఆమె తనను గురించిన వివరాలను ఇలా చెప్పింది -

'వేశ్యజాతిలో జన్మించిన పాపాత్మురాలనైన నన్నెందుకు ప్రశ్నిస్తావు? నా తల్లిదండ్రులు చండాల జాతివారు. నేను కల్లుత్రాగి, మాంసం తినే దుష్టురాలను. నేను మధ్యదేశంలో ఉంటాను. ఓ విప్రా! నీవెందుకడుగుతున్నావు? వేదవేదాంతాలను చదివిన నీవు నన్ను చూడటానికైనా తగవు. అటువంటప్పుడు మూఢుడవు, బుద్ధిహీనుడవై నన్ను తాకడానికి, నాతో క్రీడించడానికి నీవెలా కోరుతున్నావు?' అని పలుకుతున్న ఆమెతో మాధవుడు మరల ఇలా అన్నాడు -

'లోకపితామహుడైన బ్రహ్మదేవుడు నారాయణుని నుండి వృథాగా జన్మించాడు. నేనతన్ని గుడ్డి ప్రజాపతి అనుకుంటున్నాను. నీవంటి సౌందర్యవతిని వృథాగా అడవిపాలు చేసిన ఆ బ్రహ్మగుడ్డివాడే కదా! అయినప్పటికీ నా బుద్ధి ఎల్లప్పుడు నీయందే రమిస్తున్నది. ఆ బ్రహ్మదేవుడు నా మనస్సును నీయందే నిరంతరం లగ్నం చేశాడు. అందువల్ల నా మనోరథాన్ని పూరించి, నన్ను బ్రతికించు శుచిస్మితా!

ఆ మాటలు విని కుంతల మాధవునితో 'కులభ్రష్టత్వం చేసేవాళ్ళు మూడు తరాలవరకు కులనాశకులవుతారని సత్కులంలో పుట్టిన పెద్దలు పూజ్యులు చెబుతారు' అని చెప్పగా మాధవుడు ఆమెతో ఇలా అన్నాడు- 'ఉప్పు సముద్రంలో పుట్టినప్పటికినీ అనేక విధాలైన రత్నాలను వాటి కాంతిని ప్రధానంగా గ్రహించి దేవతలు కూడా స్వీకరిస్తున్నారు. కావున నీవు సౌందర్యవతివి కాబట్టి నేను నిన్ను పొందగోరుతున్నాను'.

ఓ సుస్మితా! నేను చనిపోయిన తరువాత మా పితృదేవతలతో సహా నరకానికి వెళ్ళినా పరవాలేదు' అని ఆ బ్రాహ్మణ కుమారుడు చెప్పగా విని బాలసూర్యుని వంటి కాంతిగల ఆ కన్య కుంతల ఇలా రోదించింది –

ఓ దేవతలారా! ఓ గణాధిపతులారా! ఈ బ్రాహ్మణుని పాపం నుండి కాపాడండి. ఇతడు వేశ్యాంగనతో మాట్లాడుతున్నాడు. ఆ దోషం నుండి అతనిని రక్షించండి. ఓ చంద్రాది నవగ్రహాల్లారా! మీరందరూ ఇతనిని రక్షించండి. మీరంతా నా ప్రార్థనను ఆలకించండి. ఈ విప్రుడు వృథాగా పాపాత్మురాలనైన నా సంగంవలన మృతిని కొని తెచ్చుకుంటున్నాడు. మహారాజా! ఆ కన్యక ఆ బ్రాహ్మణుని కొరకు ఈ విధంగా విలపించింది.

ఓ భూసురా! పాపాత్మురాలను, వేశ్యాంగనను అయిన నన్ను తాకవద్దు. బాధతో ఉన్నప్పటికినీ ఎవడైనా అగ్నిని ముట్టుకుంటాడా? సర్పాన్ని, పెద్ద పులిని, ఏనుగును సమీపిస్తాడా? పరస్త్రీలు కూడా వాటితో సమానులే. ఇక చండాలకన్యనైన నా గురించి చెప్పేదేముంది? నీచులు గొప్ప పదవిలో ఉన్నప్పటికినీ అధోగతిని కోరుకుంటారు. నీ బుద్ధి అలాగే ఉంది. జ్ఞానులైన విప్రులు అలా కోరుకోరు.

**కః స్పృశేదగ్నిమార్తః సన్ సర్పం వ్యాఘ్రం గజం ద్విజ ।**
**పరపత్న్యో హి తత్తుల్యాః కిము చండాలకన్యకా ॥**
**ఉత్తమం పదమాస్థాయ నీచా ఇచ్ఛన్త్యధోగతిమ్ ।**
**జ్ఞానినో న తథా విప్రాః తవ బుద్ధిస్తు తాదృశీ ॥**

– భ.పు. అ.1, శ్లో. 166, 167.

బ్రాహ్మణోత్తమా! పూర్వం విష్ణుమూర్తి స్త్రీజాతి, పురుష జాతి అని రెండు జాతులనే నిర్మించాడు. అలాగే నాలుగు వర్ణాలను ఏర్పరచాడు. బ్రాహ్మణులు బ్రాహ్మణ స్త్రీలను, అలాగా ఆయా వర్ణముల వారు తమ వర్ణానికి చెందిన స్త్రీలను వివాహమాడి భోగించుట యుక్తము. బ్రాహ్మణులు ఈ వర్ణాశ్రమ ధర్మాన్ని త్యజించడం వికృతకార్యంగా నేను భావిస్తున్నాను.

భూసురోత్తమా! నీ శరీరం విశేషించి వేదమంత్రములచే పవిత్రమైనది. ఋతుకాలంలో నీ తల్లి నీ తండ్రితో సంగమించగా వేదమంత్రములచే పవిత్రుడైన నీ తండ్రి రేతస్సు నీ తల్లియందు విడువబడినది. దీనినే 'గర్భాధాన' మంటారు. ఆ తరువాత వేదమంత్రాలతో సీమంతం చేశారు. పదవ నెలరాగానే నీ తల్లి నిన్ను ప్రసవించింది. అప్పుడు నీ తండ్రి జాతకర్మ నాచరించి నీకు మంత్రమువలె పవిత్రమైన పేరు పెట్టాడు. అలాగే వేదమంత్రపూర్వకంగా అన్నప్రాశనం, చౌలం, పుట్టువెంట్రుకలు తీయించడం, చెవులు కుట్టించడం మొదలైన వాటిని నిర్వర్తించాడు. అగ్నిసాక్షిగా నీకు వివాహం చేశాడు. నీవు వేదశాస్త్రాలను అధ్యయనం చేసి, నిత్యాగ్నిహోత్రివై వ్రతదీక్షలో ఉన్నావు.

ఇంత పవిత్రమైన నీ దేహానికి నాతో సంగం ఎలా పొసగుతుంది? నీ చెవులు విష్ణు కథలు వినడం వలన, నీ ముక్కు విష్ణువుకు సమర్పించిన సుగంధంతోను, నీ ఉదరం (పొట్ట) వాసుదేవునికి సమర్పించిన అన్నంతోను పవిత్రములైనాయి. నీ చేతులు శ్రీకృష్ణుని పూజతో పవిత్రాలైనాయి. నీ నాలుక హరినామస్మరణతో పవిత్రమైంది. నీ పాదాలు పుణ్యక్షేత్రాలకు వెళ్ళడం వలన పవిత్రాలైనాయి. ఇటువంటి పవిత్రమైన నీ దేహంతో నాకు పొందు ఎలా సాధ్యమవుతుంది?

ఇక మహాదోషంతో కూడిన నా శరీరం గొప్పతనం చెబుతాను విను. నా నాలుక ఎప్పుడూ పలుకరాని పరుష భాషణంచేత దహించబడుతున్నది. మద్యమాంసాదాలను స్వీకరించడం వలన నా ఉదరంలో వ్రణం పుట్టినది. నిరంతరం జారకథా ప్రసంగంతో నా చెవులు జీర్ణించిపోయినాయి. నా పాదాలు జారుల గృహాలకు వెళ్ళి వెళ్ళి మృదుత్వాన్ని కోల్పోయి రాళ్ళవలె కఠినాలైనాయి. నా చేతులు క్రూరమైన గోహత్యలు చేయుటవలన యమదండాలవలె ఉన్నాయి. ఇటువంటి నా దేహంతో నీకు పొందెట్లా కుదురుతుంది? ఉత్తముడైనవాడు పతితుడై స్వర్గాన్నెలా పొందుతాడు? పరస్త్రీలను పొందిన పాపానికి చాలామంది నరకానికి వెళ్ళారు.

**ఉత్తమో నీచతాం ప్రాప్య కథం స్వర్గం గమిష్యతి?**
**పరస్త్రీసంగదోషేణ బహవో నరకాన్ గతాః ॥**

– భ. పు. అ.1, శ్లో. 182.

కావున నీవు వచ్చిన దారినే వెళ్ళు. నీకు శుభమగుగాక! అయ్యా! నేను నీకు దాసినవుతాను' అని కుంతల పలుకగా విని మాధవుడామెతో ఇలా అన్నాడు –

నీతో పొందు అనేక జన్మల పుణ్యంవల్ల లభించింది. అది శుభప్రద మైనది. మోక్షకారకమైనది. అదృష్టవశాత్తు భగవంతుననుగ్రహం వలన పుణ్యవిశేషం చేత పురుషార్థప్రదమై లభించింది. కావున కల్యాణీ! నన్ను ఆదరించు. నిన్ననుసరిస్తున్నాను. లజ్జను వదలి నా మనోభీష్టాన్ని నెరవేర్చు నీ వియోగం మాత్రం చేతనే నా ప్రాణాలు పోతున్నాయి. కావున మృత్యువాత పడనున్న నన్ను బ్రతికించు నీకు శుభం కలుగుతుంది.

మాధవుడు ఈ విధంగా పలుకగా ఆమె లేచి పరుగెత్తడానికి ఉద్యుక్తురాలైంది. మాధవుడు ఆమెవెంట పరుగెత్తి ఆమెను పట్టుకున్నాడు. అప్పుడామె 'మాధవా! నీ తల్లిదండ్రుల రెండు వంశాల వారికి రౌరవాది నరకాలు తప్పకుండా సంప్రాప్తిస్తాయి' అని ఆక్రోశిస్తున్న ఆమెను మన్మథ తాపంతో తపిస్తున్న మాధవుడు బలాత్కారంగా పట్టుకొని ఆమెతో భోగమనుభవించాడు.

ఆ తరువాత మనస్వినియైన ఆమె అతనితో ఇలా అంది 'భూసురా! ఈ రోజునుండి నీవు నాకు భర్తవు. నీ యజ్ఞోపవీతాన్ని తీసెయ్యి. శిరోముండనం (గుండు) చేసుకో. నీవు బ్రాహ్మణత్వం నుండి భ్రష్టుడ వయ్యావు. చండాలుడవయ్యావు. చక్కని గోమాంసం తిను. వెంటనే కల్లు త్రాగు. అతడా మాటలు విని ఆమె చెప్పినదంతా చేశాడు. విధివంచితుడై అతడు చండాలునివలె ప్రవర్తించాడు.

మాధవుడు ఆమెతోపాటు కృష్ణవేణీ నదీతీరంలో పన్నెండేళ్ళు ఆమెయందనురక్తుడై గడిపాడు. శరీరాలు అశాశ్వతం కావున నీలిముంగురులు గల కుంతల కాలపాశానికి బద్ధురాలై మరణించింది. రాజా! మాధవుడు ఆమె ఎడబాటుతో దుఃఖితుడై పిచ్చివానివలె భూమండలమంతా సంచరించాడు.



ఇలా ఉండగా ఒకనాడు దైవయోగం వలన ఉత్తరదేశీయులైన కొందరు రాజులు తీర్థయాత్ర చేస్తూ వరాహ పర్వత సమీపానికి వచ్చారు. దారిలో మాధవుడు వారిని చూచాడు. వారితోపాటు తాను కూడా కలిసి వెళుతూ వాళ్ళు తినగా మిగిలిన దానిని భుజిస్తూ దైవవశాత్తు శేషాద్రికి చేరాడు. ఆ రాజులందరు అక్కడికి వెళ్ళి కపిలతీర్థంలో స్నానంచేసి భక్తియుక్తులై శ్రద్ధతో తలనీలాలు సమర్పించారు. మాధవుడు కూడా వెళ్ళి తలనీలాలు సమర్పించాడు. మహారాజా! ఆ రాజులందరు సంతోషంతో శ్రద్ధతో పితృదేవతలకు పిండప్రదానం చేశారు. మాధవుడు కూడా ఆ పవిత్ర తీర్థంలో స్నానంచేసి వారివలె పిండప్రదానం చేయటానికై మట్టితో పిండాలను చేసి శ్రద్ధతో పితృదేవతలకు సమర్పించాడు.

దైవవశాత్తు ఆ కర్మతో అతడు పాపవిముక్తుడయ్యాడు. కావున ఈ తీర్థంలో స్నానంచేసి భక్తితో, శ్రద్ధతో పితృదేవతలకు పిండప్రదానం చేసేవారు తప్పకుండా ముక్తిని పొందుతారు. ప్రాచీనమైన ఈ పుణ్యక్షేత్రంలో ఆ బ్రాహ్మణుడు మట్టితో పిండాలు చేసి పితృదేవతలకు సమర్పించి పాపవిముక్తుడయ్యాడు. ఆహా! ఆ పురుషోత్తముడైన దేవదేవుని క్షేత్రం యొక్క, తీర్థం యొక్క మాహాత్మ్యాన్ని పుణ్యశక్తిని ఏమని వర్ణించగలం? భగవంతుని ఆజ్ఞచే అతని పితరులు ఆ మట్టి పిండాలతోనే ముక్తిని పొందారు.

**కిం వర్ణయామః పురుషోత్తమస్య**
**క్షేత్రస్య తీర్థస్య చ పుణ్యశక్తిమ్ ।**
**మృత్పిండ దానాత్పితరశ్చ తస్య**
**ముక్తిం ప్రపన్నాః మురవైరిశాసనాత్ ॥**

– భ. పు. అ.1, శ్లో. 204

తెల్లవారగానే ఆ రాజులందరు బిడ్డలు, బంధువులతో ఆ పర్వతాన్ని అధిరోహించారు. మాధవుడు కూడా వారిననుసరిస్తూ శేషాద్రిని సమీపించాడు. వారంతా అక్కడక్కడ విశ్రమించారు. మాధవుడు కూడా ఆ పర్వత శిఖరంపై కూర్చున్నాడు. అంతట మహారాజా! ఆ పర్వతాన్ని తాకినంతనే అతని పాపం గజగజ వణికింది. సాలెపురుగు నోటినుండి దారం బయటకు వచ్చినట్లు అతడు తన నోటినుండి పాపాన్ని వెళ్ళగక్కాడు. అదంతా అతన్ని చుట్టుముట్టడంతో అతనికి చాలా కష్టం కలిగింది. ఆ పర్వత మహిమ వలన అతని శరీరం నుండి పుట్టిన అగ్ని మద్యపానం, మాంసభక్షణం వలన కలిగిన పాపాన్ని దహిస్తూ ప్రజ్వరిల్లింది. దుర్గంధంతో కూడిన పొగ ఆ ప్రాంతమంతా వ్యాపించింది.

బ్రహ్మరుద్రాది దేవతలంతా దానికి కారణం తెలుసుకోగోరి విచిత్రాలైన విమానాలతో ప్రకాశిస్తూ వచ్చారు. ఆకాశంలోనే ఉండి జరిగినదంతా చూసి వారు మాధవుని శిరస్సుపై పుష్పవర్షాన్ని కురిపించారు. అంతట బ్రహ్మదేవుడు విమానం దిగివచ్చి 'శ్రీహరి అజామీళుని రక్షించినట్లు ఆ దయామయుడైన శ్రీనివాసుడు దయతో మాధవుని పాపంనుండి ఉద్ధరించాడు కదా!' అని తన మనస్సులో అనుకుంటూ మాధవుని వద్దకు వచ్చి ప్రేమతో అతని శిరస్సును మూర్కొంటూ ఇలా అన్నాడు –

''ఓ మాధవా! విప్రశ్రేష్ఠా! నీ పాపమంతా నశించింది. నీవు స్వామి తీర్థానికి వెళ్ళి దానిలో స్నానంచేసి వరాహస్వామికి

నమస్కరించి నీ శరీరాన్ని త్యజించు. ఆ తరువాత మహారాజుగా పుట్టి రాజ్యాన్ని నిష్కంటకంగా పరిపాలించు. పాండవులకు మనుమడైన పరీక్షన్మహారాజు వంశంలో, నారాయణపురంలో సుధర్మునికి పుత్రునిగా జన్మించి, ఆకాశరాజను పేరుతో ప్రసిద్ధి చెంది, కీర్తిమంతుడవై దక్షిణదేశంలో తొండదేశాధిపతివి అవుతావు. లోకమాత అయిన లక్ష్మీదేవి నీకు కుమార్తె అవుతుంది. జగత్ప్రభువు నీకు అల్లుడు అవుతాడు. ఆ తరువాత నీవు వైకుంఠాన్ని చేరతావు'' అని మాధవునికి వరాన్ని ప్రసాదించాడు.

ఆ తరువాత బ్రహ్మదేవుడు ఆ పర్వతానికి 'వేంకటాచలం' అని పేరు పెట్టాడు. 'వేం' అనగా సకల పాపాలు, 'కటః' అనగా వాటిని దహించేది అని అర్థం. ఈ పర్వతం పాపాలన్నింటినీ దహించివేస్తుంది. కాబట్టి ఇది లోకంలో 'వేంకటాద్రి'గా ప్రసిద్ధి చెందింది.

**సర్వ పాపాని 'వేం' ప్రాహుః 'కటః' తద్దాహ ఉచ్యతే ।**
**తస్మాద్వేంకటశైలో-యం లోకే విఖ్యాత కీర్తిమాన్ ॥**

– భ. పు. అ.1, శ్లో. 220, 221.

మహారాజా! ప్రభాతకాలంలో ఈ పర్వతాన్ని కీర్తించే వారికి వేల పర్యాయములు గంగాసేతు యాత్ర చేసిన ఫలితం తప్పక కలుగుతుంది. యథార్థం చెబుతున్నాను విను. ఈ చరిత్రను గౌతమ మహర్షి నాకు చెప్పారు. ఇది పుణ్యప్రదమైనది, మిక్కిలి మంగళకరమైనది. దీనిని వింటే శుభం కలుగుతుంది.

## వైకుంఠం నుండి భూలోకానికి భగవంతుని రాక

జనక మహారాజు శతానందుని 'మహాత్మా! భగవంతుడు భూలోకానికి వేంచేస్తాడని వాయుదేవుడు ఆదిశేషునితో చెప్పినట్లు తాము సెలవిచ్చారు. నారాయణుడు ఏ కారణంవలన వైకుంఠాన్ని వీడి భూలోకానికి విచ్చేశాడు? అక్కడ ఏమేమి అద్భుతకృత్యాలు చేశాడు? అవన్నీ నాకు వివరంగా చెప్పండి. ఆ పురుషోత్తముడు వైకుంఠలోకాన్ని అసలెందుకు వదిలాడు? ఆ దేవదేవుని దివ్యచరిత్రను, ఆ వేంకటాచల మాహాత్మ్యాన్ని, అక్కడుండే తీర్థాల మహిమను వరాహరూపియైన శ్రీమహావిష్ణువు వైభవాన్ని వివరంగా చెప్పండి. మహాత్ముడైన ఆకాశరాజుకు సాక్షాత్తు లక్ష్మీదేవి కుమార్తె అయ్యింది. జగత్ప్రభువైన శ్రీమన్నారాయణుడు అల్లుడైనాడు. దేవతలు, ఋషులు, దేవతా స్త్రీలు అందరూ ఆ దివ్యపర్వతానికి విచ్చేసి అక్కడ సమావేశమైన ఆ దివ్యచరిత్రను నాకు వివరించండి అని అడిగాడు. అప్పుడు శతానందుడు ఇలా చెప్పసాగాడు -

పూర్వం కశ్యపాది మహర్షులందరూ గంగాతీరంలో ఆనందంగాఒకగొప్పయజ్ఞాన్నిచేశారు.అప్పుడుమునిశ్రేష్ఠుడైన నారదమహర్షి అక్కడికి విచ్చేసి ఆ మునీంద్రులను 'అయ్యా! మీరు ఈ ఉత్తమ యజ్ఞాన్ని ఎందుకొరకు చేస్తున్నారు? ఈ యజ్ఞ ఫలభోక్త ఎవరు? మీరంతా ధ్యానించే ఆ దేవదేవుడెవరు? ఈ యజ్ఞఫలాన్ని ఎవరికి సమర్పిస్తారు?' అని ప్రశ్నించాడు. అది విని ఆ మునిపుంగవులందరూ సంశయగ్రస్తులై దానిని గురించి విచారించసాగారు.

వారంతా సమావేశమై చర్చించుకొని బ్రహ్మజ్ఞానుల్లో శ్రేష్ఠుడైన భృగుమహర్షిని సమీపించి అంజలిబద్ధులై భక్తితో వినమ్రంగా ఇలా అన్నారు- 'ఓ మహాత్మా! దేవతాశ్రేష్ఠులను పరీక్షించుటకు వెంటనే బయలుదేరండి! అని ప్రార్థించగా భృగు మహర్షి బ్రహ్మదేవుని మందిరానికి చేరాడు. అక్కడ చతుర్ముఖ బ్రహ్మ ఎనిమిది భుజాలతో విలసిల్లుతున్నాడు. సృష్టికి ఆద్యుడైన ఆ బ్రహ్మదేవుని దివ్య శరీరాన్ని సరస్వతీదేవి సేవిస్తున్నది. ఆయన నాలుగు ముఖాలనుండి వేదఘోష వెలువడుతున్నది. అష్టదిక్పాలకులు ఎనిమిది దిక్కులలోను ఆయనను పరివేష్టించి ఉన్నారు. ఆయన శిరస్సు ఉజ్వలమైన కిరీటంతో శోభిస్తున్నది. ఆయన జగత్ప్రభువు, అనామయుడు అయిన శ్రీమన్నారాయణుని భక్తితో స్తుతిస్తున్నాడు. ఆయనకు నమస్కరిస్తున్నాడు. ఆయన రజోగుణ ప్రభావంతో విలసిల్లుతున్నాడు.

అటువంటి బ్రహ్మదేవుని దర్శించిన భృగు మహర్షి ఆయన ముందు సాష్టాంగపడి నమస్కరించాడు. కాని భృగువును చూచి కూడా బ్రహ్మదేవుడు ఏమీ మాట్లాడలేదు. అంతట భృగుమహర్షి బ్రహ్మ దేవుని అజ్ఞానిగా తలంచి అతడు పూజ్యుడు కాడనుకొన్నాడు. తను వచ్చిన పని పూర్తికానందున ఆయన అక్కడ నుండి కైలాసానికి వెళ్ళాడు.

ఆ కైలాసగిరిపై ఆ మహర్షి ముక్కంటిని దర్శించాడు. ఆయన తన మందిరంలో పార్వతీదేవితో క్రీడిస్తున్నాడు. ఆ సమయంలో అక్కడకు వచ్చిన భృగువును శివుడు గుర్తించలేదు. పార్వతీదేవి ఆయనను చూసి సిగ్గుతో శివునితో 'పరమేశ్వరా! నన్ను వదలండి. మహర్షి వేంచేశాడు' అన్నది. ఆమె మాటలు విని శంకరుడు క్రోధతామ్రాక్షుడై వెంటనే అతనిని చంపటానికి ఉద్యమించాడు. అప్పుడు భృగుమహర్షి శంకరుని 'నీవు లోకంలో పూజింపబడకుందువుగాక! నీవు లింగాకారంలోనే పూజింపబడుదువుగాక!' అని శపించాడు.

ఆ తరువాత భృగుమహర్షి వైకుంఠానికి వెళ్ళాడు. అక్కడ శ్రీహరి మందిరం ప్రాకారాలతోను, గోపురాలతోను, కొత్త కొత్త ద్వార తోరణాలతోను విరాజిల్లుతున్నది. నాలుగు దిక్కుల్లోను నలుగురు ద్వారపాలకులు ఉన్నారు. దానిలోని శయ్యామందిరంలో శేషపాన్పుపై దేవదేవుడైన నారాయణుడు లక్ష్మీదేవితో కూడి ఉన్నాడు.

భృగు మహర్షి ఆయనను చూచి కోపంతో తన పాదంతో



అనంతరం భగవంతుడు తన ఏకాంత మందిరంలో లక్ష్మీదేవితో ఉండగా రమాదేవి శ్రీహరితో ఇలా అంది. 'దేవదేవా! జగత్ప్రభూ! జగన్నియామకా! జగన్నాథా! జగన్మయుడవైన నీ వక్షఃస్థలంలో నేను నివసిస్తున్నాను. ఆ మహర్షి తన పాదంతో నీ వక్షఃస్థలంపై తన్నాడు. దేవదేవా! గరుడధ్వజా! అందువల్ల నేను నిన్ను వీడి దివ్యమైన కరవీర పురానికి వెళుతున్నాను' అని చెప్పి లక్ష్మీదేవి ప్రణయ కలహంతో కరవీర పురానికి (కొల్హాపురం) వెళ్ళింది.

ఆయన వక్షఃస్థలంపై తన్నాడు. వెంటనే శ్రీహరి లేచి వినయంతో ఆ ఋషి పాదపద్మాలపై బడి అతనిని ఆలింగనం చేసుకొని భక్తితో ఇలా అన్నాడు-

ఓ మునిశ్రేష్ఠా! నా శరీరం చాలా కఠినమై ఉంది. యౌవనం వలన చాలా దృఢంగా ఉన్నది. దేవమానవులకు అభేద్యమైనది. వజ్రంకంటె కూడా ఎనిమిది రెట్లు దృఢంగా ఉన్న నా శరీరాన్ని మృదువైన, కోమలమైన నీ పాదంతో ఎందుకు తన్నావు? ఓ ద్విజోత్తమా! నీ పాదాలు దివ్యమైనవి, మృదువైనవి. అవి నా శరీరాన్ని తాకటం వలన ఎంత కష్టపడినవో, ఎంత బాధపడినవో? నాకు తెలియటం లేదు అని ఆయన పాదాలను వేడినీళ్ళతో కడిగి ఆ పవిత్రమైన, ఆ విప్రపాదోదకాన్ని తన శిరసుపై భక్తితో చల్లుకున్నాడు. లోకమంతా ఆశ్చర్యపడేటట్లు తన వారందరిపై కూడా చల్లాడు.

ఆ తరువాత ఆ మహర్షిని 'జ్ఞానులు తమ దర్శనం చేతనే ముల్లోకాలను పవిత్రం చేస్తారు' అనగా విని భృగుమహర్షి భూలోకానికి మరలి వచ్చాడు. మహర్షుల సభలో ఆయన వారందరికి శ్రీహరే సర్వోత్తముడని ఆ తరువాత లక్ష్మీదేవి పూజ్యురాలనీ, అనంతరం సరస్వతీ బ్రహ్మలు పూజ్యులని, ఆ తరువాత రుద్రాదులందరు పూజ్యులని, ఇదేవిధంగా దేవతలలోను, రాక్షసులలోను, మానవులలోను తరమత భేదాలుంటాయని తెలుసుకోవాలని తత్త్వవేత్తయైన భృగుమహర్షి వారందరికి తెలియజేశాడు. అది విని వారంతా శ్రీహరే సర్వేశ్వరుడని నిశ్చయించి ఆయనకే యజ్ఞఫలాన్ని సమర్పించారు.

**హరిః సర్వోత్తమః సాక్షాత్ రమాదేవీ తదంతరా ।**
**తదధౌ విధివాణ్యౌచ తదధః శర్వపూర్వకాః ॥**

– భవిష్యోత్తర పురాణం, అ.2, శ్లో. 32.

శ్రీ మహాలక్ష్మి ఎప్పుడైతే వైకుంఠాన్ని వీడి భూలోకానికి వచ్చిందో అప్పుడే శ్రీమన్నారాయణుడు ఆ ప్రణయ కలహాన్ని బాపుటకై లక్ష్మీదేవిని అన్వేషిస్తూ శ్రీహరి బయలుదేరాడు. ఇరవై ఎనిమిదవ ద్వాపరయుగం తర్వాతి కలియుగంలో ఎక్కడైతే లక్ష్మీదేవితో తనకు కలిగిన ప్రణయ కలహం ఉపశమిస్తుందో, ఏం చేస్తే ఆమె ప్రసన్నురాలవుతుందో ఆ విధంగా చేస్తాను అని సంకల్పించి తన మాయచే లీలామానుష విగ్రహుడై గోవిందుడు పరమానంద నిలయమైన ఉత్తమ వైకుంఠాన్ని వదలి గంగానదికి దక్షిణ దిక్కున మూడువందల యోజనాల దూరంలో సువర్ణ ముఖరీ నదీతీరం లోనికి వేంచేశాడు. ఆ నది శుకమహర్షికి వరాలు ప్రసాదించిన పుణ్యనది అగస్త్యమహర్షిచే పూజించబడింది.

దానికి ఉత్తరతీరంలో రెండున్నర క్రోసుల దూరంలో పవిత్రమైన వనాలతో కూడిన వేంకటపర్వతమున్నది. అది మేరుపర్వతానికి పుత్రుడు. సకల తీర్థాలతో విరాజిల్లుతున్నది. అది సాక్షాత్తు ఆదిశేషుని అవతారం. సకల ధాతువులతో కూడి ఉన్నది. సాక్షాత్తు శ్రీమన్నారాయణునికి ఆశ్రయమైన ఆ దివ్యపర్వతం అపర వైకుంఠంవలె విరాజిల్లుతున్నది. అది వాయు శేషుల సంవాదం వలన భూలోకానికి తీసుకురాబడింది. ఆ పర్వతం నిడివి మూడు యోజనాలు పొడవు ముప్పై యోజనాలు. ఆ పర్వతముఖ భాగంలో వేంకటాచలం, మధ్యభాగంలో నృసింహాచలం, చివరి భాగంలో శ్రీశైలము అనే మూడు దివ్యక్షేత్రాలున్నాయి.

సకల క్షేత్రాలతో విరాజిల్లుతున్న ఆ దివ్యపర్వతం అనేక వృక్షాలతో కూడి ఉన్నది. అనేక ధాతువులతో అలంకరింపబడినది. మల్లి, మందార, పనస, జువ్వి, మేడి, మోదుగ, వేప, పారిజాతం, చింత, నేరేడు వృక్ష సమూహాలతో కూడి ఉన్నది. టేకు వృక్షాలు విరివిగా పెరిగాయి. నల్లచందన

వృక్షాలు, తాటిచెట్లు, గిలకతాటి, కొండమల్లి, దేవదారు వృక్షాలతో ఆ పర్వతం అలరారుతున్నది. ఆ పర్వతం హంసలు, కన్నెలేడి పక్షులతో నిండి ఉంది. కొంగలు, చక్రవాకాలు, చిలుకలు, పావురాలు, పాలపిట్టలు, జింకల గుంపులతో అలంకృతమై ఉంది. సింహాలు, పెద్ద పులులు, ఖడ్గమృగాలు, అడవి పందులు, ఏనుగులు, కోతులు, నక్కలు, ఎలుగుబంట్లు, కస్తూరీ మృగాలు, అడవిదున్నలు, కొండచిలువలు, నాగుపాములు, గోమాయావులు, దానినాశ్రయించి ఉన్నాయి.

మల్లె, మాలతి, జాజి, నందివర్ధన మొదలైన పూలచెట్లతో ఆ పర్వతం శోభిస్తున్నది. సంపంగి, అశోక, పొన్న, నాగకేసర, మొగలి వృక్షాలతో, ఆ పవిత్రమైన పర్వతం మనోహరంగా ఉంది. అక్కడి వృక్షాలన్నీ దేవతాసమూహాలు. మృగాలన్నీ ఋషిపుంగవులు, పక్షులన్నీ పితృదేవతలు. శిలలన్నీ యక్షకిన్నరులు.

తరవో దైవతగణాః మృగాశ్చ ఋషిపుంగవాః ।
ఇతరః పక్షిణస్సర్వే పాషాణా యక్షకిన్నరాః ।।

– భవిష్యోత్తర పురాణం, అ.2, శ్లో. 53

ఆ వేంకటాచలం ఇంతటి ప్రభావం కలది. ఇంతటి మహత్తరమైన ఆ వేంకటాచల మాహాత్మ్యాన్ని, ప్రభావాన్ని, వేంకటేశుని వైభవాన్ని బ్రహ్మరుద్రేంద్రాదులు కూడా ఎరుగజాలరు. ఇక అల్పబుద్ధులైన మానవుల సంగతి చెప్పేదేముంది?' అని శతానందుడు జనకునికి వేంకటాచల వైభవాన్ని, వేంకటేశ్వరుని ప్రభావాన్ని వివరించాడు.

## స్వామి పుష్కరిణీ మాహాత్మ్యం

మహారాజా! ఆ వేంకటాచలంపై శ్రేష్ఠమైన, దివ్యమైన, శుభప్రదమైన స్వామి పుష్కరిణి ఉన్నది. అది తాబేళ్ళు, నీటికోళ్ళు, మొసళ్ళతో అలరారుతున్నది. కప్పల బెకబెక శబ్దములచే ప్రతిధ్వనిస్తున్నది. దాని ఒడ్డున ఉన్న వృక్షసమూహాలు ఆకాశాన్నంటుతున్నాయి. ఆ పుష్కరిణి గంగ మొదలైన సర్వతీర్థములకు జన్మభూమియై విలసిల్లుతున్నది. దాంట్లో స్నానం చేసే మానవులు ధన్యులు. వారికి పుణ్యం వృద్ధి చెందుతుంది.

ధనుర్మాసం శుక్లపక్షం ద్వాదశినాడు అరుణోదయ సమయంలో పండితవర్యులు, జ్ఞానులు దానిలో స్నానం చేయడానికి అభిలషిస్తారు. అది శుభప్రదమైనది. ఆ రోజున ఆ సమయంలో మహాత్ములే దానిలో స్నానం చేయాలని కోరుకుంటారంటే ఇంక సామాన్య మానవుల విషయం ఏమని చెప్పాలి?

అక్కడ ద్విజులు పితృదేవతలకు శ్రాద్ధాది కర్మలు చేస్తారు. వారి పితరులు సంతోషంతో పరమపదంలో నాట్యం చేస్తారు. ఆ విధంగా చేయని వారి జన్మ వ్యర్థం. ఆ పుష్కరిణిలో స్నానం చేసి దాని తీరంలో దానం చేసే మానవులు భాగ్యశాలులు.

పూర్వం శంఖమహారాజు దానిలో స్నానం చేసిన పుణ్యంచేత తాను పోగొట్టుకున్న రాజ్యాన్ని పొందాడు. అలాగే అంగిరసుని కుమారుడైన నారాయణుడనే బ్రాహ్మణుడు దానిలో స్నానంచేసి ఆ మహిమవల్ల దాని ఒడ్డున భగవంతుని దర్శించి వరాన్ని పొంది వైకుంఠానికి వెళ్ళాడు. శ్రీరాముడు ఈ పుష్కరిణిలో స్నానం చేయడంవలన రావణునిచే అపహరించబడిన సీతను తిరిగి పొందాడు. ఈ విధంగా స్వామి పుష్కరిణి తీర్థాలన్నిటిలో శ్రేష్ఠమైనది, శుభప్రదమైనది.

ఆ పుష్కరిణికి పడమటి దిక్కున వరాహస్వామి భూదేవిని ఆలింగనం చేసుకొని రావిచెట్టుక్రింద ఉన్న పుట్టలో విరాజిల్లుతున్నాడు. ఈ వేంకటాచలం మూడు కోట్ల తీర్థాలకు పుట్టినిల్లు. ఈ విధంగా భగవంతుడు వేంకటాచలానికి వచ్చి దానిని వైకుంఠం కంటే కూడా గొప్పదిగా భావించి తాను నివసించుటకు తగిన స్థలం కొరకు దానిపై ఇటునటు సంచరించాడు. కాని ఆయనకి తగిన స్థానం దొరకలేదు.

(సశేషం)





# జయదేవుని గీత గోవిందము

- డా॥ మారేపల్లి భువనేశ్వరి, 9550241921

**గత సంచిక తరువాయి**

## అనేక నారీ పరిరంభ సంభ్రమ

**స్ఫురణ్మనోహారి విలాస లాలసమ్ ।**
**మురారిమారా దుపదర్శయంత్యసౌ**
**సఖీ సమక్షం పునరాహ రాధికామ్ ॥ 10 ॥**

ప్రతిపదార్థం- అనేక నారీ = అనేకమంది గోపికల యొక్క; పరిరంభ = ఆలింగనముల (కౌగిలింతల) వల్ల కలిగిన; సంభ్రమ = ఉత్సాహము/తొందరపాటుతో; స్ఫురత్ = ప్రకాశిస్తున్న; మనోహారి = మనసును దోచుకునే; విలాస = శృంగార విలాసాల యందు; లాలసమ్ = అత్యంత ఆసక్తి కలిగిన వానిని (పరవశించిన వానిని); మురారిమ్ = ముర అనే రాక్షసుని సంహరించిన కృష్ణుడిని; ఆరాత్ = దగ్గరగా (కళ్ళముందే); ఉపదర్శయంతీ = చూపిస్తూ; అసౌ సఖీ = ఆ చెలికత్తె; సమక్షమ్ = ఎదురుగా; పునరాహ రాధికామ్ = రాధతో తిరిగి ఇట్లు పలికెను.


విశేషాలు - రాసలీలకు నాంది: ఇప్పటివరకు వసంతకాలం ఎంత బాధాకరంగా ఉందో వర్ణించిన సఖి, ఇప్పుడు ఆ బాధకు కారణమైన కృష్ణుడు ఎక్కడ, ఎలా ఉన్నాడో రాధకు చూపిస్తోంది. ఇది రాధలో విరహాన్ని పెంచి, చివరకు అది భక్తిగా మారేలా చేసే ప్రయత్నం.

'మురారి' అనే పద ప్రయోగం: శ్రీకృష్ణుడిని ఇక్కడ 'మురారి' అని పిలవడంలో ఒక చమత్కారం ఉంది. ముర అనే రాక్షసుడిని సంహరించిన ఆ మహావీరుడు, ఇప్పుడు గోపికల ప్రేమ పాశాలకు లొంగిపోయి ఉన్నాడని కవి భావన.

శబ్ద సౌందర్యం: 'ర' మరియు 'ల' అక్షరాల ప్రాస (నారీ, పరిరంభ, సంభ్రమ, స్ఫురత్, మనోహారి, విలాస, లాలసమ్) ఈ శ్లోకానికి ఒక రకమైన 'చమత్కార లయ'ను ఇస్తుంది.

ఈ శ్లోకంలో వాడిన పదాలు ఎంతో మృదువుగా ఉండి, కృష్ణుడు గోపికల మధ్య ఉన్న ఆ రమణీయ దృశ్యాన్ని మన కళ్ళముందు ఉంచుతాయి.

తాత్పర్యం: అప్పుడు రాధిక సఖి చాకచక్యంగా కృష్ణుని కోసం వెతికి, అతను సమీపంలోనే ఉన్నాడని చూసింది. అతను అందమైన గోపికలతో ఆనందకరమైన లీలలలో మునిగి ఉన్నాడు, వారు అతన్ని అత్యంత గౌరవంగా స్వీకరిస్తున్నారు. గోపికలు అతన్ని కౌగిలించుకోవడానికి తమ ఆత్రుతను చూపినప్పుడు, కృష్ణుని మనస్సులో అకస్మాత్తుగా



ఆనందకరమైన, ఇంద్రియ లీలల కోరిక మేల్కొంది. ఈ దృశ్యాన్ని రాధకు చూపిస్తూ, సఖి ఆమెతో మళ్ళీ మాట్లాడింది.

రాధా! అటు చూడు! ఒకరా ఇద్దరా! ఎంతమంది గోపికల పరిరంభ సంభ్రమంలో మునిగి తేలుతున్నాడో శ్రీకృష్ణుడు. గోపకాంతల మధ్య కృష్ణుడిదే వెలుగు. ఆ మనోహరి విలాస లాలసలు చూశావా! తన శృంగారంతో ఎవరిని

ఆకర్షించలేదంటావూ... ఆ మురారి?

చూడు! చూడు! కృష్ణుడేం చేస్తున్నాడో! అంటూ, దూరంగా కనిపించే కృష్ణలీలావిలాసాలకు ప్రత్యక్ష వ్యాఖ్యానం ఇస్తూ చేయెత్తి చూపిస్తోంది చెలికత్తె, సాక్షాత్తూ రాధకు! కళ్ళారా అంతా చూస్తోంది రాధ!

**భావార్థం**

అనేకమంది గోపికలు ఉత్సాహంతో తనను చుట్టుముట్టి ఆలింగనం చేసుకుంటుండగా, ఆ సుందరమైన విలాసాలలో పరవశించిపోయి ఉన్న కృష్ణుడిని వర్ణిస్తోంది. రాధా! అదిగో చూడు, మురారి అయిన శ్రీకృష్ణుడు గోపికల మధ్య ఎలా విహరిస్తున్నాడో అని సఖి రాధకు చూపిస్తూ ఈ విధంగా పలికింది.

**సఖి పాత్ర:**

ఆధ్యాత్మ రామాయణంలో గురువు ఎలాగైతే భగవంతుడిని చూపిస్తారో, ఇక్కడ సఖి రాధకు కృష్ణుడిని చూపిస్తోంది. అంటే, జీవాత్మకు పరమాత్మ మార్గాన్ని చూపే 'ఆచార్య' పాత్రను ఇక్కడ సఖి పోషిస్తోంది.

ఈ శ్లోకంతో వసంత వర్ణన ముగిసి, శ్రీకృష్ణుడి రాసలీలల వర్ణన ప్రారంభమవుతుంది.

## అష్టపది – 4

**ప్రథమ సర్గము – సామోద దామోదరః ॥ ప్రబంధః - 4 ॥**

**(సామోద దామోదర భ్రమర పదమ్) –**

**(రామక్రియా రాగం – యతి తాళం)**

**సామోద దామోదర భ్రమర పదమ్ -**

**రామక్రియా రాగ యతి తాళాభ్యాం గీయతే।**

**చందన చర్చిత నీల కళేబర పీతవసన వనమాలీ ।**

**కేళి చలన్మణి కుండల మండిత గండ యుగ స్మిత శాలీ ॥**

**హరిరిహ ముగ్ధ వధూనికరే విలాసిని విలసతి కేళి పరే ॥ (ధ్రువమ్) ॥1॥**

**పీన పయోధర భార భరేణ హరిం పరిరభ్య సరాగం ।**

**గోప వధూరనుగాయతి కాచిదుదంచిత పంచమ రాగమ్ ॥ 2 ॥**

**కాఽపి విలాస విలోల విలోచన ఖేలన జనిత మనోజం ।**

**ధ్యాయతి ముగ్ధ వధూరధికం మధుసూదన వదన సరోజమ్ ॥ 3 ॥**

**కాఽపి కపోల తలే మిలితా లపితుం కిమపి శ్రుతి మూలే ।**

**చారు చుచుంబ నితంబవతీ దయితం పులకై రనుకూలే ॥ 4 ॥**

**కేళి కళా కుతుకేన చ కాచిదముం యమునా జల కూలే ।**

**మంజుల వంజుల కుంజ గతం విచకర్ష కరేణ దుకూలే ॥ 5 ॥**

**కర తల తాళ తరళ వలయావళి కలిత కలస్వన వంశే ।**

**రాసరసే సహ నృత్య పరా హరిణ యువతీ ప్రశశంసే ॥ 6 ॥**

**శ్లిష్యతి కామపి చుంబతి కామపి రమయతి కామపి రామాం ।**

**పశ్యతి సస్మిత చారు తరామపరామనుగచ్ఛతి వామామ్ ॥ 7 ॥**

**శ్రీ జయదేవ భణితమిద మద్భుత కేశవ కేళి రహస్యం ।**

**బృందావన విపినే లలితం వితనోతు శుభాని యశస్యమ్ ॥ 8 ॥**

**విశ్వేషామనురంజనేన జనయన్నానందమిందీవర**

**శ్రేణీ శ్యామల కోమలై రుపనయన్నంగైరనంగోత్సవం ।**

**స్వచ్ఛందం వ్రజ సుందరీభిరభితః ప్రత్యంగమాలింగితః**

**శృంగారః సఖి మూర్తిమానివ మధౌ ముగ్ధో హరిః క్రీడతి ॥ 11 ॥**

**నిత్యోత్సంగ వసద్భుజంగ కబల క్లేశాదివేశాచలం**

**ప్రాలేయ ప్లవనేచ్ఛయాఽనుసరతి శ్రీఖండ శైలానిలః ।**

**కించ స్నిగ్ధ రసాల మౌళి ముకుళాన్యాలోక్య హర్షోదయా**

**దున్మీలంతి కుహూః కుహూరితి కలోత్తాలాః పికానాం గిరః ॥ 12 ॥**

**రాసోల్లాస భరేణ విభ్రమ భృతామాభీర వామ భ్రువా**

**మభ్యర్ణం పరిరభ్య నిర్భరమురః ప్రేమాంధయా రాధయా ।**

**సాధు త్వద్వదనం సుధామయమితి వ్యాహృత్య గీత స్తుతి**

**వ్యాజాదుత్కట చుంబితః స్మిత మనోహారీ హరిః పాతు వః ॥ 13 ॥**

**ఇతి శ్రీ జయదేవకృతౌ గీతగోవిందే**

**సామోద దామోదరో నామ ప్రథమస్సర్గః॥**

ఈ పాటను రామక్రియా రాగంలో పాడుతుంటారు. రామ అంటే స్త్రీ. ఆమెను ప్రసన్నం చేసుకునే క్రియలో భాగంగా ఈ రాగం సందర్భోచితం.

**1. చరణం: భావార్థం**

రాధాదేవితో సఖి (చెలికత్తె) వసంత రుతువులో బృందావనంలో శ్రీకృష్ణుడు గోపికల నడుమ జరిపే రాసక్రీడను, ఆయన అపార సౌందర్యాన్ని ఈ గీతంలో వర్ణించే సందర్భమిది.

**చందన చర్చిత నీల కళేబర పీతవసన వనమాలీ ।**

**కేళి చలన్మణి కుండల మండిత గండ యుగ స్మిత శాలీ ॥**

**హరిరిహ ముగ్ధ వధూనికరే విలాసిని విలసతి కేళి పరే ॥ (ధ్రువమ్) ॥**

ప్రతిపదార్థం: చందన చర్చిత = సుగంధభరితమైన శ్రీగంధం అలదబడిన / పూయబడిన; నీల కళేబర = నీల మేఘ వర్ణంతో కూడిన దేహము / శరీరము కలవాడు; పీత వసన = పసుపు పచ్చని పట్టు వస్త్రాలు (పీతాంబరాలు) ధరించినవాడు; వనమాలీ = వివిధ రకాల అడవిపూలతో అల్లిన వైజయంతీ వనమాలను ధరించినవాడు; కేళి = నృత్యము / రాసక్రీడ చేయునపుడు; చలత్ = అటుఇటు ఊగుతున్న / కదులుతున్న; మణి కుండల = రత్నఖచితమైన చెవిపోగుల (కుండలాల) చేత; మండిత = అలంకరింపబడిన; గండ యుగ = చెక్కిళ్ల జంట (రెండు చెక్కిళ్లు) కలవాడు; స్మిత శాలీ = చిరునవ్వుతో (మందహాసంతో) ప్రకాశించువాడు.

**హరిరిహ ముగ్ధ వధూనికరే విలాసిని విలసతి కేళి పరే ॥ (ధ్రువమ్) ॥**

ప్రతిపదార్థం: ధ్రువపదం (పల్లవి): హరిః = పాపాలను హరించే శ్రీకృష్ణుడు; ఇహ = ఈ వసంత సమయమున, ఈ బృందావనంలో; ముగ్ధ వధూ నికరే = అందమైన, ముగ్ధులైన

గోపికల సమూహము నందు; విలాసిని = ఓ శృంగార భావాలు కల రాధా!; కేళి పరే = వివిధ రాసక్రీడలందు నిమగ్నుడై; విలసతి = అత్యంత ప్రకాశమానంగా విహరిస్తున్నాడు.

విశేషాలు - రాగం & తాళం: ఈ అష్టపదిని సంప్రదాయబద్ధంగా వసంత రాగం మరియు రూపక తాళం (లేదా ఆదితాళం) లో గానం చేస్తారు.

రస పోషణ: ఇక్కడ శృంగార రసం ప్రధనమైనది. ప్రాకృత శృంగారంగా కనిపించినప్పటికీ, ఇది జీవాత్మ-పరమాత్మల అనుసంధానాన్ని సూచించే మాధుర్య భక్తికి సంకేతం.

అలంకార ప్రయోగం: జయదేవుని కవిత్వంలో ప్రసిద్ధమైన "కోమల కాంత పదావళి" కి ఇది ఉత్తమ నిదర్శనం. అనుప్రాసాల అమరిక (చర్చిత-కళేబర, మండిత-గండ, స్మిత-శాలీ) శ్రవణపేయమైన నాద సౌందర్యాన్ని కలిగిస్తుంది.

చిత్రణ: నల్లని దేహముపై తెల్లని శ్రీగంధము, పసుపు వర్ణపు పీతాంబరము, రంగురంగుల పూలమాల – ఈ వర్ణాల మేళవింపు (Color Contrast) శ్రీకృష్ణుని దివ్య రూపాన్ని కళ్లముందు సాక్షాత్కరింపజేస్తుంది.

ముగ్ధ: ముగ్ధ అంటే ఒక శృంగార నాయిక.అప్పుడే ఉదయిస్తున్న యౌవనం కలది, సంభోగ కాంక్షను జయించిన సిగ్గుకలది ముగ్ధ.(ప్రతాపరుద్రీయం)

**విలాసిని:** కూర్చున్నప్పుడు, నిలబడినప్పుడు, కదిలేటప్పుడు స్తనాలలో కదిలే గగుర్పాటు, కళ్ళలో కదిలే మెరుపు విలాసమంటారని భరతుడి నాట్య శాస్త్రం!

**విలసతి:** విలసతి అంటే ప్రకాశించేవాడు అని అర్థం. కాని ఒక్కడ సందర్భానుసారంగా విహరిస్తున్నాడు అని అర్థం గ్రహించాలి.

**వనమాలి:** పాదాలదాక వేలాడే పుష్ప మాల కలవాడు వనమాలి

**తాత్పర్యం:** ఓ శృంగార భావాలుకల రాధా! గంధం పూసిన నల్లనైన శరీరం మీద పచ్చని వస్త్రం ధరించినవాడు, పాదాల వరకు వేలాడే వనమాల ధరించినవాడు అయిన శ్రీ కృష్ణుడు ఈ వసంత ఋతువులో ఆటలలో గొప్పతనము కలిగిన అందమైన స్త్రీల సమూహములో విహరిస్తున్నాడు. ఆయనగారు ఆటలు ఆడటం వల్ల చెవులకు పెట్టుకొన్న రత్న కుండలాలు కదులుతున్నాయి. చెక్కిళ్ళ మీద ఇంకా ఏమీ ఆభరణాలు అక్కర్లేదు. ఆయన చిరునవ్వులే ఆభరణాలు.

కొత్త మేఘం వలె నీలవర్ణంతో సుందరమై ఉన్న శరీరం మీద పచ్చని బంగారు పట్టుబట్ట కప్పుకుని క్రీడలో చెవులలోని మకర కుండలాలు కదలాడడంవల్ల అందలి మణుల కాంతులతో మెరుస్తున్న చెక్కిళ్లు గల శ్రీకృష్ణుడు ముగ్ధ గోపికలతో విహరిస్తున్నాడు.

**2. చరణం: భావార్థం**

బృందావనంలో వసంత కాలంలో శ్రీకృష్ణుడు గోపికలతో కూడి రాసక్రీడ జరుపుతుండగా, ఒక గోపిక ఆయన పట్ల చూపించే గాఢమైన అనురాగాన్ని, పరవశత్వాన్ని సఖి (చెలికత్తె) రాధకు వర్ణించి చెప్పే ఘట్టమిది.

**పీన పయోధర భార భరేణ హరిం పరిరభ్య సరాగం ।**

**గోప వధూరనుగాయతి కాచిదుదంచిత పంచమ రాగమ్ ॥ 2 ॥**

ప్రతిపదార్థం: కాచిత్ = ఒకానొక; గోప వధూః = గోపకాంత (గోపిక); పీన పయోధర భార భరేణ = నిండిన / బరువైన స్తన భారము యొక్క ఒత్తిడితో (గాఢమైన ఆలింగన భారంతో); సరాగం = అనురాగముతో / ప్రేమపూర్వకంగా; హరిం = శ్రీకృష్ణుడిని; పరిరంభ్య = గట్టిగా కౌగిలించుకొని (ఆలింగనం చేసుకుని); ఉదంచిత పంచమ రాగమ్ = అత్యున్నత స్థాయిలోని పంచమ స్వరాన (పంచమ రాగంలో); అనుగాయతి = ఆయనతో పాటుగా (లేదా ఆయనను అనుసరిస్తూ) మధురంగా పాడుతోంది.

విశేషాలు - సాహిత్య సౌందర్యం & శబ్దాలంకారం: జయదేవుడు ఇందులో వాడిన పదబంధాలు (పీనపయోధర భార భరేణ... పరిరంభ్య సరాగం) కవిత్వానికి విశేషమైన శ్రవణ సుభగత్వాన్ని, అనుప్రాస సౌందర్యాన్ని తెచ్చిపెట్టాయి.

పంచమ స్వర ప్రాధాన్యం: సంగీత శాస్త్రంలో 'పంచమ స్వరం' అనురాగానికి, వసంత కోకిల కూజితానికి సంకేతం. వసంత ఋతువులో గోపికల ప్రేమాతిశయాన్ని తెలపడానికి కవి "ఉదంచిత పంచమ రాగమ్" అని వర్ణించారు. పంచమ రాగాన్ని హాస్య శృంగార రసాలలో ఉపయోగిస్తారు. అందుకే కృష్ణ శృంగారంలో మైమరచిన గోపిక పంచమ స్వరాన్ని పాడుతోందని కవి భావన. సరిగమపదని స్వరాలలో అయిదవది పంచమస్వరం. నాభి, ఉరస్సు, హృదయం, కంఠం, శిరస్సు అనే అయిదు స్థానాలలో పుట్టింది కనుక దీనిని పంచమమంటారని ఒక అర్థం. కోయిలల చేత విస్తరింప జేయబడేది కనుక పంచమమని ఇంకో అర్థం! (2వ చరణం)

భక్తి తత్త్వార్థం: పైకి ఇది శృంగార రసార్ద్రమైన కౌగిలింతగా కనిపించినా, ఆధ్యాత్మికంగా ఇది జీవాత్మ (గోపిక) – పరమాత్మ (శ్రీకృష్ణుడు) ల సంపూర్ణ సమాగమానికి, లయత్వానికి అద్వైత ప్రతీక.

తాత్పర్యం: ఒక గోపిక శ్రీకృష్ణునిపై గల గాఢమైన అనురాగంతో పరవశించిపోయి, ఆయనను తన హృదయానికి హత్తుకుని గట్టిగా ఆలింగనం చేసుకుంది. అలా ఆయనను కౌగిలించుకుని, అత్యంత శ్రావ్యమైన పంచమ స్వరంలో (కోకిల స్వరము వంటి మధురమైన రాగంలో) శ్రీకృష్ణునితో కలిసి గానం చేస్తోంది.

**3. చరణం: భావార్థం**

రాసక్రీడలో శ్రీకృష్ణుడు అనేక మంది గోపికలతో కూడి లీలలు నెరపుతుండగా, మదన వికారంతో ఒక గోపిక ఆయన ముఖారవిందాన్ని చూస్తూ ఏ విధంగా ధ్యానంలో మునిగిపోయిందో సఖి రాధకు వర్ణించి చెబుతున్న సందర్భమిది.

**కాఽపి విలాస విలోల విలోచన ఖేలన జనిత మనోజం ।**

**ధ్యాయతి ముగ్ధ వధూరధికం మధుసూదన వదన సరోజమ్ ॥ 3 ॥**

ప్రతిపదార్థం: కా అపి = ఒకానొక; ముగ్ధ వధూః = సుందరియైన గోపిక; విలాస = విలాసవంతంగా / శృంగార భావంతో; విలోల = చంచలమైన (కదులుతున్న); విలోచన = కన్నుల యొక్క; ఖేలన = కదలికల/ఆటల చేత; జనిత = పుట్టించబడిన; మనోజమ్ = మన్మథుని యొక్క వికారం (కామ భావం) కలదై; మధుసూదన = మధు అనే రాక్షసుడిని సంహరించిన శ్రీకృష్ణుని యొక్క; వదన సరోజమ్ = పద్మం వంటి (కమలం వంటి) ముఖాన్ని; అధికమ్ = మిక్కిలి ఏకాగ్రతతో / తన్మయత్వంతో; ధ్యాయతి = ధ్యానం చేస్తోంది (తన మనస్సు నందే నిలుపుకొని చూస్తోంది).

**విశేషాలు**

శబ్దాలంకారం (అనుప్రాస): "విలాస - విలోల - విలోచన" మరియు "వదన - సరోజమ్" అనే పద ప్రయోగాల్లో ఉన్న అనుప్రాసము నాద సౌందర్యాన్ని, శ్రవణ పేయతను అద్భుతంగా పండించింది.

కన్నుల విలాసం: శ్రీకృష్ణుని కడకంటి చూపులు (విలోచన ఖేలన) గోపికల హృదయాలలో మన్మథ వికారాన్ని రగిల్చే శక్తినే కాక, లీలా మాధుర్యాన్ని కూడా నింపుతాయని కవి వర్ణించారు.

ఆధ్యాత్మిక అంతరార్థం: భక్తి మార్గంలో "రూప ధ్యానం" అత్యంత ప్రాధాన్యమైనది. గోపిక శ్రీకృష్ణుని వదన కమలాన్ని ధ్యానించడం అంటే భక్తుడు భగవంతుని దివ్య మంగళ రూపాన్ని తన అంతరంగంలో స్థిరపరచుకోవడానికి సంకేతం.

తాత్పర్యం: ఒక ముగ్ధ గోపిక, శ్రీకృష్ణుడి చంచలమైన కన్నుల విలాసవంతమైన కదలికలు చూసి తనలో మన్మథ వికారం (గాఢమైన ప్రేమభావం) ప్రకోపించగా... పరవశించిపోయి, ఆ మధుసూదనుని కమలం వంటి సుందరమైన ముఖారవిందాన్ని ఏకాగ్రతతో ధ్యానం చేస్తూ, ఆ రూపాన్నే తన హృదయంలో ధ్యానిస్తోంది.

ఒక గోపిక కృష్ణుడి నేత్ర విలాసం వల్ల, మోహ వశురాలై, మైమరచి, అతడి ముఖాన్నే చూస్తోంది. మరొక గోపిక కృష్ణుడిని, ఆలింగనం చేసుకుంటోంది, మరియొక గోపిక జలక్రీడలకు కృష్ణుడిని ఆహ్వానిస్తోంది. ఒక యువతి, అతని వేణు గానానికి అనుగుణంగా, గాజుల చప్పుడుతో నృత్యం చేస్తూ, అతడి మెప్పు పొందుతోంది.

**4. చరణం: భావార్థం**

రాసక్రీడలోని మధుర ఘట్టంలో ఒక గోపిక శ్రీకృష్ణుడితో రహస్యంగా మాట్లాడాలనే నెపంతో ఆయనకు సమీపంగా వచ్చి, ఏ విధంగా తన అనురాగాన్ని వ్యక్తపరిచిందో సఖి రాధకు వర్ణించి చెబుతున్న సందర్భమిది.

**కాఽపి కపోల తలే మిలితా లపితుం కిమపి శ్రుతి మూలే ।**

**చారు చుచుంబ నితంబవతీ దయితం పులకై రనుకూలే ॥ 4 ॥**

ప్రతిపదార్థం : కా అపి = ఒకానొక; నితంబవతీ = నిండైన / అందమైన నితంబములు (నడుము క్రింది భాగం) కలిగిన గోపిక; కిమ్ అపి = ఏదో ఒక రహస్య విషయాన్ని; శ్రుతి మూలే = చెవి మొదట్లో (చెవి దగ్గర); లపితుమ్ = చెప్పుటకు (చెవిలో గుసగుసలాడుటకు); కపోల తలే = (శ్రీకృష్ణుని) చెక్కిలి / గండస్థలం వద్ద; మిలితా = చేరినదై / తన చెక్కిలిని ఆయన చెక్కిలితో ఆనించి; పులకైః = పులకాంకురములతో (రోమాంచంతో); అనుకూలే = (తన యందు) అనుకూలుడైన / దయగలవాడైన; దయితమ్ = ప్రియుడైన శ్రీకృష్ణుడిని; చారు = సుందరముగా / శ్రావ్యముగా; చుచుంబ = చుంబించింది (ముద్దు పెట్టుకుంది).

విశేషాలు - శృంగార హాస ప్రయోగాలు: గోపిక నేరుగా ముద్దుపెట్టుకోకుండా, "చెవిలో గుసగుసలు చెప్పడం" అనే వ్యాజ్యం (నెపం) ద్వారా కృష్ణునికి సమీపంగా రావడం కవి యొక్క చాతుర్యానికి, నాయిక యొక్క శృంగార లీలకు అద్దం పడుతోంది.

సాహిత్య సౌందర్యం: "కపోల తలే మిలితా", "శ్రుతి మూలే - చారు చుచుంబ" వంటి పదబంధాలు శ్రవణ పేయమైన అనుప్రాసతో, లలితమైన పదావళితో నాద సౌందర్యాన్ని ప్రసరింపజేస్తాయి.

సాత్విక వికారం (పులకలు): ఇక్కడ వాడిన "పులకైః" అనేది అష్ట సాత్విక భావాలలో ఒకటైన రోమాంచాన్ని (పులకరింతను) సూచిస్తుంది. ఇది భగవంతుని దివ్య స్పర్శ వల్ల జీవాత్మ పొందే తన్మయత్వానికి సంకేతం.

తాత్పర్యం: పీన నితంబాలు గల ఒక సుందరియైన గోపిక, ప్రియుడైన శ్రీకృష్ణుడి చెవిలో ఏదో ఒక రహస్యం చెప్పాలనే నెపంతో ఆయన చెక్కిలికి తన చెక్కిలిని ఆనించి దగ్గరగా వచ్చింది. తన పట్ల అనుకూలుడై ప్రవర్తిస్తున్న ఆ కృష్ణుని సాన్నిధ్యంతో శరీరం నిండా పులకాంకురాలు తొడగగా, పరవశించిపోయి ఆయనను అత్యంత మనోహరంగా ముద్దు పెట్టుకుంది.

**(సశేషం)**

# తిరుమల సర్వస్వం

ధారావాహికం

– పల్లపోతు వాణిశ్రీ



గత సంచిక తరువాయి

## రథోత్సవం

బ్రహ్మోత్సవాల యందు గరుడవాహనం తర్వాత అత్యంత వైభవంగా జరిగే ''రథోత్సవం''లో భక్తులు తేరు (రథం) యొక్క పగ్గాలను పట్టి లాగుతూ, ఉత్సవంలో ప్రత్యక్షంగా పాల్గొనటం వల్ల ఇది అత్యంత జనాకర్షకమైన వాహనోత్సవంగా ప్రసిద్ధి గాంచింది. తక్కిన వాహన సేవలన్నింటిలో భక్తులు కేవలం చూసి తరించగలరే కానీ, ప్రత్యక్షంగా పాలు పంచుకొనే అవకాశం లేదు.

బ్రహ్మోత్సవాలలో ఎనిమిదవ రోజు ఉదయం ఉదయభానుని కిరణకాంతులలో, వివిధ వర్ణాల పరిమళ పుష్పాలతో అలంకృతమై మేరుపర్వత చందంగా ఉన్న రథంపై, శ్రీదేవి-భూదేవి సమేతులైన మలయప్పస్వామివారు మాడవీధుల్లో విహరిస్తారు. ఈరోజు శ్రీవారి వాహనం అశ్వసమానమైన వేగంతో దౌడు తీస్తుంది. స్వయంగా పాల్గొనే అవకాశం రావడంతో, భక్తులు రెట్టించిన ఉత్సాహంతో కర్పూరనీరాజనాలు సమర్పిస్తూ, కోలాట నృత్యాలతో దిక్కులు పిక్కటిల్లేలా గోవిందనామ సంకీర్తనలు ఆలపిస్తూ, తమ అచంచలమైన భక్తిని, ఆధ్యాత్మిక ఆనందాన్ని వ్యక్తం చేస్తారు.

అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం దేవాలయ సిబ్బంది వారిస్తున్నప్పటికీ, నడుస్తున్న రథంపై భక్తులు ఉప్పు, మిరియాలు చల్లటం ఈ ఉత్సవంలో మరో ప్రత్యేకత.

పురాణేతిహాసాలలో రథాలకు ఎనలేని ప్రాధాన్యం ఉంది. ప్రాచీనకాలంలో కాల్బలం, అశ్వబలం, గజబలంతో పాటుగా రథబలానికి కూడా చతురంగబలాల్లో సముచితమైన స్థానం ఉండేది. అనాదికాలం నుండి యుద్ధవిద్యల్లో రథసంచాలనం కూడా ఒకటి. కేవలం యుద్ధాలకే కాకుండా వేటకు, విహారానికి, వ్యాహ్యాళికి కూడా రథాలను విరివిగా ఉపయోగించేవారు. రథాలకు, వాటి సారథులకు, గుర్రాలకు, చిత్రవిచిత్రమైన పేర్లుండేవి. ఉదాహరణకు సూర్యుని రథం పేరు ''సప్త''. అలాగే కృష్ణుని రథసారథి పేరు ''దారుకుడు''. శైబ్యము, సుగ్రీవము, మేఘపుష్పము, వలాహకము అనేవి కృష్ణుని యొక్క నాల్గు గుర్రాల పేర్లు.

రథాలకు యుద్ధాలకు అవినాభావ సంబంధం ఉంది. యుద్ధవిన్యాసాలలో, యోధుల యొక్క శక్తి సామర్థ్యాలను బట్టి వాటిని రథి, అతిరథి, మహారథి, అతిమహారథి, మహా మహారథిగా వర్గీకరించేవారు. ''రథి'' అంటే, రథారూఢుడై ఏకకాలంలో ఐదువేల మంది యోధులతో యుద్ధం చేయగల సమర్థుడు. ''మహా మహారథి'' అత్యధికంగా 20 కోట్ల 73 లక్షల 60 వేల మందితో ఒకేసారి యుద్ధం చేయగలిగినవాడు. ఉదాహరణకు ఉపపాండవులు, శకుని మొదలైనవారు. ''రథి'' కోవలోనికి వస్తే, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడు, దుర్గాదేవి, గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరుడు ''మహా మహారథులు''.

దేవాలయాల ఉత్సవ వేడుకలలో కూడా రథాలకు చెప్పుకోదగ్గ పాత్ర ఉంది. దాదాపు అన్ని ప్రాచీన ఆలయాలలోనూ, ఈనాడు



కూడా రథాన్ని, రథ మండపాన్ని మనం చూస్తాం. ఆగమ శాస్త్రానుసారం వైదికకర్మలు జరిగే ప్రతి ఆలయంలోనూ, రథోత్సవం నేడూ ఓ తప్పనిసరి వేడుక. జగద్విదితమైన అత్యంత వైభవోపేతంగా జరిగే పూరీ జగన్నాథుని రథయాత్ర గురించి ప్రత్యేక పరిచయం అక్కరలేదు.

''రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే'' రథంలో వేంచేసి ఉన్న విష్ణుదేవుని దర్శనం పునర్జన్మ రాహిత్యాన్ని కలిగిస్తుందనే విశ్వాసంతో భక్తులు రథోత్సవంలో ఉత్సాహంగా పాల్గొంటారు.

స్వతహాగా యోధానయోధుడు, భక్తజన పరిపాలకుడు, మృగయావినోదుడు (వేట యందు ఆసక్తి గలవాడు), విహారప్రియుడు అయినటువంటి స్వామివారికి, రథంతో సహజంగానే ఎంతో అనుబంధం ఉంది. నేడు ''రథికుడు'' అయిన స్వామివారు, కృష్ణావతారంలో అర్జునునికి ''రథసారథి''. ఈనాటి రథోత్సవం ద్వారా ఆ అనుబంధాన్ని శ్రీవారు లోకాలకు చాటి చెప్తున్నారు.

రథోత్సవానికి ఓ విశిష్టమైన ఆధ్యాత్మిక పరమార్థం ఉంది. కఠోపనిషత్తులో ఆత్మకు, శరీరానికి ఉండే సంబంధం రథసారూప్యతతో వివరించడం జరిగింది. ''బుద్ధి'' అనే సారథి సంచాలనంలో ''మనస్సు''ను పగ్గాలుగా చేసుకుని ''ఇంద్రియాల''నబడే గుర్రాల సాయంతో చరిస్తున్న ''శరీరమ''నే రథాన్ని, ''ఆత్మ'' అనే రథికుడు అధిరోహిస్తాడు. ఈ రకంగా శరీరాన్ని రథంతో పోల్చడం వల్ల, స్థూల-సూక్ష్మ శరీరాలు వేరని, ఆత్మ ఆ రెండింటికీ భిన్నమనే ఆధ్యాత్మిక విచక్షణాజ్ఞానం కలుగుతుంది.

రథోత్సవాన్ని వర్ణిస్తూ, అన్నమయ్య, సకల జీవులలో అంతర్యామిగా ఉన్న పరమాత్మ తన రథాన్ని తానే సంచాలనం చేస్తున్నాడని పేర్కొన్నాడు.

**దేవదేవుడెక్కినదె దివ్య రథము**
**మా వంటి వారికెల్ల మనోరథము**
**మిన్ను నేలా నొక్కటైన మేటి తేరు**
**కన్నుల పండువైన శ్రీకాంతుని తేరు**

## అశ్వవాహనోత్సవం

**గక్కున నయిదవనాడు గరుడునిమీదను**
**యెక్కెను ఆరవనాడు యేనుగుమీద**
**చొక్కమై ఏడవనాడు సూర్యప్రభలోను**
**యిక్కున దేరును గుర్ర మెనిమిదోనాడు**

బ్రహ్మోత్సవాలలో ఎనిమిదవ రోజు రాత్రి మలయప్ప స్వామివారు ఒంటరిగా, కలిపురుషుని వేషధారణలో, శిరస్త్రాణ భూషితుడై, నడుముకు కత్తి, డాలు ధరించి, ఒక చేతి యందు ఛర్నాకోల, మరోచేతితో గుర్రపు పగ్గాలు చేబూని, యుద్ధానికి సిద్ధంగా ఉన్న వీరాధివీరుని వలె, అశ్వవాహనంపై రాచఠీవి ఉట్టిపడేలా ఊరేగుతారు.

ఆశ్వానికి చారిత్రక, పౌరాణిక, ఆధ్యాత్మిక, సమకాలీన ప్రాశస్త్యం విశేషంగా ఉంది. వేగానికి ప్రతీక అయిన అశ్వం చతురంగ బలాలలో ప్రధానమైనది. యుద్ధాలలో సైనికులు గుర్రాల నెక్కి యుద్ధం చేస్తుండగా, దళాధిపతులు, రారాజులు తమ తమ హోదాలను బట్టి అశ్వాలను పూన్చిన రథాలపై నుండి సమరం సాగించేవారు. విశ్వాసానికి మారుపేరైన అశ్వరాజాలు తమ యజమానులను కాపాడటం కోసం, తమ ప్రాణాలను పణంగా పెట్టిన ఉదంతాలు చరిత్రలో కోకొల్లలుగా ఉన్నాయి.

పురాణేతిహాసాల ననుసరించి శ్రీహరి శ్రీనివాసునిగా భూలోకంలోని వేంకటాచలం చేరి పద్మావతీదేవిని పరిణయమాడటం కోసం వేట నెపంతో, ఖడ్గధారియై, అశ్వం మీద నారాయణ వనానికేతెంచారు. క్షీరసాగర మథనంలో పుట్టిన ఉచ్చైశ్రవం అనే అశ్వరాజాన్ని ఇంద్రుడు తన వాహనంగా స్వీకరించాడు. శ్రీమహావిష్ణువు యొక్క జ్ఞానావతారాలలో మొదటిది ''హయగ్రీవుని'' అవతారం. హయగ్రీవుడంటే ''గుర్రం ముఖం కలిగిన దైవం'' అని అర్థం.

హయగ్రీవునికి గుర్రం ముఖం ఉండటం వెనుక ఓ ఆసక్తికరమైన కథ ఉంది. ఒకానొకప్పుడు పదివేల ఏండ్ల పాటు నిర్విరామంగా రాక్షసులతో యుద్ధం చేసి అలసిపోయిన

శ్రీమహావిష్ణువు అల్లెత్రాడుతో (వింటినారితో) ఇరుకొనలూ బిగించి కట్టబడిన ''శార్ఙ్గం'' అనబడే ధనుస్సు యొక్క ఒక కొనను నేలపై నుంచి, మరొక కొనపై గడ్డాన్ని ఆన్చి, నిలబడి ఉండే నిద్రపోతాడు (''... శార్ఙ్గధన్వా గదాధరః'' అన్న 107 వ విష్ణుసహస్ర నామ శ్లోకాన్ని స్మరణకు తెచ్చుకుందాం). ఆయనను నిద్ర నుండి మేల్కొలపటానికి దేవతలు భయపడుతుంటే బ్రహ్మదేవుని ఆజ్ఞ మేరకు ''వమ్రి'' (చెదపురుగు), వింటినారిని కొరికి శ్రీహరికి నిద్రాభంగం కావించే ప్రయత్నం చేస్తుంది. కానీ, దురదృష్టవశాత్తూ వింటినారి తెగడంతో, ధనుస్సు యొక్క కోపు అతివేగంగా వెళ్ళి విష్ణువు యొక్క తలను ఛేదించగా, ఆ శిరస్సు వెళ్ళి ముల్లోకాలకు ఆవల పడుతుంది. ఈ హఠాత్సంఘటనకు నివ్వెరపోయిన దేవతలు, లక్ష్మీదేవి యానతి ననుసరించి, ఓ అశ్వరాజాన్ని వధించి దాని శిరస్సును తీసుకొని వస్తారు. దేవశిల్పి గుర్రం తలను విగతజీవియైన విష్ణుమూర్తి మొండానికి అతికించగా, బ్రహ్మదేవుడు తిరిగి ప్రాణం పోస్తాడు. ఇదంతా, లోకకళ్యాణార్థం, పూర్వపు యుగాల శాపాలు-వరాల ననుసరించి జరుగుతుంది.

సమస్త విద్యలకు అధిదేవత అయినటువంటి హయగ్రీవుని ఆలయం, ఉత్తరమాడవీధి చివరిభాగంలో, స్వామిపుష్కరిణి యొక్క ఈశాన్యదిశకు ఎదురుగా స్థితమై ఉంది.



బ్రహ్మోత్సవాలలో మొట్టమొదటిదైన ''పెద్దశేషవాహనం'' కుండలినీయోగానికి ప్రతీక అయితే, చిట్టచివరిదైన ''అశ్వవాహనం'' ఓంకారానికి సంకేతం.

అసమాన శక్తికి, శారీరక దృఢత్వానికి కూడా అశ్వం పేర్గాంచింది.

ఆధునికయుగంలో యంత్రశక్తిని ''హార్స్ పవర్'' లేదా ''అశ్విక శక్తి''తో గణించటం మనందరికీ విదితమే.

దాదాపు నూరు సంవత్సరాల పూర్వం వరకూ, బ్రహ్మోత్సవాలకై ఆహ్వానం పలకడంలోనూ అశ్వరాజాల పాత్ర ఎంతగానో ఉండేది. ఉత్సవ ప్రారంభానికి దాదాపు రెండు నెలల ముందుగానే బ్రహ్మోత్సవ చిహ్నమైన ధ్వజాన్ని చేబూని, 24 అశ్వికదళాలు మేళతాళాలు మ్రోగించుకుంటూ, ఉత్సవాలకై అట్టహాసంగా సమస్త జనులకూ ఆహ్వానం పలుకుతూ అన్ని దిక్కులలో బయలుదేరేవి. వారి తిరుగు ప్రయాణంలో ఉత్సవాలకు విచ్చేసే భక్తజనులందరూ వారి వారి వాహనాలలో అశ్వికదళాల ననుసరిస్తూ, వారి రక్షణలో తిరుమల క్షేత్రానికి చేరుకునేవారు. రాలేని భక్తులు వారి వారి కానుకలను అశ్వదళం ద్వారా శ్రీవారికి పంపేవారు.

విష్ణుమూర్తి యొక్క దశావతారాలలో చిట్టచివరిది ''కల్కి'' అవతారం. కలియుగాంతంలో కల్కిభగవానుడు ఖడ్గం చేబూని, అశ్వవాహనం ఎక్కి, దుష్టసంహారం గావించి ధర్మాన్ని పునరుద్ధరించుతాడని పురాణాలు చెబుతున్నాయి.

శ్రీకృష్ణదేవరాయలు తన ''ఆముక్తమాల్యద'' గ్రంథంలో కల్కి అవతారం గురించి విశదంగా వర్ణించాడు.

అశ్వం వేగానికి ప్రతీక అయితే, మనస్సు దానికంటే వేగవంతమైనది. హరిని తలచినంతనే జ్ఞానచక్షువులు వైకుంఠాన్ని దర్శిస్తాయి. ఇంద్రియాలను ఆలవాలంగా చేసుకొని మనస్సు అత్యంత వేగంతో పరిభ్రమిస్తుంది. అందుకే ''మనోవేగము'' అన్న నానుడి వాడుకలోకి వచ్చింది. అశ్వారూఢుడై ఊరేగుతున్న స్వామి నిరంతర సాధనతో ఇంద్రియాలపై విజయం సాధించి, దాని ద్వారా మనస్సు యొక్క వేగాన్ని నియంత్రించి పరమాత్మపై లగ్నం చేయాలని ఉపదేశిస్తున్నారు. యుగాంతంలో తాను జరుపబోయే దుష్టశిక్షణ కార్యక్రమానికి నాందీ ప్రస్తావన కూడా ఇప్పుడే పలుకుతున్నారు.

''కలి'' అనే శబ్దానికి పుణ్యం అని అర్థం. కృతయుగంలో ఒక సంవత్సరం పాటు చేసేటటువంటి తపస్సు, త్రేతాయుగంలో చేసినటువంటి యజ్ఞాలు, ద్వాపరయుగంలో కావించినటువంటి అర్చనలు, వీటి ద్వారా ఎంత ఫలితం వస్తుందో, అంతే ఫలితం కలియుగంలో ఒక్కరోజు, ఒక్క గంట నిశ్చలమైన మనస్సుతో భగవద్ధ్యానం చేస్తే వస్తుందట.

అందుకే కలియుగం అంత గొప్పది. ఈ యుగంలో జన్మించిన మనం పరమాత్మను సేవించుకుంటూ, కలిపురుషుని రక్షణలో, జన్మను సార్థకం చేసుకోవాలి. ధర్మానికి ఎప్పుడు హాని కలుగుతుందో, నిజమైన ధార్మికులు ఎప్పుడైతే కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతారో, అప్పుడు దుష్టశిక్షణకు కల్కి భగవానుడు అవతరిస్తాడని అశ్వవాహనం ద్వారా తెలుప బడుతోంది.

నీవు తురగము మీద నేర్పు మెరయ
వేవేలు రూపములు వెదచల్లి తపుడు
పదిలముగ నిరువంక పసిడి పింజల యంప
పాదల తరకసములొరవులు నెరపగా
గదయు శంఖము చక్రము ధనుఃఖడ్గములు
పదివేలు సూర్యబింబము లైనపుడు
("తురగము" అంటే అశ్వము)

## పల్లకి మరియు తిరుచ్చి ఉత్సవాలు

బ్రహ్మోత్సవాల్లో తొమ్మిదవ మరియు చివరిరోజు తెల్లవారు ఝామున మూడు గంటల నుంచి ఆరు గంటల వరకు చక్రస్నానానికి ముందుగా దేవాలయంలో పల్లకి ఉత్సవం మరియు తిరుచ్చి ఉత్సవం జరుగుతాయి.

తొమ్మిది రోజుల బ్రహ్మోత్సవాలలో జరిగినటువంటి అన్ని సేవలు సఫలమై లోకాలన్నీ క్షేమంగా ఉండటానికి, భక్తులు సుఖశాంతులతో వర్ధిల్లడానికి, శ్రవణా నక్షత్రం నాడు ''చక్రస్నానం'' జరుగుతుంది. యజ్ఞాంతంలో క్రతుకర్త చేసే స్నానాన్ని ''అవభృథస్నానం'' అంటారు. బ్రహ్మోత్సవాలు ఓ మహాయజ్ఞమే కనుక, చివరి రోజున అవభృథస్నానం చేస్తారు. స్వామివారి సేవకుడు, పంచాయుధాల్లో ఒకరైన సుదర్శనచక్రం (లేదా చక్రత్తాళ్వార్) ఈ స్నానమాచరించటం వల్ల ఇది ''చక్రస్నానం'' అయింది.

స్వామిపుష్కరిణికి వాయువ్యభాగంలో, తిరుమల క్షేత్రంలో మొట్టమొదటిదైన ''ఆదివరాహస్వామి'' ఆలయం కొలువై ఉంది. శ్రీదేవి-భూదేవి సమేత మలయప్ప స్వామి తొమ్మిదవరోజు ఉదయం ఈ ఆలయప్రాంగణం చేరుకుంటారు. వారితో పాటుగా, వేరే పల్లకిలో చక్రత్తాళ్వార్ (సుదర్శన చక్రం) కూడా వేంచేస్తారు. మొదటగా స్వామివారికి, దేవేరులకు స్నాన వస్త్రాలు ధరింపచేసి, అర్ఘ్య, పాద్య, ఆచమనాదులు జరిపి శుద్ధోదక స్నానం చేయిస్తారు. తదుపరి, ఆవుపాలు దాని తరువాత శుద్ధజలంతో అభిషేకం జరుగుతుంది. ఆ తరువాత వరుసగా – పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపుతో – అభిషేకం చేస్తారు. ఒక ద్రవ్యంతో అభిషేకం చేసిన తరువాత ప్రతిసారి శుద్ధజలంతో విగ్రహశుద్ధి గావిస్తారు. తదనంతరం ధూప, దీప, కర్పూర నీరాజనాలు సమర్పించి; దేవతా మూర్తులకు చందన సంస్కారం, తిలకధారణ గావించి; తులసి మాలలతో అలంకరిస్తారు. వరుసగా – కుంభహారతి, నక్షత్రహారతి, సహస్రాభిషేకం – జరుపబడతాయి. ఈ వైదిక ప్రక్రియ జరుగుతున్నంతసేపు శ్రీసూక్తం, పురుషసూక్తం, భూసూక్తం పఠిస్తారు. తరువాత స్వామివారి అభిషేకజలంతో అర్చకులు తమ శిరస్సును సంప్రోక్షించుకుని, ఆ జలాన్ని భక్తుల మీద జల్లుతారు.

తదనంతరం చక్రత్తాళ్వార్ కు మాత్రమే స్వామి పుష్కరిణిలో ''చక్రస్నానం'' లేదా ''అవభృథస్నానం'' లేదా ''పవిత్రస్నానం'' జరుగుతుంది. స్థూలంగా చెప్పాలంటే, ఉత్సవవైభోగం యజమాని అయిన శ్రీవేంకటేశ్వరస్వామికి, అవభృథస్నానం సేవకుడు అయిన చక్రత్తాళ్వార్ లేదా సుదర్శన చక్రానికి అన్నమాట.

ఆ దివ్యాయుధ స్పర్శవల్ల పవిత్రమైన పుష్కరిణీ జలాల్లో భక్తులు, అర్చకులు, ఆచార్య పురుషులు, జియ్యంగార్లు అందరూ స్నానం చేసి పవిత్రులవుతారు. తరువాత స్వామివారు, దేవేరులు, చక్రత్తాళ్వార్ ఊరేగింపుగా ఆలయంలోకి పునః ప్రవేశం చేసి, యథాస్థానాన్ని అలంకరిస్తారు. శ్రవణా నక్షత్రం నాడు సుదర్శన చక్రంతో పాటుగా స్వామి పుష్కరిణిలో స్నానం చేసినవారు పూర్వజన్మల పాపాలు తొలగించుకుని సుఖసంతోషాలతో వర్ధిల్లుతారు.

శ్రవణంబునందు నా చక్రంబుతో గూడ
స్వామి పుష్కరిణిలో స్నానములను
సల్పువారలు పూర్వజన్మంబులను జేయు పాపంబులను బాసి భాగ్యవంతు
లై యిహపరములయందు సుఖింతురు
నా పల్కు నిజముగా నమ్ముడని

స్వామి పుష్కరిణిలో ఉన్న మహత్తు ఏమిటంటే మూడు దివ్యమైన మార్గాల ద్వారా అందులోకి జలం చేరుతూ ఉంటుంది.

- **మొదటిది:** భూస్పర్శ. పుష్కరిణిలో ఉన్న అనేక ఊటబావుల నుండి ఎల్లవేళలా జలం ఊరుతూ, పుష్కరిణి నిండుగా ఉంటుంది. అంటే, భూదేవి, పుష్కరిణిని నింపడానికి తనవంతు ప్రయత్నం నిర్విరామంగా చేస్తుందన్నమాట.
- **రెండవది** : ఇంద్రుని సమర్పణ. వర్షపు ధారల ద్వారా వచ్చిన నీటితో పుష్కరిణి నిండుతుంది.
- **మూడవది** : స్వర్గలోకం నుండి భువికి దిగివచ్చి స్వామిపాదాల క్రిందుగా ప్రవహిస్తూ పుష్కరిణిలో చేరుకుంటున్న ''విరజానది''.
- త్రిపథ జల సంగమమైనది కాబట్టే ఈ పుష్కరిణి పరమ పవిత్రమైనదిగా విరాజిల్లుతోంది.

- ఈ పుష్కరిణి చుట్టూ దేవతలు కొలువై ఉంటారని భక్తుల విశ్వాసం. ప్రాచీన కాలంలో ఎందరో మహర్షులు పుష్కరిణి ఒడ్డున తపస్సు చేసి సిద్ధి పొందారు. సంస్కృతంలో "నీరము" అంటే నీరు లేదా జలము అని అర్థము. ఉదకం సాక్షాత్తు ఆ శ్రీహరి స్వరూపం కనుక, ఆ స్వామి "నారాయణు"డయ్యాడు.
- ఈ సందర్భంలో తీర్థక్షేత్రాల గురించి కూడా కొద్దిగా చెప్పుకోవాలి.
- పుష్కరిణిలు, నదులు, ఏ ఇతర సహజ జల సదుపాయం లేకుండా ఉన్నటువంటి దేవాలయాన్ని క్షేత్రం అంటారు.
- దేవాలయం లేకుండా కేవలం సహజ జల సదుపాయం ఉంటే వాటిని తీర్థం అంటారు.
- పుష్కరిణి లేదా నది మరియు ఆలయం – ఈ రెండూ కలిసి ఉండే దాన్ని తీర్థక్షేత్రం అంటారు.
- తిరుమల అన్ని తీర్థక్షేత్రాలకు తలమానికం.
- దేవాలయాల్లో కూడా వాటి ఆవిర్భావాన్ని బట్టి ఐదు రకాలున్నాయి.
- భగవంతుడే "స్వయంగా " అవతరిస్తే అవి స్వయం వ్యక్త క్షేత్రాలు.
- దేవతలచే నిర్మింపబడినవి దివ్యక్షేత్రాలు.
- దేవతలచే నిర్మింపబడినవి దివ్యక్షేత్రాలు.
- పురాణ ప్రసిద్ధి గాంచినవి పురాణ క్షేత్రాలు.
- మునిపుంగవుల ద్వారా ఏర్పాటు చేయబడినవి సిద్ధక్షేత్రాలు లేదా ఆర్షములు.
- భక్తులు, రాజులచే నిర్మించబడినవి మానుష క్షేత్రాలు.
- భారతదేశంలో ఉన్న ఎనిమిది స్వయంవ్యక్త క్షేత్రాలలో తలమానికమైనది తిరుమల క్షేత్రం. జీవితంలో ఎనిమిది సార్లు తిరుమల క్షేత్రాన్ని దర్శించుకుంటే, మిగతా ఏడు స్వయం వ్యక్త క్షేత్రాలలో ఉన్న శ్రీమన్నారాయణుణ్ణి దర్శించినంత ఫలం లభిస్తుంది.
- తిరుమల క్షేత్రంలో, ఆదివరాహస్వామి ఆలయ ప్రాంగణం నందు విరాజిల్లుతున్న స్వామిపుష్కరిణిలో స్నానమాచరించటం ఎన్నో జన్మల సుకృతం. ఈ పుష్కరిణిలో సంవత్సరానికి నాలుగు సార్లు చక్రస్నానం జరుగుతుంది.
- భాద్రపద శుద్ధ చతుర్దశి – అనంత పద్మనాభ వ్రతం నాడు.
- ఇప్పుడు మనం చెప్పుకుంటున్న తొమ్మిదిరోజులు జరిగే బ్రహ్మోత్సవాలలో చివరి రోజు.
- వైకుంఠ ద్వాదశి ఉదయం.
- రథసప్తమి నాటి మధ్యాహ్నం.

స్వామివారి పరివార దేవతలైన – గరుత్మంతుడు, హనుమంతుడు, జయవిజయులు, సుదర్శనుడు – మొదలగు వారిని దర్శిస్తే స్వామివారు పరమానంద భరితుడవుతారు. అలాగే, బ్రహ్మోత్సవాల్లో ఆయన పరివార సదస్యుడైన సుదర్శన చక్రాన్ని సందర్శించుకుని వారితో పాటు చక్రస్నానం గావిస్తే స్వామివారు మరింత సంతృప్తి చెందుతారు.

**చక్రమా హరిచక్రమా వక్రమున దనుజుల వక్కలించవో ॥**
**చుట్టి చుట్టి పాతాళము చొచ్చి హిరణ్యాక్షుని**
**చట్టలు చీరిన వో చక్రమా**
**పట్టిన శ్రీహరిచేత పాయక ఈ జగములు**
**ఒట్టుకొని కావగదవో ఓ చక్రమా ॥**

## అలంకార తిరుమంజనం

ఇది వాహనోత్సవం కాదు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఉత్సవ-ఊరేగింపు కార్యక్రమాల యందు స్వామివారికి ఏదైనా తెలియని శ్రమ కలిగితే దానిని పోగొట్టి, నూతనత్వాన్ని, కాంతిమత్వాన్ని ఆపాదింపచేయటమే "స్నపనతిరుమంజన ఉత్సవం" లేదా "అలంకార తిరుమంజనం" యొక్క లక్ష్యం. ఈ సాంప్రదాయం అనాదిగా వస్తోంది.

రంగనాయక మండపాన్ని శోభాయమానంగా అలంకరించి, మొదటగా ఉత్సవర్లను స్వర్ణపీఠంపై వేంచేపు చేస్తారు. తరువాత తీర్థం (కుంకుమపువ్వు, యాలకులు, జాపత్రి, లవంగాలు, పచ్చకర్పూరం కలిపిన జలం) తో తిరుమంజనం లేక అభిషేకం చేస్తారు. ఆ తరువాత పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనంతో ఒక దాని తరువాత ఒకటిగా, జియ్యంగార్లు శంఖనిధి – పద్మనిధి బంగారుపాత్రలలో అందిస్తుండగా, కంకణ భట్టాచార్యులైన అర్చకులు ఉత్సవర్లకు అభిషేకం చేస్తారు. చివరగా సహస్రధార పాత్రతో అభిషేకం గావిస్తారు. ఒక్కో ద్రవ్యంతో అభిషేకం జరిగిన తరువాత, ఉత్సవమూర్తులకు ఒక్కోరకం – మొత్తం తొమ్మిది రకాల మాలలు, కిరీటాలు, జడలను – స్వామివారు, అమ్మవార్లకు అలంకరిస్తారు. వీటిని యాలకులు, ఎండుద్రాక్ష, వట్టివేళ్ళు, గులాబీరేకులతో; వీటితోపాటుగా కొన్నిసార్లు విలక్షణంగా శనగఫలాలు, చిక్కుడుకాయలు, చెర్రీఫలాలు, పొగడపూలు, తులసిపత్రాలతో ఆకర్షణీయంగా తయారు చేస్తారు. ప్రత్యేకంగా తయారు చేయబడిన విసనకర్ర, అద్దం, ఛత్రం వీటిని కూడా అందుబాటులో ఉంచుతారు. పోయిన సంవత్సరం విసనకర్రను ముత్యాలతో, నెమలిపింఛాలతో తయారు చేశారు. అలాగే, అద్దాన్ని ముత్యాలు-తామరపువ్వుల గింజలతో, గొడుగును మంచిముత్యాలతో రూపొందించారు.

స్నపనతిరుమంజనం జరుగుతున్నంతసేపు, మధ్య

మధ్యలో ఉత్సవమూర్తులకు నివేదనలు సమర్పిస్తారు. గత సంవత్సరం జరిగిన స్నపన తిరుమంజనంలో ఆస్ట్రేలియా, సింగపూర్ భక్తులు సమర్పించిన నారింజ; కివి; జపాన్, థాయిలాండ్, అమెరికాకు చెందిన ప్లమ్ ఫలాలు; న్యూజీలాండ్ నుండి తెచ్చిన గోల్డెన్ యాపిల్ ఫలాలు; భారతదేశంలోని సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన స్ట్రాబెర్రీ, దానిమ్మ ఫలాలను నైవేద్యంగా సమర్పించారు.

స్నపన తిరుమంజన కార్యక్రమం జరుపబడే రంగనాయక మండపాన్ని థాయిలాండ్, ఇండోనేషియా దేశాల నుండి తెప్పించిన ఆర్కిడ్స్, గ్లాడియోలస్, ఓరియంటల్ తులిప్స్ తో కన్నుల పండువగా అలంకరించారు.

## ధ్వజావరోహణం

బ్రహ్మోత్సవాల్లో తొమ్మిదవ నాటి రాత్రి ఆలయంలోని వెండి వాకిలి ముందు ''ధ్వజావరోహణం'' జరుగుతుంది.

శ్రీదేవి-భూదేవి సమేత మలయప్పస్వామి బంగారు తిరుచ్చిలో సాయంత్రం ఏడు గంటలకు ధ్వజస్తంభం వద్దకు చేరుకుంటారు. రాత్రి తొమ్మిది గంటలకు పూజాదికాలు ముగించుకుని, వేదపారాయణం చేస్తుండగా, మంగళ వాద్యాలు, భేరీనినాదాలు మార్మోగుతుండగా, ఉత్సవాలకు విచ్చేసినట్టి బ్రహ్మాది దేవతలు, అష్టదిక్పాలకులతో వీడ్కోలు చెబుతూ, మరుసటి బ్రహ్మోత్సవాలకు ఇపుడే తొలి ఆహ్వానం పలుకుతూ, గరుడకేతనాన్ని ధ్వజస్తంభం మీద నుండి అవనతం చేస్తారు. ఈ సందర్భంగా – గరుడధ్యానం, భేరీపూజ, భేరీతాడనం, గరుడగద్యం, దిక్పాలకగద్యం, గరుడలగ్నాష్టకం, గరుడచూర్ణిక – అనే ఏడు మంత్రాలను



జపించి, బ్రహ్మోత్సవాలు ముగిసినట్లుగా అర్చకస్వాములు ప్రకటిస్తారు.

ఈ విధంగా గరుడకేతనాన్ని ఎగురవేస్తూ ముల్లోక వాసులను ఆహ్వానించడంతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు, గరుడధ్వజాన్ని దించివేస్తూ అతిథులందరికీ వీడ్కోలు చెప్పడంతో పరిసమాప్తి అవుతాయి. ఈ వీడ్కోలు పర్వాన్ని అన్నమయ్య అత్యంత సహజంగా, హృద్యంగా, ఆప్యాయంగా, ఆహూతులందరికీ పేరు పేరునా వీడ్కోలు చెబుతూ, ఈ విధంగా వర్ణించాడు.

**భోగీంద్రులును మీరు పోయి రండు**
**వేగనమీదటి విభవాలకు ॥**
**హరుడ పోయిరా అజుడ నీవునుంబోయి**
**తిరిగి రా మీదటి తిరునాళ్ళకు**
**సురలు మునులును భూసురులు పోయిరండు**
**అరవిరి నిన్నాళ్ళు అలసితిరి ॥**

బ్రహ్మోత్సవాల్లో తెలియక జరిగిన లోటుపాట్లకు, తప్పిదాలకు ప్రాయశ్చిత్తంగా, క్షమాభిక్ష కోరుతూ, అంగరంగవైభవంగా, టన్నుల కొద్దీ పువ్వుల నుపయోగించి, చక్రస్నానానికి సరిగ్గా నెల రోజుల తరువాత, కార్తీక మాసంలో వచ్చే శ్రవణా నక్షత్రంలో, సంపంగి ప్రాకారంలోని కళ్యాణోత్సవ మండపంలో జరిగే ''పుష్పయాగం'' గురించి శ్రీవారి సంవత్సరోత్సవాల వివరణలో ఇంతకుముందే తెలుసుకున్నాం.

శ్రీకృష్ణుడు అర్జునునితో తన విభూతులను తెలుపుతూ ఇలా అంటాడు. ''అర్జునా! నేను జ్యోతిస్స్వరూపాలలో సూర్యుణ్ణి. నక్షత్రాలలో చంద్రుణ్ణి. పర్వతాలలో హిమాలయాన్ని. వృక్షాలలో కల్పవృక్షాన్ని. అశ్వాలలో ఉచ్చైశ్రవాన్ని. గజాలలో ఐరావతాన్ని. గోవులలో కామధేనువుని. నాగులలో అనంతుణ్ణి. మృగాలలో సింహాన్ని. పక్షుల్లో గరుత్మంతుణ్ణి'' అని సెలవిచ్చాడు. మాడవీధుల్లో జరిగిన సూర్యప్రభ, చంద్రప్రభ, కల్పవృక్ష, గరుడ, పెద్దశేష, అశ్వ, గజ వాహనాలన్నీ శ్రీకృష్ణభగవానుని విభూతులన్నింటినీ ఒక్కటొక్కటిగా విశదపరుస్తున్నాయి.

మరో కోణంలో చూస్తే, బ్రహ్మోత్సవాలు సత్య, త్రేత, ద్వాపర, కలియుగాలలో జరిగినటువంటి భాగవత, రామాయణ, భారత పౌరాణిక ఇతిహాసాలు మరియు సమకాలీన సంఘటనల సమాహారం. అంతటి మహా మహిమాన్వితమైన బ్రహ్మోత్సవాల్లో పాల్గొనటం లేదా పఠనం చేయటం లేదా శ్రవణం చేసి తరించటం జన్మ జన్మల సుకృతం.

బ్రహ్మోత్సవాలు సుసంపూర్ణం

**(ఇంకా ఉంది)**

# భవ్యమైన మాసం – భాద్రపదమాసం

: చింతలపాటి శివశంకరశాస్త్రి



శ్లో॥ "లక్ష్మీనాథం కమలనయనం హారకేయూర భూషం
సర్వవ్యాప్తం బహుగుణ భారం దోషదూరం దయాబ్ధిమ్
స్వానాం తాపత్రయ హర మజం నిర్విశేషం విశేషం
లోకాతీతం పురుషమతులం భావయామీష్ట దేవమ్"

పూర్వాభాద్ర లేక ఉత్తరాభాద్ర నక్షత్రంతో కూడిన పున్నమి గల మాసమును భాద్రపద మాసం అంటారు. ప్రజలందరికీ భద్రమును కలిగించు మాసము కనుక ఈ మాసమును భాద్రపద మాసము అంటారు.

భారతదేశం కర్మభూమి, ధర్మభూమి, తపోభూమి. ధార్మికపరమైన కర్మలకు ప్రాధాన్యత ఇవ్వబడిన దేశం. భగవంతుని అవతారాలు, దేవీ దేవతల మహత్తులు, ఋషులు, మునుల, యోగుల దివ్య మహాత్మ్యాలకు గొప్ప విలువ ఇవ్వబడింది.

'భవ్యము' అనగా శుభము నొసంగునది అని అర్థము. భాద్రపద మాసంలోని నోములు, వ్రతాలు మున్నగునవి శుభమును కలిగించి ఆనందాన్ని కలిగిస్తాయి. ''తిథేశ్చ శ్రియమాప్నోతి'' అనగా తిథులు శ్రేయస్సును కలిగింప చేస్తాయి. అందువలన భాద్రపద మాసంలో గానీ, మరి ఏ ఇతర మాసంలో గాని తిథులు సర్వసిద్ధిప్రదములు. అందువలన ఆయా తిథులలో వచ్చు నోములు, వ్రతాలు మున్నగు వాటిని ఆచరించిన వారికి శుభాలను కలిగిస్తాయి.

భాద్రపద శుద్ధ పాడ్యమినాడు 'మహత్తమ' అను వ్రతాన్ని ఆచరిస్తారు. ఆ రోజు శివుని బంగారు ప్రతిమను చేయించి, దానిని కలశం మీద ఉంచాలి. పూజ చేసిన తర్వాత నలుబది ఎనిమిది ఫలములను గాని, మోదకములతో గాని శివునికి నైవేద్యము పెట్టాలి. నైవేద్యమును పెట్టిన వానిలో పదహారు ఫలములు/ మోదకములను దేవతలకు, పదహారింటిని బ్రాహ్మణులకు సమర్పించాలి. మిగిలిన పదహారింటిని కుటుంబ సభ్యులు ప్రసాదంగా స్వీకరించాలి. అనంతరం పాలను అధికముగా నొసగు ధేనువుని బ్రాహ్మణులకు దానమివ్వాలి. ఆనాడు ఒకపూట మాత్రమే భోజనం చేయాలి. ఈ వ్రతాన్ని ఆచరించినవారు సకల భోగాలను అనుభవించి, అంతమున శివ సాన్నిధ్యమునకు వెళతారు.

భాద్రపద శుక్ల విదియనాడు వరాహ జయంతిని ఆచరిస్తారు. హిరణ్యాక్షుని వధించి యజ్ఞ వరాహస్వామి సముద్రము నుండి భూమిని ఉద్ధరించి, తన కోరపై ధరించిన

వరాహస్వామిని పూజించి, పండ్లను నైవేద్యమును పెట్టి ఆశీర్వాదమును పొందాలి. అలాగే భూమాతను పూజించి ఆ తల్లి ఆశీర్వాదమును పొందాలి.

భాద్రపద తదియ నాడు సౌభాగ్యవంతులైన స్త్రీలు, కన్యలు, ఉమా మహేశ్వరుల ప్రతిమలను పూజమంటపంలో ఉంచి నమస్కరిస్తూ సంకల్పం చెప్పుకోవాలి. ''మమ ఉపాత్త ఉమా మహేశ్వర సాయుజ్య సిద్ధయే ఉమా మహేశ్వర వ్రతమహం కరిష్యే'' – తరువాత ధూపము, దీపము, నైవేద్యములతో పూజలు చేయాలి.

శ్లో ॥ "దేవదేవి ఉమాగౌరి త్రాహిమాం కరుణానిధే
మమాపరాధాః క్షంతవ్యా భుక్తి ముక్తి ప్రదాభవ"

అని ప్రార్థించాలి. ఆ రోజంతా నిరాహారంగా ఉండాలి. మరునాడు ఉద్యాపన చేయాలి. ఈ వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో ఆచరించినవారి మనోభీష్టాలు నెరవేరుతాయి. ఈ రోజుననే ప్రసిద్ధికెక్కిన పదహారు కుడుముల తద్ది నోమును స్త్రీలు భక్తి శ్రద్ధలతో ఆచరిస్తారు. ఈ వ్రతమును ఆచరించువారు వ్రతానంతరం వ్రతకథను వినాలి. అక్షింతలను తలపైన ధరించాలి. పదహారు చొప్పున కుడుములను, నల్లపూసలను, పసుపు కుంకుమలను, దక్షిణ తాంబూలం, చేటలు ముత్తైదువులకు వాయనముగా ఇవ్వాలి.

భాద్రపద చతుర్థి వినాయక చవితిగా ప్రసిద్ధి కెక్కింది. ఆబాల గోపాలానాకి ఇష్టమైన దైవం గణేశుడు. గణేశుడు అను పదము రెండు శబ్దముల కలయిక. గణ+ఈశుడు = గణేశుడు. 'గణ' అనగా వర్గము, సముదాయము, సమూహము అని అర్థము. 'ఈశుడు' అనగా స్వామి, ప్రభువు, శివుడు అనే అర్థములు కలవు. గణములకు (దేవతా) ప్రభువు కనుక గణేశుడు అయ్యాడు. గణేశుడు విఘ్న వినాశకుడు. విఘ్నములకు అధిపతి కావున గణేశుడు విఘ్నేశ్వరుడు అయ్యాడు. ఏ పనైనా ఆరంభించేటప్పుడు ముందుగా వినాయకుని పూజించి ఉండ్రాళ్ళను నైవేద్యంగా సమర్పించినట్లైతే ఆ పని నిర్విఘ్నముగా పూర్తవుతుంది. భక్తుల పాలిట కల్పతరువు గణేశుడు. మనోభీష్టాలను సిద్ధింప చేస్తాడు కనుక సిద్ధి వినాయకుడు అనే ఖ్యాతి కలిగింది. జ్ఞానాన్ని, విద్యను ప్రసాదించే గణేశునికి పూజలు చేసి ఆయన అనుగ్రహానికి పాత్రులమవుదాము.

భాద్రపద పంచమి ఋషి పంచమి. ఇది స్త్రీల యొక్క పండుగ. ఈ వ్రతాన్ని ప్రతి స్త్రీ ఆచరించాలని శాస్త్ర వచనం. మానవజన్మ అన్ని జన్మలకన్నా అత్యుత్తమమైనది. మనిషి తప్పనిసరిగా తీర్చుకోవల్సిన ఋణాల్లో పితృ ఋణం, దేవ ఋణం, ఋషి ఋణము ప్రధానమైనవి. ధర్మమార్గాన్ని నిర్దేశించి, ధర్మాధర్మ విచక్షణను మనకు నేర్పిన ఋషుల ఋణాన్ని తీర్చుకోవడం మన కర్తవ్యం. బ్రతుకు దారి చూపిన పెద్దలను, గురువులను, మహర్షులను గౌరవించి పూజించుట మన ధర్మం. జన్మకు కారకులైన మాతా పితరులపై భక్తిని చూపి, వారిని కంటికి రెప్పలా కాపాడుకోవడం మన ధర్మం. అందుకు ఆచారం మూలంగా గల ధర్మాన్ని అనుసరించాలి. ధర్మంతోనే సంసార సాగరమును దాటగలము.

ఈ రోజు బ్రాహ్మీ ముహూర్తములో నిద్ర లేచి కాలకృత్యాలను తీర్చుకుని, జలాశయములకు వెళ్ళి స్నానమాచరించాలి. గృహానికి వచ్చిన తరువాత మట్టితో వేదికను తయారు చేయాలి. గోమయంతో అలికి పుష్పములతో అలంకరించాలి. దానిపైన దర్భలను పరచి వాటిపైన సప్తర్షుల ప్రతిమలను ఉంచాలి. గంధ, పుష్ప, ధూప, దీపములతో పూజించాలి. తర్వాత అర్ఘ్యమివ్వాలి. నైవేద్యమును సమర్పించాలి.

భాద్రపద నవమి 'నందా నవమి' అని పిలుస్తారు. ఈ నాడు జగజ్జనని అయిన దుర్గాదేవిని షోడశోపచారములతో పూజించాలి. భాద్రపద ఏకాదశిని 'పరివర్తనా ఏకాదశి' అని పిలుస్తారు. పద్మనేత్రుడు, పద్మనాభుడు, అనంతుడు, అచ్యుతుడు, పరమ మోక్ష ప్రదాత అయిన శ్రీహరిని ప్రతిఫలాపేక్ష లేకుండా ధ్యానించాలి. భావన చేతనే భగవత్ ప్రాప్తి. పరమాత్మని చేరే సులభమైన మార్గం భక్తి. పదకొండవ తిథిని ఏకాదశి అంటారు. విష్ణుభక్తులకు ఏకాదశి మహాపర్వదినం. అయిదు కర్మేంద్రియములు, అయిదు జ్ఞానేంద్రియములు, మనసు – మొత్తం పదకొండింటియందు భగవంతుని లగ్నం చేసి సేవించిన వారికి తప్పక ముక్తి లభిస్తుంది. సర్వ కామితములు తీర్చగలది ఈ తిథి. ఈ రోజున విగ్రహారాధన, ఉపవాసముండుట మున్నగునవి ముఖ్యమైనవి. మనిషి ఇంద్రియములకు అధీనుడై ప్రవర్తిస్తాడు. సుఖభోగాలు మనిషిని దైవానికి దూరం చేస్తాయి. ఉపవాసాది కఠిన నియమాల వల్ల ఇంద్రియాల ప్రభావం తగ్గి, ఆధ్యాత్మిక సాధనలకు మార్గం సుగమమవుతుంది. ఉచ్ఛ్వాస, నిశ్వాసములలో దైవ చింతన ఇమిడి పోవాలి. మనస్సు నిర్మలంగా ఉండి సదా భగవద్భజన యందు విహరించాలి. ఉపవాసమునకే సరియైన అర్థము ఉప+వాసం = ఉపవాసం. 'ఉప' అనగా సమీపమున, దేనికి సమీపమున అనగా భగవంతుని సమీపమున అని అర్థము. 'వాసము' అనగా నివసించుట అని అర్థము. భగవంతునికి సమీపములో ఉండి హరినామస్మరణ నిరంతరం చేస్తుండాలి. బుద్ధిని భగవంతుని మీద కేంద్రీకరించాలి. అరిషడ్వర్గాలను త్యజించాలి. పరనింద పనికిరాదు. మనోవికాసం, సమయపాలన, సాత్వికచింతన, సత్కర్మాచరణ, సత్యనిష్ఠ, జ్ఞాన పిపాస, మోక్షాసక్తికి సోపానం. విష్ణు ప్రీతికరమైన పరివర్తన ఏకాదశి వ్రతాన్ని నియమ



నిష్ఠలతో ఆచరించి తరిద్దాము. జీవితమును చరితార్థము చేసుకుందాం.

భాద్రపద శుక్ల ద్వాదశి వామన జయంతి. దీనికి వామన ద్వాదశి అని కూడా పేరు. స్థితి కారకుడైన శ్రీమహావిష్ణువు దుష్ట శిక్షణ, శిష్టరక్షణ కొరకు ధరించిన దశావతారాల్లో ఐదవది వామనావతారం. వామనుడే త్రివిక్రముడు. ఆ పాతాళ నభో స్థలాంతం వరకు పెరిగిన మహోన్నత రూపాన్ని బలికి దర్శింప చేసినవాడు. అదితి, కశ్యపుల కడుపున విష్ణువు వామనావతారం ధరించి వచ్చిన రోజే ''భాద్రపద శుక్ల ద్వాదశి''. దేవతలను రక్షించడానికి, బలిని శిక్షించడానికి విష్ణువు ఈ అవతారంగా జన్మించాడు. ఈనాడు వామనమూర్తి విగ్రహాన్ని పూజించాలి. పన్నెండు మంది బ్రాహ్మణులకు పాయసంతో కూడిన భోజనాన్ని పెట్టాలి. ఈనాడు పెరుగును దానం చేస్తే బ్రహ్మ హత్యా పాతకములు తొలగిపోతాయి అని శాస్త్ర వచనం.

భాద్రపద శుక్ల చతుర్దశిని ''అనంత పద్మనాభ చతుర్దశి''గా జరుపుకుంటారు. అనంతుడు అనునది విష్ణుమూర్తి నామములలో ఒకటి. ఈ వ్రతాన్ని ఆచరించడానికి ఉదయవ్యాపిని అయిన చతుర్దశి ముఖ్యం. అనంత చతుర్దశినాడు అనంత వ్రతము చేసిన వారికి పుణ్యలోకాలు ప్రాప్తిస్తాయి. ఈ వ్రతము ఆచరించిన వారికి సిరిసంపదలు, సకల సౌభాగ్యాలు లభిస్తాయని చెబుతుంటారు.

భాద్రపద పూర్ణిమ నాడు శక్ర వ్రతమును ఆచరిస్తారు. 'శక్రుడు' అనగా ఇంద్రుడు. ఇంద్రుని పూజకు ఉద్దేశింపబడిందీ వ్రతము. ప్రాతఃకాలముననే లేచి ఇంద్రుని షోడశోపచారములతో పూజించినవారికి ధన ధాన్యాదులు పుష్కలంగా లభిస్తాయి.

భాద్రపద బహుళ పాడ్యమి నుండి అమావాస్య వరకు మహాలయ పక్షం ఆరంభమవుతుంది. పితృదేవతలకు ఇవి ప్రీతికరాలు. దీనినే 'పితృపక్షం' అని కూడా అంటారు. ఈ రోజులలో పితృదేవతలకు పితృకర్మలను నిర్వర్తిస్తారు. శ్రద్ధతో చేసేది శ్రాద్ధం. ఈ రోజులలో శ్రాద్ధకర్మలను నిర్వర్తిస్తారు. శ్రాద్ధకర్మను చేయడానికి పరిస్థితులు అనువుగా లేకపోతే తర్పణం వదులుతారు. కాశీ, గయలలో శ్రాద్ధకర్మను చేయడం పుణ్యకార్యంగా, పూర్వజన్మ సుకృతంగా భావిస్తారు.

భాద్రపద బహుళ తదియనాడు ''ఉండ్రాళ్ళ తద్ది'' వ్రతమును ఆచరిస్తారు. ఈ వ్రతం స్త్రీలకు సంబంధించిన పండుగ. ఈనాడు ఆడపిల్లలు సూర్యోదయానికి ముందే తలంటుస్నానం చేస్తారు. ఈ రోజు గౌరీదేవి పూజను చేయాలి. గౌరీదేవి కోసం చేసిన ఉండ్రాళ్ళు అమ్మవారికి సమర్పించి, భక్తి శ్రద్ధలతో పూజించాలి. ముత్తైదువుల కాళ్ళకు పసుపు పారాణి రాయాలి. పారాణిపై కుంకుమను పెట్టి పూలు ఇచ్చి, బొట్టు పెట్టి చీర రవికతో పాటు అయిదు ఉండ్రాళ్ళు ఉంచి, దక్షిణ తాంబూలాదులతో వాయనంగా సమర్పించి, కాళ్ళకు నమస్కరించాలి. వారిచేత అక్షింతలు వేయించుకొని ఆశీర్వాదం పొందాలి. గౌరీదేవి అనుగ్రహంతో చక్కని సంతానం, సుఖ సౌభాగ్యాలు పొందుతారు. సకల సౌభాగ్యములతో కలకాలం వర్ధిల్లాలనే కోరికతో వివాహితలు ఈ వ్రతాన్ని ఆచరిస్తుంటారు.

శుభప్రదమైన భాద్రపద మాసంలో నోములు వ్రతాలు సుఖ సౌఖ్యాలను కలిగిస్తాయి. భర్త ఆయురారోగ్యాల కోసం, పిల్లల సుఖ సంతోషాల కోసం, తమ సౌభాగ్యాన్ని కలకాలం వర్ధిల్ల చేసుకోవాలనే భావనతో భక్తి శ్రద్ధలతో నోచి తమ జీవితాలను తరింప చేసుకోవాలి.

**సర్వేజనా – సుఖినోభవంతు**

# గజాసురుడు

**– కౌతా నిర్మల**



గజాసురుడు ఒక ఏనుగు. అతడు శివునికి పరమ భక్తుడు. వినాయకునికి గజాసురుని తల అమర్చడం వల్ల, గణపతికి గజాననుడు అనే పేరు ఏర్పడింది. వినాయకుని పుట్టుక, మరణం గురించి ప్రతివారికి తెలుసు. పార్వతీదేవి అభ్యంగన స్నానానికి ఉపయోగించిన నలుగు పిండితో తయారు చేసిన బాలునికి ప్రాణం పోసి, వాకిలి గుమ్మం ముందు, లోనకు ఎవరూ రాకుండా కావలి ఉంచింది. ఆ బాలుడు పరమేశ్వరుని లోపలికి పోనివ్వకుండా అడ్డగించినప్పుడు, వారిద్దరి మధ్య ఏర్పడిన ఘర్షణ వల్ల, రుద్రుడు క్రోధంతో ఆ బాలుని శిరస్సును తన త్రిశూలంతో ఖండించడం జరిగిందన్న పురాణ కథ అందరికీ తెలుసు. పార్వతి ద్వారా జరిగిన విషయాన్ని తెలుసుకున్న పరమేశ్వరుడు శాంతపడి, ఆ బాలుని శిరస్సు దొరకకపోవడంతో, తన గణాలను ఉత్తరదిశగా తలపెట్టుకుని నిద్రించేవారి తలను ఖండించి తెమ్మని పంపించాడు.

శివగణాలు అన్వేషిస్తూ వెళ్ళగా, ఉత్తరదిశలో తలపెట్టుకుని పడుకున్న ఒక ఏనుగు వారికి కనిపించింది. ఆ ఏనుగు శిరస్సును ఖండించి తెచ్చి, శివునికి ఇవ్వగా, విగతజీవుడైన ఆ బాలునికి ఏనుగు శిరస్సును అతికించి, ఆ బాలుని జీవింపచేశాడు మహేశ్వరుడు. అయితే మరణించిన ఏనుగు మొండెం, తల లేకుండా అడవిలో పడి వుంటే అటువైపు వచ్చిన సుయక్ష అనే రాక్షస స్త్రీ చూసింది. ఆ ఏనుగుకు తన తల అమరిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన వచ్చింది. మరణించిన ఏనుగు కథ గురించి, ఆ తర్వాత ఏం జరిగిందన్నది చాలామందికి తెలియదు. ఆ ఏనుగును చూసిన సుయక్ష కామరూప విద్యలు తెలిసిన రాక్షసి అవడం వల్ల, ఆ రాక్షసి తన తలను ఏనుగు తలగా మార్చి, ఏనుగు మొండానికి అమర్చి దానికి జీవం పోసింది. ఆ ఏనుగుకు పునర్జన్మ ఆ రాక్షసి ద్వారా లభించింది. ఆ రాక్షసి అకృత్యాల వల్ల బాధ పడిన దేవతలు, వెంటనే ఆ రాక్షసి మొండాన్ని అగ్నితో భస్మం చేశారు.

కొంతసేపటి తరువాత, ఏనుగు రూపం నుంచి తన తలను తన మొండానికి అమర్చాలని చూస్తే, ఆ రాక్షసికి తలనుంచి విడివడిన శరీరం కనిపించలేదు. ఇక గత్యంతరం లేక, ఆ ఏనుగు రూపంలోనే సుయక్ష ఉండిపోవలసి వచ్చింది. అయినప్పటికీ ఆ రాక్షసి దుర్మార్గాలు, అకృత్యాలు, ఆగడాలు ఆగలేదు. ఆ రాక్షసి దుష్టకార్యాల నుంచి దేవతలు తప్పించుకోలేకపోతున్నారు. వారంతా మహాదేవుని వద్దకు వెళ్ళి తమ బాధను విన్నవించుకుని, తమను కాపాడమని వేడుకున్నారు. జ్యోతిరూపంలో ఆ భగవంతుడు వారితో ఇలా చెప్పాడు. ''దేవతలారా! సుయక్ష పొందిన వరం కారణంగా, ఆ రాక్షసి శరీరానికి సరిగా వ్యతిరేక లక్షణాలున్న వారి చేతిలోనే ఆమెకు మరణం సంభవిస్తుంది. ఈ విషయంలో నేను ఎటువంటి అభయం ఇవ్వలేను'' అన్నాడు.

దేవతలు, మహర్షులు ఆ సుయక్ష శరీరానికి వ్యతిరేకంగా ఎవరుంటారన్న విషయాన్ని ఆలోచించసాగారు. అగస్త్య మహర్షి మనస్సులో ఒక ఉపాయం స్ఫురించింది. సుయక్ష తల మగ ఏనుగు శరీరంలో ఉంది. ఏనుగు తలతో ఉన్న వినాయకుడు స్త్రీ రూపాన్ని ధరించి, ఆమెతో పోరాడినట్లయితే ఆ రాక్షసి మరణం తథ్యం. ఆమె పొందిన వరాన్ని అనుసరించే ఆమెకు మృత్యువు సంభవిస్తుంది.

తన ఆలోచనను ఆయన దేవతలకు, మునులకు చెప్పాడు. అప్పుడు వారంతా వినాయకుని వద్దకు వెళ్ళి, తమ పరిస్థితిని ఆయనకు వినిపించి, తమ కోరికను తెలిపి, శరణు కోరారు.

వారికి అభయమిచ్చాడు వినాయకుడు. ఏనుగు తొండంతో ఉన్న గజాననుడు స్త్రీ రూపాన్ని ధరించి, సుయక్షను ఎదుర్కొని, ఆమెతో పోరాడి ఆమెను సంహరించాడు. పునర్జీవితుడైన గజాననుడు రాక్షసి తలతో తిరిగి మరణించాడు. వినాయకుడు స్త్రీ రూపం ధరించడం వల్లనే గణపతికి వినాయకి, గణేశిని అనే పేర్లు వచ్చాయి.

# "శ్రవణ ద్వాదశి వ్రతము"

- చిల్లర సీతారామారావు

భారతదేశము ధర్మప్రాధాన్యత కలిగిన దేశము. ధర్మయుక్తమైన పండుగలను, వ్రతములను అత్యంత భక్తి శ్రద్ధలతో ధర్మాసక్తి గల ప్రజలు ఆదరిస్తూనే ఉన్నారు. వ్రతములను ఆచరించుట వలన ఆత్మశుద్ధి, జ్ఞానము, బుద్ధి, శ్రద్ధ, మేధ, భక్తి, పవిత్రత మున్నగునవి వృద్ధి చెందుతాయని వ్రత గ్రంథములు తెలియజేస్తున్నాయి. భక్తిశ్రద్ధలతో, నియమ నిష్ఠలతో వ్రతములు చేసినట్లయితే ధన ధాన్య సమృద్ధి, సుఖ సంపదలు, సమస్త పాపముల నుండి విముక్తి కలుగుతుందని భక్తుల విశ్వాసము. వ్రతము అనగా పుణ్యప్రాప్తి కొరకు ఉపవాసము మున్నగు నియమములతో, సత్సంకల్పంతో చేయు కార్యము అని అర్థము.

భాద్రపదమాసము భవ్యమాసము. భాద్రపద మాసమున వ్రతములు, నోములు అధికము. ఈ మాసమునందు ''శ్రవణ నక్షత్రమునకు విశేష మహత్తు ఉంది. శ్రవణ నక్షత్రము శ్రీమహావిష్ణువుకు ప్రీతిపాత్రమైన నక్షత్రము. విష్ణుభగవానుని స్మరించుకుంటూ ద్వాదశి తిథి నాడు ''శ్రవణ ద్వాదశి వ్రతము''ను జరుపుకుంటారు. భాద్రపద మాసమున శుక్లపక్ష ద్వాదశి, శ్రవణ నక్షత్రముతో కూడినప్పుడు శ్రవణ ద్వాదశి వ్రతమును జరుపుకోవడం వలన సమస్త మనోభీష్టాలు సంపూర్ణంగా నెరవేరుతాయి.

శ్రవణ ద్వాదశి నాడు వేకువ జాముననే లేవాలి. నదీ సంగమ ప్రాంతమునకు చేరుకుని నది యందు స్నానము చేయాలి. నదీస్నానమునకు అవకాశము లేనప్పుడు ఏ జలాశయము నందయిననూ స్నానము చేస్తూ ఈ క్రింది శ్లోకమును చదువుకోవాలి.

శ్లో ॥ "గంగేచ యమునే చైవ గోదావరి సరస్వతి
నర్మదే సింధు కావేరి జలేస్మిన్ సన్నిధిం కురు"

స్నానము చేసిన తరువాత గృహమునకు వచ్చి పూజా మందిరమును శుభ్రపరచుకోవాలి. పూజమందిర మధ్యభాగమున ఒక వేదికను ఏర్పాటు చేసుకోవాలి. దాని మీద బియ్యమును పోసి దానిమీద కలశమునుంచాలి. కలశము మీద ఒక పాత్రను ఉంచి, దానిమీద దామోదరుని ప్రతిమనుంచాలి. ఆ ప్రతిమను షోడశోపచారములతో, అష్టోత్తరములతో పూజించాలి. నేతితో తయారు చేసిన వంటకములను నైవేద్యముగా పెట్టాలి. శక్త్యానుసారము కుండలను కొని, వాటిని నీటితో నింపి, ఆ కుండలను



సద్బ్రాహ్మణునకు దానముగా ఇవ్వాలి. ఆ రాత్రంతా జాగరణ చేయాలి. ఉపవాసముండాలి. తెల్లవారిన తరువాత స్నానము చేసి గరుడ ధ్వజుడిని పుష్పములతో పూజించాలి.

శ్లో ॥ "నమో నమస్తే గోవింద బుధ శ్రవణ సంజ్ఞక
అఘౌఘ సంక్షయం కృత్వా సర్వసౌఖ్య ప్రదోభవ"

అని భగవంతుడిని ప్రార్థించాలి. పిదప వేదజ్ఞులు, పురాణజ్ఞులు అయిన బ్రాహ్మణులను పూజించి, పూజకు ఉపయోగించిన పూజ సామగ్రిని, దామోదరుని ప్రతిమను ''ప్రీయతాం మే జనార్దనః'' అంటూ దానముగా సమర్పించాలి. శ్రవణ ద్వాదశి బుధవారము నాడు వస్తే, ఆ రోజు చేసిన సమస్త కార్యములు అక్షయమవుతాయి. ఒకసారి శ్రవణ ద్వాదశి వ్రతమును ఆచరిస్తే, పన్నెండు శ్రవణ ద్వాదశి వ్రతములను ఒనరించిన ఫలము ప్రాప్తిస్తుంది. శ్రవణ ద్వాదశి వ్రతమునకు సంబంధించిన ఒక కథ భవిష్యత్పురాణమున పేర్కొనబడింది.

పూర్వకాలమున దశార్ణదేశమునకు పశ్చిమ భాగమున సమస్త ప్రాణులను కంపింప చేయు ప్రాంతము ఒకటి ఉన్నది. ఆ ప్రాంతమును మరుభూమి అని పిలుస్తారు. అక్కడి భూమి నిత్యము వేడిగా ఉంటుంది. భయంకరమైన సర్పములు ఆ ప్రాంతమున సంచరిస్తూ ఉంటాయి. అక్కడ దృఢమైన ముళ్ళకంపలతో నిండిన వృక్షములు సర్వత్రా దర్శనమిస్తుంటాయి. అక్కడ సంచరించు జీవులు శవాలలాగా కన్పిస్తుంటారు. దానికి కారణం వారికి కావలసినంత అన్నపానీయములు లభించకపోవడమే. పక్షులు కూడా దాహార్తితో మరణిస్తున్నాయి.

భయంకరమైన ఆ మరు ప్రాంతమునకు ఒక వ్యాపారి తన సహచరులతో కలిసి ప్రయాణిస్తూ, దారి తప్పి, అక్కడక్కడా తిరుగుతూ అక్కడికి చేరుకుంటాడు. ఆ ప్రాంతమున అన్న పానీయములు దొరకవని అతనికి తెలియదు. తినడానికి తిండి, త్రాగడానికి నీరు లభించక వాటి కొరకు అన్వేషించసాగాడు. ఆ సమయములో ఎదురుగా ఒక ప్రేతము వస్తూ కనిపించింది. ఆ ప్రేతము భుజముల మీద ఒక ప్రేతము కూర్చుని ఉండగా, నాలుగయిదు ప్రేతములు అతడిని అనుసరిస్తూ రాసాగాయి. ప్రేతము వ్యాపారిని చూడగానే నమస్కరించి – మీరు ఈ ప్రాంతమునకు క్రొత్తవారిగా కన్పిస్తున్నారు. భయంకరమైన ఈ మరుభూమికి ఎందుకు వచ్చారు? అని ప్రశ్నించింది. వ్యాపారి ప్రేతమునకు సమాధానమిస్తూ – నేను నా సహచరులతో పయనిస్తూ దారి తప్పి ఈ ప్రదేశమునకు వచ్చాను. ఈ ప్రాంతమున చిక్కుకున్న నేను ఆకలిదప్పులతో అలమటిస్తున్నాను. తినడానికి తిండి దొరకడం లేదు. త్రాగడానికి నీరు దొరకడం లేదు అని పలికాడు. ప్రేతము వ్యాపారితో నీవు కొద్దిసేపు ఈ పున్నాగ వృక్షము దగ్గర ప్రతీక్షించు. నీ ఆకలి దప్పికలు తీరిపోతాయి. తరువాత నీ దారిన నీవు వెళ్ళవచ్చును అని పలికింది. వ్యాపారి పున్నాగ వృక్షము దగ్గర ప్రతీక్షించసాగాడు. ఇంతలో ఒక విచిత్ర ఘటన జరిగింది. పున్నాగ వృక్షము నుండి ఒక వ్యక్తి ప్రకటితమయ్యాడు. అతడి దగ్గరనున్న పాత్రలలో ఒకదానిలో అన్నము, పెరుగు, మరియొక పాత్రలో నీరు ఉన్నాయి. ప్రకటిత వ్యక్తి ఆహారమును వ్యాపారికి ఇచ్చాడు. అన్నపానీయములను స్వీకరించిన వ్యాపారి సంతృప్తి చెందాడు. ఆ వ్యక్తి ప్రేతములకు కూడా ఆహారమును ఇచ్చాడు. దానితో అవి కూడా తృప్తి చెందాయి. వ్యాపారి ప్రేతముతో, మీరంతా ఎలా జీవిస్తున్నారు? కొలదిగా లభించు అన్న పానీయములతో మీకు సంతృప్తి ఎలా లభిస్తున్నది? ఇంతటి నికృష్ట జీవితమును గడుపుతూ మరుభూమిలో నుండటానికి గల కారణమేమిటి? నాకు దయచేసి వివరములన్నీ తెలుపవలసినదిగా ప్రార్థిస్తున్నాను అని అడిగాడు. పూర్వజన్మల పాపకర్మల ఫలితమును మేము అనుభవిస్తున్నాము. పూర్వజన్మలో నేను ఒక వ్యాపారిని. రమణీయమైన శాకల నగరములో నివసించెడి వాడను. వ్యాపారము చేయునప్పుడు లోభమునకు లోనయి అక్రమంగా వ్యాపారమును చేసి ధనమును ఆర్జించాను. ఏనాడూ ఎవరికీ కూడా పట్టెడన్నము పెట్టలేదు. దాహార్తుల దాహము తీర్చలేదు. నాకు ఒక బ్రాహ్మణ మిత్రుడు ఉన్నాడు. భాద్రపద మాసమున, శ్రవణ నక్షత్రముతో కూడిన ద్వాదశి నాడు నన్ను తనతో పాటు తాపీ, చంద్రభాగా నదుల సంగమ స్థానమునకు తీసుకొని పోయాడు. పవిత్రమైన ఆ నదీ సంగమములో మేమిద్దరం స్నానం చేశాము. ఆ రోజంతా ఉపవాసం ఉన్నాము. దామోదరుడిని పూజించాము. బ్రాహ్మణులకు నీటితో నిండిన జలపాత్రములను, గొడుగు, చెప్పులు, వస్త్రములు, దామోదరుడి ప్రతిమ మున్నగు వాటిని దానము చేశాము. స్నానమాచరించి, వ్రతమాచరించి, దానధర్మములు చేసిననూ బుద్ధి మారలేదు. ధనార్జనే ముఖ్యము అని భావించి ధనమును ఆర్జించాను. కొంతకాలము గడిచిన తరువాత నాకు మరణము ప్రాప్తించింది. నాస్తిక బుద్ధి, దుష్కర్మల కారణంగా ఈ జన్మలో ప్రేతముగా జన్మించాను. పోయిన దుష్కర్మల వల్ల ఈ జన్మలో ప్రేతములుగా జన్మించినవారు నాకు మిత్రులయ్యారు. 'అతిథిదేవో భవ' అన్నారు. నాకు అతిథిగా వచ్చిన నీకు అన్నపానీయములనిచ్చి సత్కరించాను. తత్ఫలితముగా నాకు తప్పక ప్రేతత్వము నుండి విముక్తి లభిస్తుంది. నేను లేకపోతే ఈ ప్రేతములు అవస్థలపాలు కావలసి వస్తుంది. వారిని ఉద్ధరించే మార్గము, నీకు ధనము లభించే ఉపాయము చెబుతాను. కాని నీవు నేను చెప్పిన మాటను తప్పక చేయాలి అని పలికాడు. వ్యాపారి అంగీకరించాడు. ప్రేతము చెప్పసాగింది. వ్యాపారీ! నీవు హిమాలయ ప్రాంతములకు వెళ్ళుము. ఆ ప్రాంతములో నొక ప్రదేశము ఉంది. నీవు ఆ ప్రాంతమునకు వెళితే నీకు పుష్కలముగా ధనము లభిస్తుంది. ధనమును తీసుకుని నీవు గయా క్షేత్రమునకు వెళ్ళి ఒక్కొక్క ప్రేతము గోత్ర ప్రవరలు చెబుతూ పిండప్రదానాలు, శ్రాద్ధకర్మలు చేయాలి. ఆ విధముగా చేసినట్లయితే నా మిత్రుల ప్రేతత్వము తొలగిపోయి విముక్తులవుతారు అని పలికాడు. వ్యాపారి ప్రేతము చెప్పినట్లు హిమాలయ ప్రాంతమునకు పోయి ధనమును తెచ్చుకున్నాడు. అక్కడనుండి గయా క్షేత్రమునకు వెళ్ళి ఒక్కొక్క ప్రేతము గోత్రము, నామములు చెబుతూ శ్రాద్ధకర్మలు చేశాడు. ఏ రోజున ఏ ప్రేతమునకు శ్రాద్ధకర్మలు నిర్వర్తించాడో ఆ రోజు వ్యాపారికి కలలో ఆ ప్రేతము కనిపించి – పుణ్యాత్ముడా! నీ దయ వలన నాకు ప్రేతత్వము నుండి విముక్తి కలిగినది' అని పలికి అదృశ్యమయ్యెడిది.

గృహమునకు తిరిగి వచ్చిన తరువాత వ్యాపారి మహిమాన్వితమైన భాద్రపద మాస శుక్లపక్ష ద్వాదశి నాడు దామోదరునకు పూజలు చేసెడివాడు. ఆవులను బ్రాహ్మణులకు దానముగా ఇచ్చెడివాడు. ఇటువంటి సత్కర్మలు చేసిన కారణము చేత శరీరాంతమున దుర్లభమైన పరమ ధామమునకు చేరుకున్నాడు.

ఇహ పర లోకములలో సంపూర్ణ సౌభాగ్యమును, సమస్త పాపములను హరించునది అయిన శ్రవణ ద్వాదశి వ్రతమును భక్తి శ్రద్ధలతో ఆచరించి ఆ భగవంతుని కరుణకు పాత్రులమవుదాము.

# రూపాయ హారతి

: శ్రీమతి వెలమకన్ని పద్మావతి



ఉగాది పండుగ నాడు తిరుమలలో శ్రీవారికి జరిగే ప్రత్యేక ఉత్సవాన్ని ఉగాది ఆస్థానం అంటారు. ఉగాది కొలువు అని కూడా అంటారు. శ్రీదేవి భూదేవి సమేతుడైన మలయప్పస్వామికి బంగారు వాకిలి ముందు ఉన్న ఘంటా మండపంలో ఈ వేడుక వైభవంగా నిర్వహింపబడుతుంది. కేవలం శ్రీవారి అర్చకస్వాములు, జియ్యంగార్లు, ఏకాంగులు, వేదపండితులు, దేవస్థానం ఉన్నతాధికారులు, ధర్మకర్తమండలి సభ్యులు, తిరుమల ఆలయ సిబ్బంది మాత్రమే పాల్గొనే ఈ వేడుకలో ఇతరులు ఎవరికీ పాల్గొనే వీలు లేదు.

తిరుమంజనం, పిండివంటల నివేదన, పట్టు వస్త్రాల సమర్పణ, అక్షతారోపణ, తండల దానం ఇచ్చిన శ్రీవారికి ఆశీర్వచనం, పంచాంగశ్రవణం, ఆదాయ వ్యయాల వివరణ వంటి విశేష కార్యక్రమాల అనంతరం ''కొలువు పళ్ళెం'' అనే బంగారు తట్టలో నవనీత హారతిని శ్రీవారికి సమర్పిస్తారు. ఆ తర్వాత వరుసగా తాళ్ళపాక, తరిగొండ, మహంతు, మైసూరు వారి హారతులు ప్రత్యేకంగా సమర్పించబడతాయి. ఆ తరువాత అక్కడ వేడుకలో పాల్గొంటున్న భక్తులందరి నుంచీ ఒక్కొక్క రూపాయను సేకరించి ప్రత్యేకంగా అందరి తరఫున ''రూపాయ హారతి'' ఇస్తారు. ఇలా సేకరించిన రూపాయలను కార్యనిర్వహణాధికారి, శ్రీవారి ఖజానాకు జమ చేస్తారు. ఇదీ ''రూపాయ హారతి'' గురించిన విషయం.



## శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంకల్పించిన మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా గత నెలలో నిర్వహించిన కళ్యాణాలు

### 107 వ కళ్యాణం

ఇది తేది 31-07-2026 శుక్రవారం నాడు ఉదయం 10.30 గంటల నుండి జరిగింది. ఇది డా|| హోమీ. జె.భాభా కమ్యూనిటీ హాల్, డా|| ఎ.ఎస్.రావు నగర్, ఈసిఐఎల్, హైదరాబాద్ లో జరిగింది. దీనిని శ్రీమాన్ కేసరి శ్రీనివాస రెడ్డి, స్వాతి దంపతులు నిర్వహించారు.

### 108 వ కళ్యాణం

ఇది తేది 19-08-2026, బుధవారం ఉదయం 10.30 గంటల నుండి కమ్యూనిటీ హాల్, కోదండ రామాలయం, వీధి నెం.8, ఎస్.ఎస్.నగర్, హబ్సీగూడ, హైదరాబాద్ లో జరిగింది. దీనిని ఆలయ కమిటీ సభ్యులు మరియు భక్తబృందం నిర్వహించారు.

### 109 వ కళ్యాణం

ఇది తేది 23-08-2026, ఆదివారం ఉదయం 10.30 గంటల నుండి శాంతి గార్డెన్స్, రాఘవేంద్ర నగర్, నాచారం, హైదరాబాద్ లో జరిగింది. దీనిని శాంతి గార్డెన్స్ వెల్ఫేర్ కమిటీ వారు నిర్వహించారు.

# మీ ప్రశ్న – మా సమాధానం

నిర్వహణ: డా. మరింగంటి లక్ష్మణాచార్యులు

**1. భక్తులలో నాలుగు రకాల వారున్నారని, వారిలో జ్ఞానియే శ్రేష్ఠుడని విన్నాము. మాకేం అర్థం కాలేదు. కొంచెం వివరిస్తారా గూరూజీ!!**

**- జాహ్నవి, చాముండి, పద్మ – శ్రీమన్నారాయణ గోష్ఠి, పీర్జాదిగూడ**

జవాబు – మీరు విన్నది నిజమే. భగవద్గీత లోని 7వ అధ్యాయం – విజ్ఞాన యోగంలో, శ్రీకృష్ణ పరమాత్మ దీని గురించి వివరంగా, అద్భుతంగా చెప్పాడు. అది ఒక్కసారి చదవండి. ఆయన మాటల సారాంశం, మీ సందేహానికి జవాబు ఏమంటే, భగవంతుణ్ణి సేవించేవారు ఆర్తులు (ఆపద కలిగినప్పుడు మాత్రమే సేవించేవారు), జిజ్ఞాసువులు (అసలు భగవతత్త్వం అంటే ఏమిటో తెలుసుకోవాలనుకునేవారు), అర్థార్థులు (భగవంతుడి నుంచి ధనమో మరేదో ఆశించేవారు) మరియు జ్ఞానులు (స్వరూప అనుభవం పొంది, ఆత్మానాత్మ వివేకముతో, ఏ కోరిక కోరక, సదా ఆయనను స్మరించేవారు). వీరిలోకెల్లా జ్ఞానులే (నారద, ప్రహ్లాద, భీష్ములు వంటివారు) నాకు ఇష్టులు అని చెప్పారు భగవాన్ శ్రీకృష్ణులవారు. మరి మీరు దీనిలో ఏ వర్గానికి చెందినవారైననూ మంచిదే. కాని నాల్గవ (జ్ఞానులు) వర్గం వారు మాత్రమే శ్రేష్ఠులు. భగవంతునికి ఇష్టులు. మరి మీరు జ్ఞానులే కదా!

**2. గురువుగారూ! నేను చాలా ఇబ్బందుల్లో అయోమయంలో, చికాకుల్లో ఉన్నా. నేనే కాదు, నాలాంటివారు చాలామంది ఉన్నారు. మాలాంటి వారికోసం మంచిమాటలు ఏమైనా చెప్పి, నిజమైన శాంతి, ఆనందం కలిగించగలరా? – జితేంద్రకుమార్, గచ్చిబౌలి.**

జవాబు – ఇబ్బందులు, అశాంతి, చికాకులు మొదలైనవి లేనివారు ఎవరండీ? అందరికీ ఏవో రకమైన సమస్యలే. అసలు జీవితం అంటే అదే. ఇలాంటి పరిస్థితుల్లో గురువులు ఏమన్నారంటే...

1. జరిగిపోయిన దాని గురించో }
   నీ చేతిలో లేనిదాని గురించో }
   ఆలోచించకు, చింతించకు } ''గతం గతః''
   వర్తమానంలో జీవించు }
2. ఇతరులతో నిన్ను నీవు పోల్చుకోకు. నీ పరిస్థితులు, శక్తి సామర్థ్యాలు, పరిమితులు మొదలగు వాటి ప్రకారమే సకాలంలో, సరైన దిశలో, తగిన చర్యలు చేపట్టు.
3. విజ్ఞానం ముగిసినప్పుడు ఆధ్యాత్మికత ప్రారంభం అవుతుంది. సృష్టిలో అన్నిటికీ అతీతమైన శక్తి ఒకటి ఉందని, అదే అందరినీ, అన్నిటినీ నడిపిస్తోందని గ్రహించు.

చివరిగా 'స' పంచకం అమలు చేస్తే, మీకు ఊరట, శాంతి, ఆనందం చివరికి ముక్తి (అంటే ఇహమూ, పరమూ రెండూ) లభిస్తాయి అని తెలుసుకో. 'స' పంచకం అంటే – స = సత్ సాంగత్యం, స = సద్గ్రంథ పఠనం, స = సద్గురు సమాశ్రయణం, స = సన్మార్గ గమనం, స = సత్యనిష్ఠ. ఇవి చాలు మనకు సద్గతి లభించడానికి, సుఖ సౌఖ్యాలతో పాటుగా, తిరిగి పునర్జన్మ లేకుండా చేసుకోవడానికి.

**జిజ్ఞాస కలిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలు. భక్తులు తమ ప్రశ్నలను మా పత్రికకు రాయగలరు.**
***– ఎడిటర్, శ్రీవేంకటేశం***

# నవనాగులు

**– శ్రీమతి వెలమకన్ని పద్మావతి**

శ్రావణ మాసంలో నాగపంచమి నాడు, కార్తీక మాసంలో నాగుల చవితి నాడు, మార్గశిర మాసంలో షష్ఠి నాడు నాగులను పూజించి సేవించే సంప్రదాయం మనకు ఉంది. నాగులలో తొమ్మిది నాగులను ప్రముఖ్యమైనవిగా భావించి నవనాగులుగా వ్యవహరిస్తారు. వీరు – అనంతుడు, వాసుకి, శేషుడు, పద్మనాభుడు, కంబలుడు, శంఖపాలుడు, ధార్తరాష్ట్రుడు, తక్షకుడు కాళియుడు. ఈ నవనాగులను ప్రాతఃకాలం – సాయంకాలం స్మరించినా, పూజించినా సకల శుభాలూ సమస్త విజయాలూ చేకూరుతాయని శాస్త్ర వచనం.

శ్లో ॥ అనంతరం వాసుకిం శేష పద్మనాభంచ కంబలమ్
శంఖపాలం ధార్తరాష్ట్రం తక్షకం కాళియం తథా
ఏతాని నవనామాని నాగానాంచ మహాత్మానామ్
సాయంకాలే పఠేన్నిత్యం ప్రాతః కాలే విశేషతః
తస్మై విష భయం నాస్తి సర్వత్ర విజయీ భవేత్

* * *

# రాశి ఫలితములు

## మేషరాశి
**అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము**

సామాన్యంగా అనుకూల ఫలితములు. పంతాలు, పట్టింపులకు ఇది సమయము కాదు. గౌరవ మన్ననలు లభించును. స్త్రీలకు పుట్టింటా, మెట్టినింటా గౌరవము పెరుగును. నూతన ఆలోచనలు ఫలించును. విఘ్నేశ్వర పూజలు, లక్ష్మీగణపతి హోమం, శివాభిషేకం వలన లాభములు కలుగును.

## వృషభరాశి
**కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.**

సామాన్య ఫలితములు. ఇతరులను నమ్ముట వలన మోసపోయే అవకాశములు. ధనవ్యయం, ఆర్థిక నష్టం. గౌరవానికి అవరోధములు, అనారోగ్యం, ప్రయాణాలలో ప్రమాద సూచనలు ఉన్నాయి. శకునం చూసి ప్రయాణం చేయుట, నిరంతర నామస్మరణ చేయుట మంచిది.

## మిథునరాశి
**మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.**

ఈ రాశి స్త్రీ–పురుషులకు సామాన్య ఫలితములు. మీరు మాట్లాడే మాటలు ఎదుటివారిని కించపరిచే విధంగా ఉండవచ్చును. వాహన ప్రమాదములు, తెలియని ఆకస్మిక ప్రమాద సూచనలు ఉన్నాయి. ఔషధములు వాడవలసిన కాలము. పార్వతీ–పరమేశ్వరులు, వినాయక, కుమారస్వాములకు "ఓం శరవణభవ నమః" మంత్రాన్ని 1008 సార్లు జపించవలెను.

## కర్కాటకరాశి
**పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.**

ఈ మాసమున సామాన్య ఫలితములు. భార్యాభర్తల మధ్య స్వల్ప విభేదాలు ఉన్నా పరస్పర అవగాహనతో సర్దుకుపోవాలి. ధనం చేతికి వస్తుందనే నిరీక్షణ వలన ఆలస్యం కలుగవచ్చు. సామరస్యంగా వ్యవహరించి రాజీమార్గంలో నడవడం ఉత్తమం.

## సింహరాశి
**మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము**

సామాన్య ఫలితములు. ప్రతి విషయంలో అప్రమత్తత అవసరం. లేకపోతే కుటుంబంలో అనేక సమస్యలు తలెత్తవచ్చు. పరిహారం: విఘ్నేశ్వరునికి గరికతో అష్టోత్తరం, నవరాత్రులలో లక్ష్మీ–గణపతి హోమం చేయుట శ్రేయస్కరం.

## కన్యారాశి
**ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ–పురుషులకు సామాన్య ఫలితములు. అయినా స్వయంకృషితో ఆకస్మిక ధనసంపాదన అవకాశములు ఉన్నాయి. లౌకిక దృష్టితో, తెలివిగా వ్యవహరించి సరైన సమయాన్ని ఎదురుచూడాలి. అమ్మవారి ఆశీర్వాద బలంతో లక్ష్యసాధన జరుగుతుంది. తొందరపాటు తగదు.

## తులారాశి
**చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ–పురుషులకు సామాన్య ఫలితములు. పరస్త్రీ కారణంగా భార్యాభర్తల మధ్య ఘర్షణలు తీవ్రస్థాయికి చేరగలవు. కుటుంబ సభ్యుల విమర్శల వలన మనోధైర్యం తగ్గవచ్చు. దుర్గాస్తోత్ర పారాయణం చేయుట వలన నిగ్రహశక్తి పెరుగుతుంది.

## వృశ్చికరాశి
**విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ–పురుషులకు అనుకూల కాలం. ఆకస్మిక ధనలాభ యోగం ఉంది. ఆదివారం నియమాలు పాటించి సూర్యుని పూజలు, ఆదిత్యహృదయ పారాయణం, సూర్యదండకం, అష్టోత్తర శతనామాలు చేయుట వలన శుభఫలితములు కలుగుతాయి.

## ధనూరాశి
**మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.**

ఈ రాశి స్త్రీ–పురుషులకు అనుకూల ఫలితములు. కుజగ్రహ శాంతికి జపం చేయించి 1¼ కిలోల కందులు, ఎరుపు వస్త్రాలు దానం చేయాలి. మంగళవారం గోవుకు 450 గ్రాముల నానబెట్టిన కందులు దానగా పెట్టండి. ఫలితం స్పష్టంగా అనుభవంలోకి వస్తుంది. మంత్రం: ఓం శరవణభవ నమః.

## మకరరాశి
**ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ట 1,2 పాదములు**

ఈ రాశివారికి రావలసిన ధనం చేతికి అందుతుంది. వినాయకుని అనుగ్రహం వలన కార్యసిద్ధి కలుగుతుంది. బంధుమిత్రుల ఆదరాభిమానములు, ఇష్టాగోష్ఠులు, నూతన పరిచయములతో సంతోషంగా, ఉల్లాసంగా కాలం గడుస్తుంది.

## కుంభరాశి
**ధనిష్ట 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.**

ఈ మాసమున ఫలితములు అంతంతమాత్రంగా ఉంటాయి. పని ఒత్తిడి పెరుగుతుంది. ఎవరినీ నమ్మరాదు. నూతన పరిచయాల వలన కష్టనష్టాలు అనుభవించవచ్చు. ఆర్థికంగా లోటు ఉంటుంది. వినాయక పూజలు, లక్ష్మీ–గణపతి పూజలు, సుదర్శన హోమం చేయాలి.

## మీనరాశి
**పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.**

ఈ రాశి వారికి అనుకూలత ఉంటుంది. శత్రువులు మిత్రులుగా మారి అనేక విషయాలలో సహకరిస్తారు. ఎంతమంది ఎదురు తిరిగినా మీ పూజలు మిమ్ములను ప్రశాంతంగా ఉంచుతాయి. తండ్రికి అనారోగ్య సూచనలు ఉన్నవి; జాగ్రత్తలు తీసుకోవాలి.




ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదిలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

**ఈ కింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి**

1. శ్రీవారి శంఖం పేరేమిటి?
2. విశ్వకర్మ కూతురు ఎవరు?
3. గోవిందదాసు గారింటిలో శ్రీవారు ఏ రూపంలో దర్శనమిచ్చారు?
4. గరుడ పంచమి ఏనాడు?
5. వినత ఎవరి కూతురు?
6. కద్రువ కోరిక తీర్చని కొడుకు ఎవరు?
7. వరలక్ష్మీ వ్రత కథను ఎవరు ఎవరికి చెప్పారు?
8. అష్టావక్రుని తండ్రి ఎవరు?
9. నాగుల రాజధాని ఏది?
10. వరుణదేవుని కొడుకు ఎవరు?
11. విశ్వకర్మ కొడుకు ఎవరు?
12. జనకుని సోదరుడు ఎవరు?
13. కేవలం మహిళలు మాత్రమే ఎప్పుడు స్వామి రథాన్ని లాగుతారు?
14. భగీరథునికి శక్తినిచ్చిందెవరు?
15. మేరుపర్వతం పుత్రుడెవరు?

| | |
|---|---|
| 1 | |
| 2 | |
| 3 | |
| 4 | |
| 5 | |
| 6 | |
| 7 | |
| 8 | |
| 9 | |
| 10 | |
| 11 | |
| 12 | |
| 13 | |
| 14 | |
| 15 | |

పేరు: ______________________________

చిరునామా: ______________________________

______________________________

______________________________

పిన్‌కోడ్: ________________ ఫోన్: ________________


# శ్రీ వేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక

ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com


## గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. గురు పూర్ణిమ
2. గోవింద దాసు
3. దూర్వాసుడు
4. శ్రీపర్ణి వృక్షం
5. శార్దూలుడు
6. 02-07-2026న
7. కూర్మరూపంలో మంధరగిరిని మోయుట
8. పొగడ పువ్వు
9. ఆలయ గోపురం
10. కావ్యవిత్తు
11. వినత
12. బలిచక్రవర్తి
13. నందిఘోష
14. పెరియ తిరువడి వాహనం
15. కస్తూరి

## సరైన సమాధానాలు రాసినవారు

ఎవ్వరూ సరైన జవాబులు రాయలేదు


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. **Editor: Pullagurla Saireddy,** Cell: **93482 12354.** Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com



RNI No.: APTEL/2008/23122 | Postal Registration No: HSE/879/2025-2027 | Published on 28th and Licenced to Post On 29th & 30th of Every Month | Posting at BPC-IV Patrika channel, Nampally, Hyderabad-01.



If Un Delivered Please Return to:
**SRI VENKATESHAM,**
(Sri Venkateshwara Maha Mantra Peetham)
H.No: 1-1-53, Street No. 1, Habsiguda,
Hyderabad-500007.Ph: 040-27175050.

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు
https://www.srivenkatesham.org లో చదవండి.

Srivenkatesham Magazine in Google Drive
https://drive.google.com/drive/folders/1jOWBeoUHjF4Qhn4wl-d9eUGlh6kVYyLq